సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 19-2-2021 ₹15/-




# చక్కని కుటుంబం చల్లని సమాజం



సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in

సంపుటి 43 సంచిక: 8 హైదరాబాద్
శుక్రవారం 19 ఫిబ్రవరి 2021 రూ.15-00
6 రజ్జబ్ 1442 హిజ్రీ

**తొలిగీటు**

## బంధువు హక్కు ఇవ్వనివాడు స్వర్గంలో ప్రవేశించడు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షరీఫ్**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

**సేల్స్ మేనేజర్**
**ముహమ్మద్ యాసీన్, 9700255736**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com

## కుటుంబ బలం...

అనుబంధం ఆత్మీయం
కాకూడదు నాటకం
మానవీయ పునాదిపై
నిలబడాలి కుటుంబం!

కౌటుంబిక ఐక్యతే
సామాజిక పటిష్టత
బలపడితే బంధాలు
అదేకదా విశిష్టత!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

## లోపల...

| | |
|---|---|
| సంస్కరణ ఎక్కడ ప్రారంభించాలి? | 04 |
| చక్కని కుటుంబం చల్లని సమాజం | 05 |
| పటిష్ట కుటుంబంతో పటిష్ట సమాజం | 11 |
| కుటుంబాన్ని కాపాడుకుందాం | 12 |
| హమారా ఘర్ | 13 |
| సుందర సమాజానికి మూలం | 14 |
| మీ ఇల్లు ఇలా ఉందా? | 16 |
| ఒకే ఇల్లు... ఒక్కటే కుటుంబం | 18 |
| సామాజిక జాడ్యాలు కుటుంబ వ్యవస్థకు గొడ్డలిపెట్టు | 20 |
| కూలుతున్న కుటుంబాలను నిలబెట్టేదెలా? | 22 |
| కుటుంబ వ్యవస్థ.. సవాళ్ళు, పరిష్కార మార్గాలు! | 24 |
| ఫ్యామిలీ సర్వే (కథ) | 26 |
| అదే గొప్ప ఆస్తి! | 27 |
| ఐడియల్ ఫ్యామిలీ | 28 |
| కుటుంబ వ్యవస్థకు పునాది | 31 |
| ఫ్యామిలీ కన్వెన్షన్ (కథ) | 32 |
| మెరుగైన సమాజం కోసం... | 34 |
| బంధుత్వ సంబంధాలు | 36 |
| గృహస్థ జీవితం | 38 |
| సుందర సమాజం | 40 |
| కుటుంబ వైభవం | 42 |

# ఆలోచన

## సంస్కరణ ఎక్కడ ప్రారంభించాలి?

**ఇస్లామ్** ప్రధానంగా సంస్కరణా ప్రధానమయిన ధర్మం. అది మానవుని సంస్కరించగోరుతుంది. మానవుని అంతర్ బాహ్యాలను సంస్కరిస్తుంది. ఆత్మ మొదలుకుని శరీరావయవాలనన్నింటినీ ప్రక్షాళిస్తుంది. అలాగే మానవ మనుగడలోని సకల సామూహిక రంగాల ప్రతి భాగాన్నీ పరిశుద్ధపరుస్తుంది. వాటిలో ప్రథమమయింది సమాజం, సమాజానికి మూలం కుటుంబం. కుటుంబానికి మూలం ఇద్దరు మానవులు- మానవుల ఓ జంట- ఓ స్త్రీ, ఓ పురుషుడు!

కుటుంబానికి మూల స్థానం గల మానవుల ఈ జంట సంస్కరించ బడితే- అంటే ఓ కుటుంబం సంస్కరించబడితే- సకల కుటుంబాలు సంస్కరించబడితే- సమాజం, దేశం, ప్రపంచమే సంస్కరణాభి ముఖమవుతుంది. దానికి మూలతః కుటుంబం, అంటే మానవుల జంట, మానవులు: మానవుడు- స్త్రీతోపాటు పురుషుడు, పురుషునితో పాటు స్త్రీ సంస్కరించబడాలి. అదీ అసలు రహస్యం. వారు సంస్క రించబడినప్పుడే వారితో ఏర్పడిన ఈ సంసారం, ఈ ప్రపంచం సంస్కారవంతమవుతుంది. అందుకే ఇస్లామ్, ఇస్లామ్ మూల గ్రంథం కుర్ఆన్ ప్రథమంగా మానవుణ్ణి సంబోధించి సంస్కరించగోరు తుంది.

వాస్తవానికి దైవవిధేయతా ధర్మమయిన ఇస్లామ్ ఒక్కటే కాదు, దైవ బోధన ఆధారంగా రూపొందిన ఏ ధర్మమయినా మానవుణ్ణి, తద్వారా కుటుంబాన్ని సంస్కరించగోరుతుంది. ప్రపంచ మతధర్మాల చరిత్ర మనకు తెలిపే మానవుని యదార్థగాథ ఇదే. మానవ సమాజం సజావుగా విలసిల్లిన ప్రతిచోటా కుటుంబం ఆధారంగానే సమాజం సమృద్ధమయింది, సకల విధాలా పటిష్ఠమయింది, సహజంగా ప్రగతి పథాన చరిత్ర పుటల్లో తన స్థానాన్ని భద్రపరచుకుంది. సింధూ తీరాలు మొదలుకుని నైలు తీరాల వరకు, మెసపటోమియా భూములు మొదలుకుని ఈజిప్ట్ ఎడారుల వరకు ప్రాచీన నాగరికతలన్నీ చాటే సత్యాలివే. అయితే ఒకటి మాత్రం యదార్థం. మనిషి ఏ మేరకు సంస్కారవంతుడయ్యాడో, ఏ మేరకు నాగరికతను పుణికి పుచ్చుకు న్నాడో ఆ స్థాయిలోనే అతని కుటుంబం, అతని సమాజం వృద్ధీ వికాసాలు సాధించగలిగాయి. ఆ వికాస పరిణామ క్రమమే చివరి దశలో ఇస్లామీయ వ్యక్తిత్వ నిర్మాణంగాను, ఇస్లామీయ కుటుంబ వ్యవస్థగానూ, ఉత్తమ ఇస్లామీయ సమాజంగానూ అభివృద్ధి చెందాయి.

ఆ కుటుంబ మూలాలయిన ఆలుమగల లక్షణాలలో ముఖ్యమ యినవి ఒండొకరి పట్ల ప్రేమ, శ్రద్ధ, కృప, దయ, దీక్ష, క్షమ, ఆశ, తోడు, తోడ్పాటు, త్యాగం, సహకారం, సహనం, మమకారం, అవగాహన, అనురక్తి, అనురాగం, అనుబంధం, అభిమానం, ఆదరం, నమ్మకం- ఇవన్నీ సమతాభావంతోపాటు ఉన్నప్పుడే ఆలుమగల జంట గట్టి పునాదులపైన నిలబడగలుగుతుంది. ఇటువంటి జంట ద్వారా ఏర్పడిన కుటుంబమే నలుగురికి ఆదర్శప్రాయమయిన కుటుంబంగా నాలుగు కాలాలపాటు నిలువగలుగుతుంది. అటువంటి గట్టి కుటుంబమే దేశానికి పునాది రాయిగా అలరార గలుగుతుంది. కుటుంబమంటే మాట కాదు, భార్యాభర్తలు, అన్నదమ్ములు, తల్లిదండ్రులు, అక్కాచెల్లెండ్రు, వదినెలు, మరదళ్ళు, బావలు బావమరిదిళ్ళు, ఇంకా, ఇంకా అనేక మందితో కూడుకున్న ఆనందభరితమయిన సంబంధ బాంధవ్యాలు. అదీ కుటుంబం. అటువంటి గట్టి కుటుంబాల సమ్మేళనమే బలిష్టమయిన దేశానికి ఆనవాలు!!

భారతదేశం నైతిక మూల్యాలకు పట్టుగొమ్మ. ఇక్కడి సంస్కృతీ నాగరికతలు ప్రపంచ ప్రాచీన నాగరికతా సంస్కృతులలో ఎన్నదగినవిగా చెప్పుకుంటారు. కారణం విశ్వజనీన నైతిక సూత్రాలకు కట్టుబడిన సంస్కృతి కావటమే. లేకపోతే ఎప్పుడో మిగతా సంస్కృతుల్లానే ఇది కూడా సమసిపోవలసిందే. అయితే ఇటీవల రెండు శతాబ్దులుగా పాశ్చాత్యుల సాంగత్యం మూలాన అబ్బిన దుర్గుణాల వల్ల భారతీయ కుటుంబ వ్యవస్థలోనూ ఛిన్నాభిన్నమయ్యే బీజాలు అంకురార్పణ వేసుకున్నాయి. కొన్ని అంశాలు భారతీయ నైతిక ప్రమాణాలకు భిన్నమయినవి పొడసూపనారంభించాయి. అందువల్లనే చాలా మంది దేశ నిజ ప్రేమికులు, దేశాన్నీ దేశ నిజ మూలాలయిన నైతిక ధార్మిక పునాదుల్ని కదిలించివేస్తున్న ఈ ప్రమాదాన్ని పసిగట్టి దేశవాసుల్ని హెచ్చరించడం మొదలెట్టారు.

జమాఅతె ఇస్లామీ హింద్ అర్ధ శతాబ్దికి పైగా అటు దేశ నాయకుల్ని ఇటు సామాన్య ప్రజల్నీ హెచ్చరిస్తూనే వస్తోంది, ముంచుకు వస్తోన్న ప్రమాదాన్ని గురించి నడిబజారుల్లో, వీధి వీధిన, జనావాసాల్లో, పత్రికా ముఖంగానూ, ప్రజా వేదికల ద్వారానూ వాదులాడుతూ, వేడు కుంటూ, వివిధ రీతుల్లో తన మొర వినిపిస్తూనే వస్తోంది :

“జనులారా, మీ ప్రభువుకు భయపడండి, ఆయన మిమ్మల్ని ఒకే జీవం ద్వారా సృష్టించాడు, అదే జీవంతో దాని జతను చేశాడు, వీరిరువురి ద్వారా అనేకమంది పురుషులూ స్త్రీలను ప్రపంచంలో వ్యాపింపజేశాడు. ఆ దైవానికి భయపడండి, ఆయన పేరు చెప్పుకునే మీరు పరస్పరం మీ హక్కులను అడుగుతారు; బంధువర్గం, చుట్టరికపు అనుబంధాలు చెడకుండా మెలగండి. నమ్మండి, అల్లాహ్ మిమ్మల్ని కనిపెట్టుకునే ఉన్నాడు” (అన్ నిసా 4: 1).

“జనులారా, మేము మిమ్మల్ని ఒకే పురుషుడు, ఒకే స్త్రీ ద్వారా పుట్టించాము. తరువాత మిమ్మల్ని జాతులు, తెగలుగా చేశాము, మీరు ఒకరినొకరు గుర్తుంచుకోగలగాలని. యదార్థానికి మీలో అందరికన్నా అధికంగా నిష్ఠాపరుడే అల్లాహ్ దృష్టిలో అత్యధిక గౌరవనీయుడు. నిశ్చయంగా అల్లాహ్ అన్ని విషయాలూ ఎరిగిన వాడు, అన్ని సంగతులూ తెలిసినవాడు.” (49: అల్ హుజురాత్ : 13)

నిజానికి ఏది ఏమయినా అసలు సంస్కరించవలసింది మానవ సమాజాన్నే, అంటే సంస్కరణకు అసలు భూమిక మానవుడే!

(ఎస్.ఎమ్. మలిక్)

అబ్దుల్ వాహెద్




# చక్కని కుటుంబం చల్లని సమాజం

**'ఇంటి పేరు అనురాగం ముద్దుపేరు మమకారం**
**మా ఇల్లే బృందావనం'**
**గృహమే మాకు అమ్మ, మల్లె కొమ్మ, స్వర్గసీమ...**
**గృహమే కదా స్వర్గ సీమ ...**

**'కుటుంబం ఉమ్మడి కుటుంబం/ చల్లని హృదయాలకు చక్కని ప్రతిబింబం/ మనసులన్నీ పెనవేసీ తలపులన్నీ కలబోసి/ మమతలు పండించేది మంచితనం పెంచేదీ'...**

ఇలాంటి చాలా పాటలు తెలుగులో మనం విన్నాం. ఇల్లు, కుటుంబం ఎంత ముఖ్యమైనవో చెప్పే కవితలు, పాటలు చాలా ఉన్నాయి.

కుటుంబం ప్రాముఖ్యత గుర్తించాము కాబట్టే ఏటా సెప్టెంబరు చివరి సోమవారం జాతీయ కుటుంబ దినోత్సవం జరుపుకుంటున్నాం. అలాగే అంతర్జాతీయ స్థాయిలోను కుటుంబం గురించి అవగాహన పెంచడానికి అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం మే 15వ తేదీన జరుగుతోంది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 1993లో అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం మే 15వ తేదీగా ప్రకటించింది. కుటుంబం గురించి చైతన్యం పెంచడానికి, కుటుంబ జీవనానికి ఎదురవుతున్న సమస్యల పట్ల అవగాహన పెంచడానికి పూనుకుంది.

కుటుంబం లేకపోతే మనిషి నాగరికతేలేదు. ఈ వాస్తవాన్ని ప్రజల్లో ప్రచారం చేయడానికి, కుటుంబం ఎంత ముఖ్యమైనదో అవగాహన కల్పించడానికి జమాఅతె ఇస్లామీ హింద్ ఫిబ్రవరి 19 నుంచి 29వ తేదీ వరకు పదిరోజుల ఉద్యమాన్ని చేపట్టింది. బలమైన కుటుంబం బలమైన సమాజం అనే నినాదంతో జమాఅత్ చేపట్టిన ఈ ఉద్యమం సందర్భంగా కుటుంబం గురించి, కుటుంబ జీవితం గురించి కొన్ని మాటలు పునశ్చరణ చేసుకుందాం.

కుటుంబం అనే పదం వినబడినప్పుడు మన మనసులో మెదిలే చిత్రాలేమిటి? ఎలాంటి అనుభూతి మనకు కలుగుతుంది అనేవి అందరూ ఆలోచించవలసిన ప్రశ్నలు. భార్యాపిల్లలు, అక్కా చెల్లెళ్ళు, అన్నాదమ్ములు, తాత నాయనమ్మ, అమ్మమ్మ, మేనత్తలు, మేనమామలు, వారి పిల్లలు ఇలా చాలా బంధుత్వాలు మన కళ్ళ ముందు మెదులుతాయి. ఈ బంధుత్వాలన్నీ రక్తసంబంధాలు కావచ్చు, లేదా వైవాహిక సంబంధాల వల్ల ఏర్పడిన బంధుత్వాలు కావచ్చు. ఏది ఏమైనా వివాహ సంబంధం ద్వారా మాత్రమే ఒక కుటుంబం ఏర్పడుతుంది.

**అల్లాహ్ అన్నింటిని జంటలుగా సృష్టించాడు. "ప్రతి వస్తువునూ మేము జంటలుగా సృష్టించాము" (దివ్యఖుర్ఆన్ : 51:49).**

అన్నింటిని జంటలుగానే సృష్టించాడు దైవం. మనుషులను జంటలుగానే సృష్టించాడు. ఆ జంట ఆడమగ. ఇద్దరు కలిసి

వివాహ సంబంధం ద్వారా కుటుంబాన్ని ప్రారంభిస్తారు. అరబీ భాషలో కుటుంబాన్ని ఉస్రా అంటారు. ఈ మాటకు సమైక్యత, సన్నిహిత సంబంధం, రక్షణ కవచం వంటి అర్థాలున్నాయి. ఇస్లామ్ ప్రకారం కుటుంబం అనేది ఆడమగ వైవాహిక వ్యవస్థ ద్వారా జంటగా ఏర్పడడం, ఆ విధంగా ఏర్పడే సమైక్యత, వారి కలయిక వల్ల జన్మించే తర్వాతి తరాలు, వారందరి సన్నిహిత సంబంధాలవల్ల ఏర్పడే రక్షణ ఈ భావాలన్నీ ఇందులో ఉన్నాయి.

ఇస్లాములో కుటుంబ సంబంధాలను, బాంధవ్యాలను కొనసాగించడం చాలా ముఖ్యం. స్వయంగా దివ్యఖుర్ఆన్ ఈ విషయమై హెచ్చరించింది:

"మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి పుట్టించాడు. అదే ప్రాణి నుండి దాని జతను సృష్టించాడు. ఇంకా ఆ జంట ద్వారా ఎంతోమంది పురుషులను, స్త్రీలను అవనిలో వ్యాపింపజేశాడు. ఏ దేవుని పేరు చెప్పుకుని మీరు పరస్పరం మీ మీ హక్కులను కోరుకుంటారో, ఆ దేవునికి భయపడండి. బంధుత్వ సంబంధాలను తెంచటం మానుకోండి. అల్లాహ్ మిమ్మల్ని పరికిస్తున్నాడనే విషయాన్ని తెలుసుకోండి". (దివ్యఖుర్ఆన్ : 4 : 1)

ఈ దివ్యఖుర్ఆన్ వాక్యం గురించి ఇమామ్ జాఫరుస్సాదిక్ వివరిస్తూ కౌటుంబిక సంబంధాల ప్రాముఖ్యాన్ని ఈ దివ్య ఖుర్ఆన్ వాక్యం నొక్కి చెబుతుందని అన్నారు. బంధుత్వ సంబంధాలను కాపాడడాన్ని అరబీ భాషలు సిలాతుర్రహ్మా అంటారు. ఇందులో రహ్మా అనే పదానికి గర్భాశయం అని అర్థం. రహీం అనే ధాతువు నుంచి ఈ పదం వచ్చింది. రహీం అంటే అపారకృపాశీలత. సృష్టికర్త అల్లాహ్ అపారకృపాశీలుడు.

కాబట్టి, ఇస్లామ్ ప్రకారం బంధుత్వ సంబంధాలను కాపాడాలి. అందరితోను మేలైన రీతిలో వ్యవహరించాలి. దివ్యఖుర్ఆన్ బంధువుల గురించి 23 సార్లు ప్రస్తావించింది. "బంధువుల పట్ల మీ విధులను నిర్వహించండి" (దివ్య ఖుర్ఆన్ 17:26) అని అల్లాహ్ ఆదేశించాడు.

మరోచోట దివ్యఖుర్ఆన్ ఇలా నొక్కి చెప్పింది:

"... తల్లిదండ్రుల ఎడల సద్భావంతో మెలగండి. బంధువులూ, అనాథులూ, నిరుపేదల పట్ల మంచిగా వ్యవహరించండి..." (దివ్యఖుర్ఆన్ 4:36)

ఈ వాక్యంలో తల్లిదండ్రులను, బంధువులను ఎలా చూసుకోవాలో ఆదేశపూర్వకంగా చెప్పడం జరిగింది. బంధువులెవరైనా మీ పట్ల అనుచితంగా వ్యవహరించినా సరే వారితో సంబంధాన్ని తెంచుకోరాదంటుంది ఇస్లామ్. ప్రవక్త ముహమ్మద్ (స) ఈ విషయమై మరింత స్పష్టంగా చెప్పారు: "మీ కుటుంబసభ్యుల్లో ఎవరితోను సంబంధాన్ని తెంచుకోవద్దు, ఒకవేళ వారు మీతో సంబంధాన్ని తెంచుకున్నా సరే (మీరా పని చేయవద్దు)" అన్నారు. మరో సందర్భంలో ప్రవక్త ఈ విషయాన్ని మరింత నొక్కి చెబుతూ "తన ఉపాధి పెరగాలని కోరుకునేవాడు, తన మృత్యువు ఆలస్యమవ్వాలని కోరుకునేవాడు తన బంధువుల పట్ల శ్రద్ధ చూపాలి" అన్నారు.

ఇస్లామ్ ప్రతి ఒక్కరి హక్కుల గురించి స్పష్టంగా చెప్పింది. కుటుంబ సభ్యుల్లోను ప్రతి ఒక్కరికి తమ తమ హక్కులున్నాయి. ఇమామ్ సజ్జాద్ ఈ హక్కుల గురించి స్పష్టంగా చెప్పారు. ప్రాధాన్యతా క్రమాన్ని కూడా వివరించారు. తల్లి హక్కులు, తండ్రి హక్కులు, తోబుట్టినవారి హక్కులు, ఇలా బంధుత్వక్రమంలో ఎవరు ఎంత ఎక్కువ సన్నిహితంగా ఉంటే అంతే అధికంగా హక్కులు కలిగి ఉంటారు.

మనం ఇంతకు ముందు చెప్పుకున్నట్లు కుటుంబం అనేది స్త్రీ పురుషులిద్దరు వైవాహిక బంధం ద్వారా కలవడం వల్ల ఏర్పడుతుంది. ఇస్లామ్‌లో వివాహాన్ని నికాహ్ అంటారు. నికాహ్ అనేది అరబీ పదం. నికాహ్ అంటే అర్థం ఒప్పందం. వివాహానికి ఉపయోగించే మరో పదం అక్ద్. ఈ పదానికి అర్థం కూడా ఒప్పందమే. ఇది స్త్రీపురుషుల మధ్య కలిసి జీవించడానికి చేసుకునే బలమైన ఒప్పందం. దివ్యఖుర్ఆన్ దీని గురించి మాట్లాడుతూ "వారు మీ నుండి గట్టి వాగ్దానం తీసుకున్న తరువాత.." అని పేర్కొంది. స్త్రీపురుషుల మధ్య గట్టి వాగ్దానం, బలమైన ఒప్పందం ఇది. వివాహానికి సంబంధించి దివ్యఖుర్ఆన్ ఉపయోగించిన మరో పదం "హిస్న్". ఈ పదానికి అర్థం రక్షణ కల్పించే కోట. వివాహం అనేది పవిత్రతను కాపాడే కోట వంటిది. దివ్యఖుర్ఆన్ ఈ విషయాన్ని స్పష్టంగా ప్రకటించింది:

"ఆయన మీ కొరకు భార్యలను మీ జాతిలో నుండే సృష్టించాడు- మీరు వారివద్ద శాంతిని పొందటానికి, మీ మధ్య ప్రేమనూ, కారుణ్యాన్నీ సృజించాడు. నిశ్చయంగా ఆలోచనాపరులకు ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి." (దివ్య ఖుర్ఆన్ 30:21)

వివాహం ద్వారా ఆడమగ మధ్య దాంపత్య సంబంధం ఏర్పడుతుంది. లైంగిక సంబంధం ధర్మబద్ధం, న్యాయబద్ధం అవుతుంది. దంపతుల మధ్య ప్రేమ, కారుణ్య భావాలు ఏర్పడడం, ఒకరి నుంచి మరొకరు శాంతిని పొందడం అనే మాటలు గమనించదగ్గవి. వివాహం అనేది రెండు ముఖ్యమైన ప్రయోజనాలను సాధిస్తుంది. సంతానం పొందడం, శాంతిని పొందడం ఆ రెండు ప్రయోజనాలు. వివాహం వల్ల దంపతులు ఒకరికి ఒకరు తోడవుతారు. శారీరక, ఆధ్యాత్మిక, మానసిక ప్రశాంతతను పొందుతారు. భావావేశాలు పంచుకునే తోడు వారికి దొరుకుతుంది. వారి మధ్య ప్రేమ, కారుణ్యం, ఆత్మీయత, నమ్మకం, సాంత్వన ఏర్పడతాయి. వారి పిల్లల ఆలనాపాలనా చూస్తారు. ఇలా కుటుంబం ఏర్పడుతుంది.

వివాహ వ్యవస్థ బలంగా ఉన్న సమాజంలో శాంతి వెల్లివిరుస్తుంది. వ్యభిచారం, అక్రమ సంబంధాల కల్లోలాలు ఉండవు. వివాహాన్ని ప్రోత్సహించిన ఇస్లామ్, అక్రమ సంబంధాలను తీవ్రంగా నిషేధించింది.

"వ్యభిచారం దరిదాపులకు కూడా పోకండి. అది అతిదుష్ట కార్యం. బహుచెడ్డ మార్గం." (దివ్య ఖుర్ఆన్ 17:31)

కుటుంబ వ్యవస్థ సమాజంలో బలంగా లేకపోతే అనేక దుష్పరిణామాలు ఏర్పడతాయి. ఎందుకంటే, వ్యక్తి సామాజిక జీవనానికి పునాది కుటుంబమే. సమాజానికి వ్యక్తి యూనిట్ కాదు, నిజానికి కుటుంబమే యూనిట్. కుటుంబానికి పునాది వివాహం. కుటుంబం ప్రాచీన కాలం నుంచి కొనసాగుతు వస్తున్న సామాజిక నిర్మాణం. సమాజంలో సమైక్యతకు ఆధారం కుటుంబమే.

కుటుంబం పటిష్టంగా ఉండాలంటే కుటుంబ సభ్యులు కుటుంబ విలువలకు కట్టుబడాలి. దివ్యఖుర్ఆన్ ఈ విషయాలను స్పష్టంగా చెప్పింది:

"పేదరికానికి భయపడి మీ సంతానాన్ని హత్య చేయకండి. మేము మీకూ ఉపాధినిస్తున్నాము. వారికీ ఇస్తాము." (దివ్య ఖుర్ఆన్ 6:151)

"పేదరికానికి భయపడి మీరు మీ సంతానాన్ని హత్య చేయకండి. మేము వారికీ ఉపాధిని ఇస్తాము, మీకూ ఇస్తాము. వాస్తవానికి వారిని హత్య చేయటం ఒక పెద్ద నేరం" (దివ్యఖుర్ఆన్ 17:31)

సంతానాన్ని ముఖ్యంగా ఆడపిల్లలను ఒకప్పుడు పుట్టిన తర్వాత హతమార్చేవారు, ఇప్పుడు పుట్టకముందే చంపేస్తున్నారు. ఈ ధోరణిని దివ్యఖుర్ఆన్ తీవ్రంగా నిరసించింది:

"సజీవంగా పాతిపెట్టబడిన బాలికను, నీవు ఏ తప్పువల్ల హత్య చేయబడ్డావని అడిగినప్పుడు.." (దివ్య ఖుర్ఆన్ 81:8-9)

ఇస్లామ్ పూర్వకాలంలో అరబ్బుల్లో ఈ దురాచారం ఉండేది. మగపిల్లలే కావాలని కోరుకునేవారు. ఆడపిల్లలు పుడితే భరించలేక సజీవంగా సమాధి చేసేవారు. ఈ దురాచారాన్ని ఇస్లామ్ నిర్మూలించింది. ఇప్పుడు అరబ్బుల్లో ఈ దురాచారం ఎక్కడా కనబడదు. కాని ప్రపంచంలో అనేక ప్రాంతాల్లో ఆడపిల్లలను పుట్టకముందే హతమార్చే దురాచారాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా మన దేశంలో కూడా ఈ దురాచారం కనిపిస్తుంది. ఆడశిశువుల గురించి దివ్యఖుర్ఆన్ మరో సందర్భంలోను ప్రత్యేకంగా ప్రస్తావించింది:

"వారిలో ఎవడికైనా కూతురు పుట్టినదనే శుభవార్తను అందజేస్తే అతడి ముఖాన్ని నల్లని ఛాయలు ఆవరిస్తాయి. అతడు లోలోన కుమిలిపోతాడు. ఈ దుర్వార్త విన్న తరువాత ఇక లోకులకు ఎలా ముఖం చూపాలి అని అతడు నక్కినక్కి తిరుగుతూ ఉంటాడు. అవమానాన్ని భరిస్తూ కూతుర్ని ఇంట్లో ఉంచుకోవాలా లేక ఆమెను మట్టిలో పాతిపెట్టాలా? అని ఆలోచిస్తాడు- చూడు! వారు దేవుని విషయంలో చేసే నిర్ణయాలు ఎంత దుష్టమైనవో!" (దివ్య ఖుర్ఆన్ 16: 58-59)

ఆడపిల్లల గురించి ప్రవక్త ముహమ్మద్ (స) చెప్పిన మాటలు కూడా ఇక్కడ పేర్కొనదగినవి. "ఇద్దరు అమ్మాయిలను చక్కగా, ప్రేమాభిమానాలతో పెంచి పెద్దచేసిన వ్యక్తి నాతో స్వర్గంలో నాతో చాలా సన్నిహితంగా ఉంటాడు" అన్నారు.

ఇవి కుటుంబ విలువలు. సంతానంలో మగపిల్లలను, ఆడపిల్లలను అందరినీ సమానంగా చూడాలనే బోధనలు. సంతానాన్ని పోషించడం మాత్రమే కాదు, వారి పట్ల ప్రేమాభిమానాలతో వ్యవహరించాలి. పిల్లలకు తమ హక్కుల గురించి అవగాహన ఉండదు, హక్కులను అడిగి సాధించుకోవాలనే చైతన్యమూ ఉండదు. కాబట్టి వారి హక్కులు వారికి ఇచ్చే బాధ్యత తల్లిదండ్రులపైనే ఉంటుంది. ఒక సందర్భంలో ఒక వ్యక్తి తన కుమారుడిని ముద్దాడి తన ఒళ్ళో కూర్చోబెట్టుకోవడం ప్రవక్త చూశారు. వెంటనే ప్రవక్త అతనితో నీ కూతురిని కూడా అలాగే ముద్దు చేయాలని గట్టిగా చెప్పారు.

దేవుని తరపున ప్రవక్త వద్దకు వచ్చిన మొదటి వాక్యం "చదువు" అనేది. స్త్రీపురుషులందరు చదువుకోవాలని, విద్యార్జన తప్పనిసరి విధి అని ప్రవక్త ఉపదేశించారు. అంతేకాదు, తల్లిదండ్రులు పిల్లల విద్యాభ్యాసానికి తగిన ఏర్పాట్లు చేయాలి. ఇందులో ఆడపిల్లలు, మగపిల్లలనే తేడా చూపించరాదు. ఇవి ఇస్లామ్ బోధించే కుటుంబ విలువలు. వీటిని పాటిస్తున్నారా? అనేది ఎవరికి వారు ఆలోచించుకోవలసిన ప్రశ్న.

పిల్లల హక్కుల గురించి ఇంతవరకు మాట్లాడుకున్నాం. అలాగే వివాహం ద్వారా స్త్రీపురుషులు ఒకరి నుంచి మరొకరు శాంతిని స్వాంతనను సంతానాన్ని పొందుతారని చెప్పుకున్నాం. అయితే దాంపత్యబంధంలోకి వచ్చిన దంపతులకు ఒకరిపై మరొకరికి ఎలాంటి హక్కులుంటాయి అనేది కూడా చాలా ముఖ్యమైన విషయం. దాంపత్య హక్కుల గురించి స్పష్టమైన అవగాహన లేకపోవడం వల్ల వివాదాలు, స్పర్థలు తలెత్తుతాయి. దివ్య ఖుర్ఆన్ భార్యను ముహ్సినా అనే పదంతో వర్ణించింది. ఈ పదానికి అర్థం చెడునుంచి కాపాడే కోట వంటిది. ఉత్తమ ఇల్లాలు భర్తను సన్మార్గాన నడిచేలా చేస్తుంది. చెడులకు పాల్పడకుండా కాపాడుతుంది. ప్రవక్త ముహమ్మద్(స) మాటల్లో చెప్పాలంటే, "....మీలో వివాహం చేసుకునే యోగ్యత ఉన్నవారు వెంటనే వివాహం చేసుకోవాలి". హజ్రత్ అనస్ (రజి) పేర్కొన్న మరో హదీసులో ప్రవక్త ఇలా అన్నారు, "పెళ్ళి చేసుకున్నవారు ధార్మిక బాధ్యతల్లో సగం పూర్తి చేశారు". వివాహం వల్ల లైంగిక విశృంఖలత్వానికి అడ్డుకట్ట పడుతుంది. సమాజంలో ప్రశాంత వాతావరణానికి ఇంది ఎంతో అవసరం.

లైంగిక సంబంధాన్ని ధర్మబద్ధం చేసేది వివాహం. వివాహం ఒక ఒప్పందం అని ముందే చెప్పుకున్నాం, వివాహం జరగాలంటే వధూవరులిద్దరి అంగీకారం తప్పనిసరి. బలవంతంగా వివాహం చేయించడం సాధ్యం కాదు. దివ్యఖుర్ఆన్ ఈ విషయమై స్పష్టంగా చెప్పిన మాటలు "విశ్వసించిన ప్రజలారా! బలవంతంగా స్త్రీలకు వారసులు కావటం మీకు ధర్మసమ్మతం కాదు." (దివ్య ఖుర్ఆన్ 4:19)

ప్రవక్త కాలంలో ఇలాంటి ఒక కేసు వచ్చింది. ఒక మహిళ ప్రవక్త వద్దకు ఫిర్యాదుతో వచ్చింది. ఆమెకు ఇష్టంలేని వ్యక్తితో ఆమె తండ్రి పెళ్ళి చేశాడు. ఈ విషయమై ఆమె ప్రవక్తతో ఫిర్యాదు చేసిన వెంటనే ఆయన ఆ వివాహాన్ని రద్దు చేశారు. దివ్య ఖుర్ఆన్‌లోని రెండు వాక్యాలను అర్థం చేసుకోవడంలో కొందరు పొరబడుతున్నారు. ముఖ్యంగా పురుషులు ఈ వాక్యాల ఆధారంగా తమకు అధిక ప్రాముఖ్యం ఉందని భావిస్తున్నారు. ఈ రెండు వాక్యాలేమిటంటే:

"మగవారికి మహిళలపై ఉన్నటువంటి హక్కులే ధర్మం ప్రకారం మహిళలకు కూడా మగవారిపై ఉన్నాయి. కాని పురుషులకు స్త్రీలపై కొంచెం ఆధిక్యం ఉన్నది. అందరిపై అల్లాహ్ కు ఆధిక్యం ఉన్నది. ఆయన సర్వాధికారి, సర్వజ్ఞాని, వివేచనాపరుడు." (దివ్య ఖుర్ఆన్ 2:228)

ఇలాంటిదే మరో వాక్యం
"పురుషులు స్త్రీలకు సంరక్షకులు. ఎందుకంటే అల్లాహ్ వారిలో ఒకరికి మరొకరిపై ఆధిక్యతను ప్రసాదించటం వల్ల, ఇంకా పురు షులు తమ సంపదను వారికొరకు ఖర్చు చేస్తున్నందువల్ల" (దివ్య ఖుర్ఆన్ 4:34).

రెండవ వాక్యంలో ఆధిక్యం అనే పదానికి ఉపయోగించిన అరబీ పదం ఖవ్వామ్. ఈ పదానికి అర్థం "వారి కోసం నిలబడేవారు". మొదటి వాక్యంలో ఆధిక్యత అనే పదం ఉపయోగించబడింది. ఇక్కడ ఆధిక్యత అనే పదం బాధ్యతలకు సంబంధించింది. స్త్రీల కన్నా పురుషులకు ఎక్కువ బాధ్యత కుటుంబం విషయంలో ఉందనేది భావం. రెండవ వాక్యంలో ఈ విషయాన్ని మరింత స్పష్టంగా చెప్పడం జరిగింది. సంరక్షకులుగా ఉండాలని, వారి కోసం తమ సంపదను ఖర్చు చేయాలని స్పష్టంగా చెప్పడం జరిగింది.

అందువల్లనే, ఇస్లామ్ వివాహ ఒప్పందం ప్రకారం కుటుంబం కోసం తన సొమ్ము ఖర్చు చేయవలసిన బాధ్యత భార్యపై లేదు. కుటుంబ పోషణకు అయ్యే ఖర్చు మొత్తం భరించవలసింది భర్తయే. భార్య తన సొంత సంపాదన, ఆదాయం కలిగి ఉండ వచ్చు. ఆ సంపాదనను, ఆదాయాన్ని కుటుంబానికి ఖర్చు చేయ వలసిన బాధ్యత ఆమెపై లేదు. అంటే దివ్యఖుర్ఆన్ ఇక్కడ చెప్పిన ఆధిక్యత అనేది బాధ్యతలకు సంబంధించింది. దివ్య ఖుర్ఆన్ మరోచోట స్పష్టంగా సమానత్వం గురించి చెప్పిన వాక్యాన్ని పరిశీలిస్తే ఇక్కడ ఆధిక్యత అనేది కేవలం బాధ్యతలకు సంబంధించి చెప్పిన విషయమే అని తెలుస్తుంది.

"వారి పట్ల సద్భావంతో వ్యవహరించండి" (దివ్యఖుర్ఆన్ 4:19)

అంతేకాదు, భార్యాభర్తలు సమానులనే విషయాన్ని కూడా దివ్య ఖుర్ఆన్ ప్రకటించింది. "వారు మీకు దుస్తులు, మీరు వారికి దుస్తులు" (దివ్య ఖుర్ఆన్ 2:187)

భార్యాభర్తలు ఒకరికొకరు దుస్తుల వంటి వారని దివ్యఖుర్ఆన్ ప్రకటించింది. అంటే ఒకరి మానమర్యాదలను మరొకరు కాపాడతారని, ఒకరికి ఒకరు అందంగా మారుతారనే భావంతో దుస్తులనే పదాన్ని ఉపయోగించడం జరిగింది.

ఆర్థికంగా స్త్రీలకు ఇస్లాం కల్పించిన రక్షణలు కూడా ఇక్కడ గమనించదగ్గవి. తండ్రి ఆడపిల్ల పట్ల ఎలా వ్యవహరించాలో ఇంతకు ముందు మనం చదివాము. ఆమెను ప్రేమాభిమానా లతో పెంచి పెద్ద చేయవలసిన బాధ్యత తండ్రిపై ఉంది. ఒకవేళ తండ్రి లేకపోతే ఆ బాధ్యత సోదరుడిపై ఉంటుంది. పెళ్ళి తర్వాత ఆమె ఆర్థిక బాధ్యత భర్త స్వీకరించవలసి ఉంటుంది. భార్య ఆస్తిని లేదా సంపదను కుటుంబ ఖర్చులకు ఇవ్వవలసిన అవసరం లేదు. ఆర్థిక బాధ్యతలన్నీ భర్తపైనే ఉంటాయి. పెళ్ళికి ముందు ఆర్థిక రక్షణగా కొంత స్త్రీధనం భర్త ఆమెకు ఇవ్వవలసి ఉంటుంది. వివాహ సందర్భంలో మహర్ లేదా స్త్రీధనం ఇవ్వడం తప్పనిసరి.

"స్త్రీలకు వారి మహర్‌ను సంతోషంగా (విధిగా భావిస్తూ) చెల్లిం చండి. అయితే వారు తమంత తాము మహర్‌లో కొంత భాగాన్ని తమ ఇష్టపూర్వకంగా విడిచిపెడితే, దానిని మీరు సంతోషంగా అనుభవించండి" (దివ్య ఖుర్ఆన్ 4:4).

క్లుప్తంగా చెప్పాలంటే భార్యాభర్తలకు నిర్దిష్టమైన హక్కులు, బాధ్యతలు ఇస్లామీయ వైవాహిక వ్యవస్థలో ఉన్నాయి. ఆర్థిక బాధ్యతలన్నీ భర్తపై ఉన్నాయి. ఇంటిని కాపాడే, పిల్లల సాకే బాధ్యత భార్యపై ఉంది. ఈ హక్కులు బాధ్యతల్లో కొన్ని పంచు కోవడం జరిగితే అది పరస్పర సంప్రదింపులతోనే జరగాలి. ఏ విషయమైనా భార్యాభర్తలు పరస్పర సంప్రదింపులతోనే నిర్ణ యించుకోవాలి.

కుటుంబ విలువలు, హక్కులు, బాధ్యతల గురించి సరయిన స్పృహతో వ్యవహరిస్తే కటుంబంలో ఎలాంటి కలతలు తలెత్తవు. మనిషి నిత్యజీవితంలోని అవసరాలను నెరవేర్చే సహజమైన వ్యవస్థ వివాహ వ్యవస్థ అని అరిస్టాటిల్ పేర్కొన్నాడు. మానవ నాగరికతలో ప్రప్రథమమైన సాముదాయిక వ్యవస్థ కుటుంబమే అని అమెరికన్ తత్వవేత్త మిషెల్ జాన్ నోవాక్ అన్నాడు. కుటుంబం ప్రాచీన కాలం నుంచి కొనసాగుతూ వస్తున్న విద్యా, వైద్య, సంక్షేమ వ్యవస్థ అని పేర్కొన్నాడు.

వ్యక్తి వికాసంలో కుటుంబం పోషించే పాత్ర అత్యంత కీలక మైనది. కుటుంబ విలువలే వ్యక్తిగత విలువలుగా వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి. కుటుంబం అంటే కొందరికి భార్యాభర్త పిల్లలు మాత్రమే. మరి కొందరికి కుటుంబం అంటే తల్లిదండ్రులతో పాటు తాత నాయనమ్మలు కూడా ఉంటారు. ఏది ఏమైనా ఇప్పుడు ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోతున్నాయి. ఇస్లాం దృష్టిలో న్యూక్లియర్ కుటుంబాలు తప్పేమీ కాదు. ఎందుకంటే, భార్యా భర్తలకు అవసరమైన ప్రయివసీ అనేది ముఖ్యం. ఉమ్మడి కుటుంబంలో ఉన్నప్పటికీ ఈ ప్రయివసీకి ఏర్పాట్లు ఉండడం తప్పనిసరి అవసరం. ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయి, న్యూక్లి

యర్ కుటుంబాలు పెరగడంతో పాటు ఇప్పుడు సింగిల్ పేరెంట్ కుటుంబాలు కూడా ఎక్కువవుతున్నాయి. ఇది ఆందోళనకరమైన పరిణామం. సింగిల్ పేరెంట్ కుటుంబాల్లో తొంభైతొమ్మిది శాతం స్త్రీలు తమ సంతానాన్ని తమ రెక్కల కష్టంపై పోషిస్తున్న కుటుంబాలే కనబడతాయి. ఆధునిక పెట్టుబడిదారీ విధానం కుటుంబ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తోందని నగర జీవనాన్ని అధ్యయనం చేసిన వారంటున్నారు. మన దేశంలో కూడా పట్టణాల్లో తాగుడు, గృహహింస పెరగడం వల్ల కాపురాలు విచ్ఛిన్నమై కుటుంబాలను నడపాల్సిన బాధ్యతను మహిళలు చేపడుతున్నారు.

అమెరికాలో 30 సంవత్సరాల లోపు తల్లుల్లో దాదాపు సగం మంది ఒంటరి తల్లులేనని ఒక అధ్యయనంలో తెలిసింది. వివాహేతర సంబంధాల వల్ల జన్మిస్తున్న సంతానం 40 శాతం వరకు అక్కడ ఉంది. కుటుంబ వ్యవస్థ కుప్పకూలిపోతుందన్న భయాలు అక్కడి సమాజంలో కనబడుతున్నాయి. మన దేశంలోను ఈ పరిస్థితి నెమ్మదిగా పెరుగుతోంది. ఇక్కడ కూడా 5.4 శాతం ఒంటరి తల్లులున్నారు. నిజానికి ఒంటరి తండ్రులు చాలా అరుదు. ఈ వాస్తవాన్ని గమనిస్తే స్త్రీలపై దోపిడి ఎలా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

2015లో అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం సందర్భంగా కేన్యా ఫస్ట్ లేడి మార్గరేట్ మాట్లాడుతూ బలమైన కుటుంబాలుంటేనే బలమైన దేశంగా మారగలమని అన్నారు. ఈ సందర్భంగా ఆమె చెప్పిన మరో ముఖ్యమైన విషయం సమాజంలో వయోవృద్ధులు మనకు అనుభవాల సంపద అన్నారు. యువతరానికి అవసరమైన మార్గదర్శనం ఇవ్వగలరని చెప్పారు. కాని నేడు వృద్ధాశ్రమాలు పెరుగుతున్నాయి.

ఇస్లాం కుటుంబ విలువల చట్రంలో తల్లిదండ్రుల హక్కులను స్పష్టంగా నిర్దేశించడం జరిగింది.

“తల్లిదండ్రులతో మంచితనంతో వ్యవహరించండి. ఒకవేళ మీ వద్ద వారిలో ఒకరు గాని ఇద్దరు గాని ముసలివారై ఉంటే, వారి ముందు విసుగ్గా ‘‘ఉఫ్’’ అని కూడా అనకండి. వారిని కసురుకుంటూ సమాధానం ఇవ్వకండి. వారితో మర్యాదగా మాట్లాడండి. మృదుత్వమూ, దయాభావమూ కలిగి వారి ముందు వినమ్రులై ఉండండి. ఇలా ప్రార్థిస్తూ ఉండండి: “ప్రభూ! వారిపై కరుణ జూపు, బాల్యంలో వారు నన్ను కారుణ్యంతో, వాత్సల్యంతో పోషించినట్లు.” (దివ్య ఖుర్ఆన్:17: 23-24)

“తల్లిదండ్రులతో మంచిగా ప్రవర్తించండి” (దివ్యఖుర్ఆన్ 6:151)

అంతేకాదు, దివ్యఖుర్ఆన్ ఇంకా ఇలా చెప్పింది:

“మేము మానవునికి, అతను తన తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మెలగాలని ఉపదేశించాము. అతని తల్లి అతనిని ఎంతో శ్రమతో తన గర్భంలో పెట్టుకొని మోసింది, ఎంతో శ్రమతోనే అతనిని కన్నది. అతనిని గర్భంలో పెట్టుకొని మోసేందుకు, అతనిచే పాలు మాన్పించేందుకు ముప్పై మాసాలు పట్టింది. చివరకు అతను పరిపూర్ణ శక్తిని పొంది, నలభై సంవత్సరాల వయస్సుకు చేరినప్పుడు, ఇలా అన్నాడు, “నా ప్రభూ! నాకూ, నా తల్లిదండ్రులకూ నీవు ప్రసాదించిన మహాభాగ్యాలకు గాను, నీకు కృతజ్ఞతలు తెలిపే, నీవు ఇష్టపడే సత్కార్యాలు చేసే సద్బుద్ధిని నాకు ప్రసాదించు. ఇంకా, నా సంతానాన్ని కూడ మంచివారుగా చేసి నాకు సుఖాన్ని ఇవ్వు. నేను నీ సన్నిధిలో పశ్చాత్తాప పడుతూ నీ వైపునకు మరలుతున్నాను.” (దివ్య ఖుర్ఆన్ : 46:15)

“మానవుడు తన తల్లిదండ్రుల హక్కును గుర్తించాలని స్వయంగా మేమే అతనికి నిర్దేశించాము. అతని తల్లి బలహీనతపై బలహీనతను సహించి అతనిని తన కడుపున మోసింది. అతను పాలు విడిచిపెట్టటానికి రెండు సంవత్సరాలు పట్టింది. (ఇందుకే మేము అతనికి ఇలా బోధించాము) “నాకు కృతజ్ఞుడవై ఉండు, నీ తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపు. నా వైపునకే నీవు మరలి రావలసి ఉన్నది.” (దివ్య ఖుర్ఆన్ 31:14)

ప్రవక్త ముహమ్మద్(స) హదీసుల్లో ఒక హదీసు చాలా సందర్భాల్లో చాలా మంది ప్రస్తావిస్తూ ఉంటారు, అదేమంటే, “స్వర్గం తల్లి పాదాల క్రింద ఉంది”. ప్రవక్త చెప్పిన మరో మాట కూడా ఇక్కడ గుర్తు చేసుకుందాం. ఒక వ్యక్తి ప్రవక్త వద్దకు వచ్చి తాను ఎవరి పట్ల ఎక్కువ ప్రేమాభిమానాలు చూపించాలని, ఎవరిని ఎక్కువగా సేవించాలని అడిగాడు. దానికి ప్రవక్త జవాబిస్తూ మీ అమ్మ పట్ల అలా వ్యవహరించాలని అన్నారు. ఆ తర్వాతి స్థానం ఎవరిదని అడిగితే రెండవసారి కూడా ప్రవక్త “మీ అమ్మ” అన్నారు. ఆ వ్యక్తి మూడోసారి ఆ తర్వాత ఎవరి స్థానం అని అడిగితే అప్పుడు కూడా ప్రవక్త “మీ అమ్మ” అన్నారు. మరోసారి అంటే నాల్గవసారి ఆ వ్యక్తి అదే ప్రశ్న అడిగినప్పుడు ప్రవక్త “మీ నాన్న” అన్నారు.

కుటుంబంలో పిల్లల హక్కులు, వృద్ధులైన తల్లిదండ్రుల హక్కులు, సంతానం హక్కులు, భార్యాభర్తలకు పరస్పరం ఉన్న హక్కులనేవి చాలా ముఖ్యమైనవి. హక్కుల విషయంలో మన నిబద్ధత కుటుంబ విలువలకు పునాది అవుతుంది. సాధారణంగా చాలా మంది కుటుంబ విలువల గురించి పట్టించుకోరు. అంతా బాగున్నప్పుడు ఎవరికీ ఈ విషయమై ఆలోచన కూడా రాదు. కాని ఏదన్నా సమస్య తలెత్తినప్పుడు, సంక్షోభం తలెత్తినప్పుడు ఈ కుటుంబ విలువలే కుటుంబాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కిస్తాయి.

కుటుంబ విలువలు బలంగా ఉన్న కుటుంబాల్లో ఒకరి పట్ల మరొకరికి నిబద్ధత ఉంటుంది. కుటుంబ సంబంధాలకు అత్యధిక ప్రాముఖ్యం ఇస్తారు. చాలా మంది చర్చించడానికి ఇష్టపడని విషయాలేమిటంటే, విడాకుల తర్వాత పిల్లల పెంపకంలో ఎదురయ్యే మానసిక ఒత్తిళ్ళు. వివాహం ఇస్లాం ప్రకారం ఒక గట్టి ఒప్పందం. కాని ఏ ఒప్పందంలో అయినా ఒప్పందం నుంచి వైదొలిగే వెలుసుబాటు ఉంటుంది. కలిసి జీవించడం సాధ్యం కాని సందర్భంలో భార్యాభర్తలు విడిపోవ

డానికి అవకాశం ఉండాలి. విడిపోయే అవకాశం లేని పవిత్ర సంబంధంగా వివాహాన్ని మార్చేస్తే ఊపిరాడక నిత్యం చస్తూ బతికే పరిస్థితి ఉంటుంది. ఈ పరిస్థితిని ఇస్లామ్ ఇష్టపడదు. అనివార్యమైన పరిస్థితుల్లో విడాకులకు అవకాశం ఇచ్చింది. విడాకులు పొందిన పురుషుడికి మరో వివాహం చేసుకునే అవకాశం ఉన్నట్లే, విడాకులు పొందిన స్త్రీకి కూడా మరో వివాహం చేసుకునే అవకాశం ఉంది. ఇది తప్పు కాదు. పైగా సామాజిక అవసరం. వివాహం లేకుండా ఎవరు ఒంటరిగా ఉండరాదు. అయితే, విడాకులు పొందిన జంటకు పిల్లలుంటే మానసిక ఒత్తిళ్ళు పునర్వివాహం ఒక అవాంఛనీయంగా మారిన సామాజిక పరిస్థితుల వల్ల తలెత్తినవి. విడాకులు పొందినప్పటికీ బయోలాజికల్ పేరెంట్స్, అంటే జన్మనిచ్చిన తల్లిదండ్రులు మారిపోవడం జరగదు. పునర్వివాహం తర్వాత కూడా ఆ పిల్లలు వారి పిల్లలు గానే స్వీకరించే వాతావరణం ఏర్పడాలి. పిల్లల మధ్య ప్రేమాభిమానాలు, పిల్లలకు తల్లిదండ్రుల పట్ల ప్రేమాభిమానాలు, పునర్వివాహం తర్వాత తమ తల్లి లేదా తండ్రితో దాంపత్య జీవితం గడుపుతున్న వ్యక్తిని కూడా పిల్లలు ప్రేమాభిమానాలతో చూసే వాతావరణం అనేది ఎంతో అవసరం. ఇలాంటి చర్చలు సమాజంలో జరగడం లేదంటే, ఈ పరిస్థితుల అనివార్యతను గుర్తించలేని వెనుకబాటుతనమే. కో పేరెంటింగ్, పారలెల్ పేరెంటింగ్ అనే పదాలు ఇంగ్లీషులో ఉన్నాయి. తల్లిదండ్రుల ప్రేమ ఎలాంటి పరిస్థితుల్లో అయినా పిల్లలకు లభించాలి. అలాగే అనివార్య పరిస్థితుల్లో విడిపోయిన తల్లిదండ్రులను అర్థం చేసుకుని కొత్త పరిస్థితులను, కొత్త కుటుంబ సమీకరణాలను స్వాగతించి పిల్లలు అర్థం చేసుకునే వాతావరణం ఉండాలి.

కుటుంబం ప్రతి విషయాన్ని గురించి మాట్లాడుకునే అవకాశం కల్పిస్తుంది. చిన్న విషయాలైనా, పెద్ద విషయాలైనా కుటుంబ సభ్యులు చర్చించుకునే, తమ అభిప్రాయాలు పంచుకునే వాతావరణం ఉండాలి. దీనివల్ల పిల్లల ఆత్మస్థయిర్యం పెరుగుతుంది. తమ అభిప్రాయాలను చక్కగా వ్యక్తీకరించే నైపుణ్యం ఏర్పడుతుంది. భేదాభిప్రాయాలు తలెత్తినప్పుడు ఎలా వ్యవహరించాలో నేర్చుకుంటారు.

కుటుంబంలో ప్రతి విషయం పరస్పర సంప్రదింపులతో జరిగే అలవాటు ఉండాలి. రోజు చేసే వంటలు మొదలు, షాపింగ్, పనులు పంచుకోవడం వగైరా విషయాలన్నీ అందరూ మాట్లాడుకుని నిర్ణయించుకోవడం పిల్లల్లో ప్రజాస్వామిక విలువలను పెంచుతుంది. ఆధ్యాత్మిక విలువలను, శిక్షణను పెద్దలను చూసి అలవరచుకుంటారు. ఏదైనా సమస్య ఎవరికైనా ఎదురైతే కుటుంబ సభ్యులందరు తోడుగా నిలబడతారనే గొప్ప ధైర్యం ఉంటుంది. అందుకే బలమైన కుటుంబానికి అవసరమైన పునాదులు కుటుంబ పెద్ద వేయాలి.

కుటుంబ పెద్దపై నిస్సందేహంగా ఈ బాధ్యత ఉంటుంది. ఈ బాధ్యతనే ఇంతకు ముందు దివ్యఖుర్ఆన్ వాక్యంలో ఆధిక్యత అనే పదంతో సూచించడం జరిగింది. పిల్లలను బాధ్యతాయుతులైన, మంచి పౌరులుగా తీర్చిదిద్దేది కుటుంబమే. ప్రేమాభిమానాల వాతావరణంలో పుట్టిన పిల్లలు సహజంగానే తోటివారిని ప్రేమిస్తారు. అందరితోను సద్భావంతో మెలిగే అలవాటు కలిగి ఉంటారు. కుటుంబంలో పెద్దలను చూసి నేర్చుకున్న విలువలు, విశ్వాసాలు వారి వ్యక్తిత్వంలో ఇంకిపోతాయి. పిల్లలు పెరిగి పెద్దయిన తర్వాత వారి జీవితంలో తీసుకునే ప్రతి నిర్ణయంలోను కుటుంబ విలువలు ప్రతిఫలిస్తాయి.

ఈ కుటుంబ విలువలే సమాజంలో బలమైన సామాజిక సంబంధాలకు ఉపయోగపడతాయి. బలమైన సమాజం బలమైన దేశానికి పునాది. ఇస్లాం కుటుంబానికి అత్యంత ప్రాముఖ్యం ఇస్తుంది. కుటుంబ వ్యవహారాలకు సంబంధించి దివ్య ఖుర్ఆన్‌లో ఒక పూర్తి అధ్యాయం (అత్తలాఖ్) ఉంది. అనేక వాక్యాలు కుటుంబ విలువలకు సంబంధించినవి ఉన్నాయి. దివ్య ఖుర్ఆన్‌లో అల్ ముజాదలా అనే అధ్యాయం కూడా కుటుంబ సమస్యల పరిష్కారాన్నే చర్చించింది.

కుటుంబం మానవ నాగరికతలో ప్రథమంగా ఏర్పడిన సాముదాయిక సంస్థ. సమాజంలోని వ్యక్తి యూనిట్ కాదు. కుటుంబమే సమాజానికి యూనిట్. మానవనాగరికతలో కుటుంబవ్యవస్థ పోషించిన పాత్ర అద్వితీయమైనది. అనేక సామాజిక, సాంస్కృతిక బాధ్యతలు కుటుంబ వ్యవస్థ నిర్వర్తిస్తోంది. పునరుత్పత్తి, పిల్లల పెంపకం, గుర్తింపును ఇవ్వడం, విలువలు అందించడం, వృద్ధులను ఆదరించడం ఇలా అనేక బాధ్యతలు నిర్వహిస్తూ వస్తోంది. కాని దురదృష్టవశాత్తు గత 50 సంవత్సరాలుగా కుటుంబ వ్యవస్థ చాలా దెబ్బతింది. మానవ చరిత్రలోని 6000 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా కుటుంబ వ్యవస్థ ఇప్పుడు దెబ్బ తింది. కుటుంబ వ్యవస్థ పతనమైతే సమాజంలో సమస్యలు కూడా పెరుగుతాయి. అధ్యయనాల వల్ల తెలుస్తున్నదేమంటే, పేదరికం, స్కూలు మానేసే పిల్లలు, ఆత్మహత్యలు, మాదక ద్రవ్యాల వాడకం, టీనేజి తల్లులు, మానసిక రుగ్మతలు ఇలా అనేక సమస్యలు ప్రత్యక్షంగానో పరోక్షంగానో కుటుంబ వ్యవస్థ వైఫల్యం వల్ల తలెత్తినవే.

'ఉదారచరితానాంతు వసుధైక కుటుంబం' అన్నారు. పరస్పర గౌరవ భావం ఏర్పడాలంటే ప్రేమపూరిత కుటుంబ బంధాలు సమాజంలో ఉన్నప్పుడే సాధ్యపడుతుంది. కుటుంబానికి సంబంధించి నైతిక, సామాజిక సూత్రాలు, కుటుంబ సమైక్యత, సంతోషాల గురించి ప్రజలందరికీ అవగాహన కలిగించడం, సుస్థిర కుటుంబాలకు దోహదం చేయడం, కుటుంబంలో వున్న విభేదాలను తొలగించి ఆయా కుటుంబాలలో సుఖశాంతులు నెలకొల్పడం వంటి లక్ష్యాలలో 'అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం' కూడా ప్రతి ఏటా జరుపుకుంటున్నాం. కుటుంబ విలువల ప్రాముఖ్యాన్ని గుర్తించి కుటుంబ విలువలను పెంపొందించడానికి బలమైన కుటుంబం, బలమైన సమాజం నినాదంతో జమాఅతె ఇస్లామీ హింద్ ఉద్యమాన్ని చేపట్టడం స్వాగతించదగిన విషయం. ✤

# పటిష్ట కుటుంబంతో పటిష్ట సమాజం

**యండి. ఉస్మాన్ ఖాన్**

**మానవ సమాజ** సౌధానికి కుటుంబమే మూల స్థంభం. ఆలుమగల అనుబంధంతో కుటుంబం ఏర్పడుతుంది. ఈ అనుబంధమే కౌటుంబిక వ్యవస్థ పునాదులను పటిష్టం చేస్తుంది. కాని ఈనాడు ఆలుమగల మధ్య ప్రారంభమయ్యే అనుబంధ లేమి కుటుంబ వ్యవస్థ పునాదులను బలహీన పరుస్తోంది. తద్వారా సమాజం ప్రభావితమై, సామాజిక అసమానతలకు, విచ్ఛిన్నతకు దారితీస్తోంది. బంధాలు అనుబంధాలు అపహాస్యం పాలవుతున్నాయి. కుటుంబంలో, సమాజంలో ఆత్మీయత, మానవీయ విలువలు మృగ్యమై పోతున్నాయి.

సామాజిక జీవనానికి పునాదిగా ఉన్న కుటుంబ వ్యవస్థ బీటలు వారుతోంది. వ్యవస్థలోని సమస్త విభాగాల్లో అత్యంత ముఖ్యమైన ప్రాథమిక విభాగం కుటుంబం. సమాజంలో ఐక్యతకు, సమైక్యతకు కుటుంబం ఒక చిహ్నం. సౌధానికి పునాది ఎంత ముఖ్యమో సమాజానికి కుటుంబం అంతకన్నా ముఖ్యం. వ్యక్తి వికాసంలో, ఎదుగుదలలో కుటుంబం పాత్ర ఎంత ప్రముఖమైనదో మనందరికీ తెలుసు. వ్యక్తి, కుటుంబం, తద్వారా ఉనికిలోకొచ్చే విస్తృత రూపమే సమాజం. మానవ సంస్కృతీ సంప్రదాయాలకు, నాగరికత పురోభివృద్ధికి కుటుంబ వ్యవస్థ మూలకందం. అనాదిగా మానవ సమాజంలో కుటుంబ వ్యవస్థ ఉంటూ వచ్చింది. ఆ మాటకొస్తే, సృష్టిలోని జీవ జాలాలన్నింటిలోనూ కుటుంబ వ్యవస్థ ఉంది. కాని మానవ కుటుంబాల ప్రత్యేకత వేరు. ఒక వ్యక్తిని తీర్చిదిద్దడంలో కుటుంబం పాత్ర విస్మరించరానిది. ఇంట్లో తల్లిదండ్రులు, ఇతర పెద్దలు పిల్లల్ని సక్రమ మార్గంలో నడిపించి చక్కదిద్దడానికి, సంస్కరించడానికి అవకాశం ఉంటుంది. తల్లి, తండ్రి, వారి పిల్లలు - ఇంకా వారి పోషణలో ఉండే అమ్మమ్మ, తాతయ్య, బామ్మ తదితరులందరినీ కలిపి కుటుంబంగా చెప్పుకోవచ్చు. కుటుంబంలోని పెద్దలు ఒకరి అవసరాలను ఒకరు చూడటం, ఒకరిపట్ల ఒకరు శ్రద్ధ వహించడం జరుగుతుంది. ఇది కుటుంబ వ్యవస్థలోని గొప్పదనం. కుటుంబాలు పటిష్టంగా లేకపోతే ఇది సాధ్యం కాదు. ఈనాడు కుటుంబాల మధ్య, బంధువుల మధ్య అనుబంధాలు తగ్గిపోతున్నాయి. జీవనశైలిలో వచ్చిన మార్పులు కుటుంబ వ్యవస్థను ప్రభావితం చేస్తున్నాయి. ఛిన్నాభిన్నం చేస్తున్నాయి.

కుటుంబ వ్యవస్థ వల్ల కలిగే ముఖ్య ప్రయోజనాల్లో ఒకటేమిటంటే, అన్నదమ్ములు, అక్కా చెల్లెళ్ళు, ఇతర కుటుంబ సభ్యుల మధ్య ఒక బలమైన బంధం ఏర్పడుతుంది. అది వారికి పరస్పరం ఒక భద్రతను, భరోసాను కలగజేస్తుంది. కుటుంబ వ్యవస్థ పటిష్టంగా లేని కుటుంబాల్లో పెరిగే పిల్లల్లో ఇలాంటి అవకాశాలు తక్కువ. కుటుంబ వ్యవస్థ అనేది చిన్నతనంలోనే సమైక్యతా భావనను మనసులో బలంగా నాటుతుంది. సమాజంలో సాంస్కృతిక, సామాజిక విలువలను కాపాడి, పెంపొందించడంలో కుటుంబం ముఖ్య భూమిక పోషిస్తుంది. కులాలు, మతాలు, భాషలు, వర్ణాలు, వర్గాలు ఎన్ని ఉన్నప్పటికీ కౌటుంబిక వ్యవస్థ పటిష్టంగా ఉంటే ప్రజలంతా ఒకే కుటుంబంలాగా ఐక్యంగా, సంతోషంగా జీవించగలుగుతారు. అమ్మానాన్న, అన్నాచెల్లెలు, తమ్ముడు కలిస్తే చిన్న కుటుంబం. వీరికితోడు తాతయ్య, అమ్మమ్మ ఎలాగూ ఉంటారు. చిన్న కుటుంబమైనా, పెద్ద కుటుంబమైనా కుటుంబ సభ్యులతో కలివిడిగా, సంతోషంగా గడపడం అంటే అందరూ సంబరపడతారు.

పటిష్ట కుదుళ్ళు కలిగిన కుటుంబాలు బీటలువారి, చీలి, కూలి పోవడానికి ముఖ్యకారణం మానవ సంబంధాలన్నీ వ్యాపార సంబంధాలుగా, ఆర్థిక సంబంధాలుగా మారిపోవడమే. నికాహ్ (వివాహం) ద్వారా స్త్రీపురుషులిద్దరూ కుటుంబాన్ని ఏర్పరచుకుని సామాజిక ఆమోదయోగ్యమైన వైవాహిక బంధం ద్వారా సంతానోత్పత్తి చేసి సమాజం నిరంతరం కొనసాగేలా చేయడం వ్యవస్థ ప్రత్యేకత.

పాశ్చాత్య కుటుంబాల్లో వైయక్తిక వాదం ఎక్కువ. ఒక వ్యక్తి తన గురించి మాత్రమే ఆలోచించే వ్యవస్థ పాశ్చాత్య కుటుంబ వ్యవస్థలో కనిపిస్తుంది. అందుకే పాశ్చాత్య కుటుంబాలు, లేక పాశ్చాత్య ప్రభావిత కుటుంబాలు విచ్ఛిన్నమైనంత వేగంగా మార్గదర్శనం కలిగిన, విజ్ఞానవంతమైన ధార్మిక కుటుంబ వ్యవస్థలు విచ్ఛిన్నం కావు. కొంత మేర బలహీనత, సంఘర్షణ ఉన్నప్పటికీ ఆ కుటుంబాలు తట్టుకోగలుగుతాయి.

ఒకప్పుడు పటిష్ట కుటుంబాలకు మన దేశం పుట్టినిల్లు. ఇప్పుడు ఆ పరిస్థితులు, ఆ సంస్కృతి లేకుండా పోయింది. నాటి పరిస్థితులతో నేటి పరిస్థితులను పోల్చుకుంటే కుటుంబ సభ్యుల మధ్య ఉన్న అనుబంధాలు, ప్రేమానురాగాలు, ఆత్మీయత, ఆప్యాయత - ఇవేవీ ఇప్పటి కుటుంబాల్లో కనిపించడం లేదు. మనసులను ఇరుకు చేసుకుని జీవించడం తప్ప, ఆత్మీయత, అనురాగాలకు చోటు లేకుండా పోయింది. అందుకని, కుటుంబం ప్రాముఖ్యత, కుటుంబ సభ్యుల మధ్య ఉండవలసిన, వారు పాటించవలసిన నైతిక, సామాజిక సూత్రాలు, వారి విధులూ, బాధ్యతలు తెలియజేస్తూ వ్యక్తి సంస్కరణతో ప్రారంభించి, కుటుంబం, సమాజం తద్వారా యావత్ ప్రపంచ సమైక్యత, శాంతి, సంతోషాల గురించి ప్రజలందరికీ అవగాహన కల్పించడం, పటిష్టమైన, సుస్థిర కుటుంబాలకు దోహదం చేయడం, కుటుంబాల్లో నెలకొన్న విభేదాలను తొలగించి ఆయా కుటుంబాలలో సుఖశాంతులు నెలకొల్పడం లాంటి ఉదాత్త లక్ష్యాలతో దేశవ్యాప్తంగా 'పటిష్ట కుటుంబం- పటిష్ట సమాజం' సప్తాహం నిర్వహిస్తున్న జమాఅతె ఇస్లామీ హింద్ సంస్థను మనమంతా మనసారా అభినందిద్దాం. ఆశీర్వదిద్దాం. సమాజంలో కౌటుంబిక వ్యవస్థ పునాదులు సుదృఢం కావాలని కోరుకుందాం.

# కుటుంబాన్ని కాపాడుకుందాం

**హామిద్ ముహమ్మద్ ఖాన్**

అధ్యక్షులు, జమాఅతె ఇస్లామీ హింద్, తెలంగాణ




**దారితప్పిన యువత,** ప్రేమకు నోచుకోని పిల్లలు, పట్టించుకునే వారు లేక అలమటిస్తున్న వృద్ధులు, లజ్జారాహిత్యమే సౌంద ర్యంగా భావించే యవ్వనం, పెరుగుతున్న మానసిక రోగులు, ముక్కలవుతున్న బాంధవ్యాలు, సుఖసంతోషాల్లేని ఇండ్లు - ముఖ్యకారణం, కుటుంబ వ్యవస్థ పతనం.

రండి... సుఖసంతోషాలకు నిలయాల్లాంటి కుటుంబాలను పునర్నిర్మి ద్దాం. ప్రేమించే భర్త, అనుకూలవతి అయిన భార్య, పిల్లల విద్యా శిక్షణల పట్ల శ్రద్ధ చూపించే తల్లిదండ్రులు, తల్లి దండ్రులను గౌరవించే, సేవించే సంతానం, బంధువుల పట్ల అభిమానం, పెద్దల పట్ల గౌరవ మర్యాదలు, పిన్నల పట్ల ఆప్యా యతానురాగాలు, ఇతరుల హక్కు లను గౌరవించడం, స్వంత హక్కులను అవసరమైతే త్యాగం చేయడం, సుహృద్భావ సంబంధాలు, పవిత్రమైన వాతావరణం, ధర్మబద్ధమైన సంపాదన, మితమైన ఖర్చు, సరళ జీవనం, ఒక టీములా కుటుంబం ధర్మమార్గాన పురోగమించడం - చక్కని కుటుంబం, చల్లని సమాజం.

రండి ... బలమైన కుటుంబం ద్వారా పటిష్టమైన సమాజాన్ని, శక్తివంతమైన దేశాన్ని సాధిద్దాం.

కుటుంబం అనేది స్త్రీపురుషులు వైవాహిక సంబంధం ద్వారా ఒక్కటవ్వడం వల్ల ఏర్పడుతుంది. స్త్రీపురుషుల మధ్య లైంగిక సంబంధాన్ని ధర్మబద్ధం చేస్తుంది నికాహ్. వివాహేతర సంబం ధాలన్నీ నిషిద్ధాలు. ధర్మబద్ధంగా, నికాహ్ ద్వారా ఒక్కటైన జంట కుటుంబాన్ని ఏర్పరుస్తుంది. సమాజానికి ప్రాథమిక యూనిట్ ఇదే. వారికి పుట్టే సంతానాన్ని పెంచి పోషిస్తారు. సంతానాన్ని ప్రేమిస్తారు. వారి విద్యాశిక్షణలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తారు. కుటుంబం బలంగా ఉంటే సమాజం బలంగా ఉంటుంది. దేశం శక్తివంతమైనదిగా మారుతుంది. ఇల్లు మనిషికి సాంత్వననిచ్చే ప్రదేశంగా, సుఖసంతోషాల నిలయంగా ఉంటుంది. మనిషి బయట ఎంత కష్టపడినా, ఎక్కడెక్కడ తిరిగినా వెంటనే ఇంటికి చేరుకోవాలని పరితపిస్తాడు. ఎందుకంటే, ఇంట్లో కుటుంబ సభ్యుల మధ్య మనిషికి కావలసిన సాంత్వన, ఊరట లభిస్తాయి.

ఇంట్లో మానసిక శాంతి లభించకపోతే, చికాకులు, గొడవలు, ఘర్షణల వాతావరణమే ఎల్లప్పుడు ఉంటే ఆ వ్యక్తి తన పనిపై శ్రద్ధ చూపించలేడు. ఉత్పాదక శక్తి, నిర్మాణాత్మక సామర్థ్యం రెండు దెబ్బ తింటాయి. కుటుంబంలో శాంతిసంతోషాలు ఉంటే వ్యక్తులు ఉత్సాహంగా పనిచేస్తారు. ఉత్పాదకత పెరుగు తుంది. దేశ ఆర్థిక వ్యవస్థకు కావలసింది ఇదే. అందుకే దేశం పురోగమించాలంటే కుటుంబంలో శాంతి వికసించాలి.

అందుకే జమాఅతె ఇస్లామీ హింద్ సంస్థ దేశవ్యాప్తంగా బలమైన కుటుంబాలు పటిష్టమైన సమాజానికి అవసరమని చాటి చెబుతూ ఫిబ్రవరి 19 నుంచి 28వ తేదీ వరకు పదిరోజుల ఉద్యమాన్ని చేపట్టింది. ఈ ఉద్యమానికి సంబంధించి జాతీయ స్థాయిలో అవగాహనా సదస్సు జనవరి 10వ తేదీన ఆన్‌లైన్‌లో జరిగింది. అలాగే రాష్ట్ర స్థాయిలో ఫిబ్రవరి 4వ తేదీన ఆన్‌లైన్ సదస్సు జరిగింది. ఈ ఉద్యమం ఇప్పుడు చేపట్టడానికి కారణ మేమిటంటే, ప్రస్తుతం సమాజంలో గృహహింసకు సంబంధించిన కేసులు పెరుగుతున్నాయి. ముఖ్యంగా లాక్‌డౌన్ కాలంలో గృహ హింస చాలా పెరిగింది. ఇంటి పట్టునే ఉండండి, సురక్షి తంగా ఉండండి అని కరోనా నుంచి కాపాడడానికి నినాదాలి చ్చారు. కరోనా నుంచి కాపాడుకోడానికి ఇంటి వద్దనే ఉండడం వల్ల ఇండ్లలో ఘర్షణలు, గొడవలు పెరగడం అనేది దురదృష్టం. ఇల్లు ఎంత సురక్షితంగా ఉందనేది ఇప్పుడు ఒక ప్రధాన ప్రశ్నగా మన ముందుకు వచ్చింది.

అలాగే ప్రస్తుతం యువతరం వివాహం పట్ల వైముఖ్యం చూపిస్తు న్నారని, వివాహ బంధానికి బదులు కలిసి జీవించడానికి మొగ్గు చూపిస్తున్నారని కూడా కొన్ని సర్వేల వల్ల తెలుస్తోంది. వివాహం చేసుకుని ఆర్థిక బాధ్యతలు నెత్తిన వేసుకోడానికి వెనుకాడుతు న్నారు. ఒంటరిగా స్వేచ్ఛగా ఉండడానికే ఇష్టపడుతున్నారు. ఈ వైఖరివల్ల దీర్ఘకాలికంగా దుష్పరిణామాలు తప్పవు. ఈ వాస్తవాన్ని గుర్తించిన జమాఅతె ఇస్లామీ హింద్ మహిళా విభాగం ప్రజల్లో ఈ వాస్తవాల చైతన్యానికి నడుం కట్టింది. ముస్లిం సమాజంలో ఈ విషయమై అవగాహన కల్పించడానికి, ఇస్లామీయ కుటుంబ

విలువల గురించి సమాజంలో అందరికీ తెలియజేయడానికి, వరకట్నం, దుబారా ఖర్చుల వంటి రుగ్మతలను నివారించడానికి, పిల్లల విద్యాశిక్షణల పట్ల శ్రద్ధ చూపించవలసిన బాధ్యతను గుర్తు చేయడానికి దేశవ్యాప్త ఉద్యమం చేపట్టాలని నిర్ణయిం చింది. ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా జమాఅతె ఇస్లామీ హింద్ మహిళా విభాగం సారథ్యంలో కొనసాగు తుంది.

స్పష్టమైన లక్ష్యాలతో ఈ కుటుంబాలను కాపాడాలనే ఈ ఉద్యమం చేపట్టారు. కుటుంబం బలంగా ఉన్నప్పుడే, సుఖ సంతోషాలతో ఉన్నప్పుడే దేశం కూడా బలంగా ప్రగతిపథాన పురోగమిస్తుందని ప్రజల్లో అవగాహన కల్పించడం, వివాహానికి దూరంగా ఉండి స్వేచ్ఛగా ఒంటరిగా సుఖాలకు వెంపర్లాడడం వల్ల జనించే ప్రమాదాలను, విపరిణామాల పట్ల అవగాహన కల్పించడం, నైతికత ప్రాముఖ్యత పట్ల చైతన్యాన్ని పెంచడం, మానవసంబంధాలు నైతికసూత్రాల పునాదులపైనే దృఢంగా ఉంటాయని తెలియజేయడం, సమాజంలో న్యాయాన్ని స్థాపిం చడం, భవిష్యతరాలను చక్కగా తీర్చిదిద్దడం, హక్కులను కాపా డడం, కుటుంబంలో వృద్ధుల పట్ల గౌరవాదరాలు, బలహీనులైన బంధువుల పట్ల గౌరవమర్యాదలు ఇవన్నీ ప్రతి కుటుంబంలోని ప్రతి ఒక్క సభ్యుడి బాధ్యతలనే భావాన్ని ప్రోత్సహించడం, విభిన్న సంస్కృతుల్లోని ఉమ్మడి విలువలను జన బాహుళ్యంలో చర్చ ల్లోకి వచ్చేలా చేయడం వంటి ఉన్నత లక్ష్యాలతో ఈ ఉద్యమాన్ని చేపట్టడం జరిగింది.

ఈ సందర్భంగా సమాజంలో చైతన్యాన్ని పెంచడానికి వివిధ కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. స్థానిక స్థాయిలో సెమినార్లు, సింపోజియంలు, సోషల్ మీడియాలో ప్రచారం, వీడియోలు మొదలైన అనేక మార్గాలద్వారా సమాజంలో కుటుంబ విలువలు పెంచడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాల నిర్వహణకు విభిన్న కమిటీ లను ఏర్పాటు చేశారు. జాతీయ స్థాయిలో కన్వీనర్‌గా ముహతరమా షాయిస్తా రఫత్ గారు నియుక్తులయ్యారు. రాష్ట్ర స్థాయిలో కన్వీనర్‌గా ముహతరమా సయ్యదా సాజిదా బేగం గారు నియుక్తులయ్యారు. ముహతరమా సుమయ్య లతీఫీ గారు, ముహతరమా అస్మా జర్జరీ గార్లు కో కన్వీనర్లుగా వ్యవహ రిస్తారు. వీరితో పాటు ముహతరమా ఖాలిదా పర్వీన్ గారు, ముహతరమా నాసిరా ఖానమ్ గారు, ముహతరమా ఆయెషా సుల్తానా గారు, ముహతరమా జహీర్ ఫాతిమా గారు, ముహ తరమా రాహిలా ఖాన్ గారు, ముహతరమా అస్మా ఫిర్దోస్ గారు, ముహతరమా ఖదీజా మహ్వీన్ గారు, ముహతరమా హమీదా బాను గారు సభ్యులుగా కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ వివిధ కార్యక్రమాలను పర్యవేక్షిస్తుంది. ✤

**తహూరా సిద్దీఖా**



# హమారా ఘర్

**మన ఇల్లు** ఆనందాలకి, సుఖసంతోషాలకి నిలయమవ్వాలంటే ఏం చేయాలి? ఏం చేయకూడదు? నేడు ఎన్నో కుటుంబాలు అశాంతి, అలజడులతో నరకకూపంగా మారిపోతున్నాయి. ఇంటిని నందనవనంగా రూపొందించాల్సిన చోట అశాంతి నిలయంగా మార్చుకుంటున్నాం. కుటుంబ సంబంధాలు బీటలు వారుతున్నాయి. ప్రేమ, ఆప్యాయత, గౌరవ మర్యాదలు అంతరించిపోతున్నాయి. అసలు ఇల్లంటే.. సుఖసంతోషాలకు కేంద్రమవ్వాలి. సుఖశాంతులు, ఆనందం, ఆహ్లాదం వెల్లివిరి యాలి. కుటుంబ సభ్యుల్లో ప్రేమ, త్యాగం, సుహృద్భావం జనించాలి. ఒకరిపట్ల ఒకరికి గౌరవ భావం నెలకొనాలి. ఇంట్లో ఉన్నవాళ్లందరికీ ప్రేమాదరణలు లభించాలి. ఎవరూ ఎవ్వరినీ అగౌరవపరచ కూడదు. ఎవరి గౌరవమర్యాదలకూ భంగం వాటిల్ల కూడదు. ఎవ్వరినీ ఎవ్వరూ కించపర్చడం, వెక్కిరించడం లాంటివి అస్సలు చేయకూడదు. ఇంట్లో ఉన్న వాళ్లందరికీ న్యాయం చేయకపోయినా, అందరినీ సంతృప్తిపర్చలేకపోయినా అందరికీ గౌరవ మర్యాదల్లో మాత్రం ఏ లోటూ రానీయకూడదు. మన ఇళ్లను గౌరవ మర్యాదలకు నిలయంగా తీర్చిదిద్దుకోవాలి. సంబంధ బాంధవ్యాలైనా, అనుబంధాలు ఆత్మీయత లైనా, ప్రేమాభిమానాలైనా, చివరికి గౌరవమర్యాదలైనా అన్నీ ఇచ్చి పుచ్చుకోవడంతోనే పటిష్ఠ మవుతాయి. ఇది మన చేతిలో పని. ఎప్పుడైనా మీకు ఎవరికైనా సహాయం చేసే, తోడ్పాటు నందించే అవకాశం దొరికితే దాన్ని అదృష్టంగా భావించండి. నలుగురికీ తెలియనివ్వకుండా ఆ మిత్రుణ్ణి కష్టాల నుంచి గట్టెక్కించండి. మీరు చేసిన సహాయం చిన్నదైనా, పెద్దదైనా పది మందిలో చెప్పకండి. సహాయం చేయడం ఒక మేలైతే, చేసిన సహాయం గుప్తంగా ఉంచి మరింత మేలు చేసినవారవుతారు. అప్పుడు మీరు మీ మిత్రుణ్ణి ఆదుకున్న వారూ అవుతారు. ఆ మిత్రుడి

(మిగతా 19వ పేజీలో)

● **ముహమ్మద్ రఫీఖ్, జమాఅతె ఇస్లామీ హింద్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు** ●



# సుందర సమాజానికి మూలం

**కుటుంబం సమాజానికి పునాది.** సమాజాన్ని మనం ఒక ఎత్తయిన, దృఢమైన కట్టడంతో పోల్చితే కుటుంబం ఆ కట్టడానికి ఇటుక వంటిది. ఇటుక దృఢమైనదైతే, సరైన ప్రదేశంలో ఇమిడి ఉంటే కట్టడం దృఢంగా ఉంటుంది. కానీ ఒకవేళ ఇటుకే బలహీనమైనదైతే లేదా కట్టడానికి గోడలు వంకరగా ఉంటే ఆ కట్టడం ఎప్పుడైనా కూలిపోవచ్చు. అంటే ఒకవేళ కుటుంబ వ్యవస్థ దృఢంగా ఉంటే, అసలైన పునాదుల, సూత్రాల మీద నిలబడి ఉంటే అలాంటి పునాదిపై ఉన్న సమాజం స్థిరత్వం కలిగిన సమాజంగా రూపుదిద్దుకుంటుంది. కుటుంబ వ్యవస్థ బలహీనంగా ఉంటే సమాజం ఛిన్నాభిన్నమై పోతుంది.

ఈ కారణంగానే కుటుంబ వ్యవస్థ గురించి వివరణాత్మక మార్గదర్శనం మనకు ధర్మగ్రంథంలో లభించింది. ఖుర్ఆన్‌లోని ఎన్నో సూరాల పేర్లు కుటుంబ జీవితానికి సంబంధించినవే. ఉదాహరణకు తలాఖ్, నిసా వగైరాలు. ఇస్లామీయ సమాజంలో కుటుంబ వ్యవస్థ దృఢమైన పునాదులపై ఉండాలని అల్లాహ్ కోరుతున్నాడు. దివ్య ఖుర్ఆన్‌లోను, దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన హదీసులలోను కుటుంబ జీవితం గురించి వివరణాత్మకంగా తెలియజేశారు.

కుటుంబం సమాజానికి సంబంధించిన అతి ముఖ్యమైన యూనిట్. ఇది స్త్రీ పురుషుల వివాహ సంబంధం ద్వారా ఏర్పడుతుంది. ఏ విధంగానైతే సమాజ అభివృద్ధి కుటుంబం పై ఆధారపడి ఉంటుందో అదేవిధంగా సమాజ పతనం కూడా కుటుంబం పైనే ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే కుటుంబమే సమాజానికి పునాది. ఏ కుటుంబ పునాది దృఢంగా, స్థిరంగా ఉంటుందో ఆ సమాజ విలువలు స్థిరంగా ఉంటాయి.

సామాజిక వ్యవహారాలలోనూ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి జీవితం మనకు గొప్ప నమూన. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒక మంచి కొడుకుగా, మంచి తోబుట్టువుగా, ఆదర్శ

ప్రాయమైన భర్తగా, గొప్ప తండ్రిగా, గొప్ప మావయ్య (ససుర్)గా, ప్రేమానురాగాలు పంచే తాతయ్యగా, శ్రేయోభిలాషి అయిన మిత్రునిగా, ఇంకా చెప్పాలంటే ప్రతీ సామాజిక బంధంలో ఒక గొప్ప ఉదాహరణగా కనిపిస్తారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రతీ బంధాన్ని చక్కగా నిర్వర్తించారు. ఇంకా మనిషిని చక్కదిద్దడానికి ఒక ఆదర్శ నమూనాను నెలకొల్పారు.

కుటుంబంలోని వ్యక్తులు ప్రేమ, సహనం, ఓర్పు వంటి సుగుణాలు కలిగి ఉన్నప్పుడే కుటుంబం పటిష్టంగా ఉంటుంది. కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నమవడం వల్ల అనేక దుష్పరిణామాలు ఏర్పడతాయి. సత్ప్రవర్తన అంతరిస్తుంది. బంధుత్వ వాత్సల్యం మంటగలసిపోతుంది. ఒకరి మాటలను మరొకరు గౌరవించే బదులు విభేదాల్లో మునిగిపోతారు. స్త్రీ, పురుషులు తమ తమ విధి బాధ్యతలను నిర్లక్ష్యం చేస్తారు. పురుషాధిక్యత ధోరణితో మగువల హక్కులను కాలరాస్తారు.

మహిళలు ఇంటి బాధ్యతలను విస్మరించి, ఆర్థిక కార్యకలాపాలపై ఎక్కువ శ్రద్ధ తీసుకోవడం ప్రారంభమవుతుంది. తత్ఫలితంగా ఇంటి ప్రశాంతత నాశనమైపోతుంది. ఎప్పుడైతే స్త్రీలు పురుషులతో సమానంగా సంపాదన కోసం పరిశ్రమించడం మొదలు పెడ్తారో అప్పుడు మానసిక ప్రశాంతతనూ కోల్పోతారు. ఇంకా పిల్లల ఆలనా పాలనాపై దీని ప్రభావం పడుతుంది.

పుట్టిన ప్రతి మనిషి కుటుంబంలో ఉన్న వారిని చూస్తూ పెరుగుతాడు. వారి పద్ధతులను, అలవాట్లను ఇంకా ఆచార వ్యవహారాలను తానూ అలవరచుకుంటాడు. కుటుంబాలు కలిసి ఒక సముదాయంగా ఏర్పడతాయి, సముదాయాలు కలిసి ఒక సమాజం రూపొందుతుంది. ఈ విధంగా వ్యక్తులు, కుటుంబాలు, సమాజం అన్నీ పరస్పరం ఒక దానితో మరొకటి ముడిపడి ఉన్నవి.

ప్రతి సమాజం కొన్ని నమ్మకాలు, దృక్పథాల పునాదిపై తన కుటుంబ వ్యవస్థను నెలకొల్పుతుంది. ఇస్లాం కుటుంబ వ్యవస్థకు సంబంధించిన ప్రతీ కోణాన్ని సమగ్రంగా వివరించింది. ఎందుకంటే కుటుంబమే సమాజ మనుగడకు మూలం. ఇంకా సమాజాభివృద్ధి అనేది సమాజంలోని వ్యక్తులు తమ బాధ్యతలను సరిగా నిర్వర్తించడంపై ఆధారపడి ఉంటుంది. విధి, బాధ్యతలేమిటో దైవవాణి సూచిస్తుంది. ఆ దైవవాణి ఖుర్ఆన్, సున్నత్‌ల రూపంలో మన ముందు ఉంది. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, వారి అనుచరులు మన ముందు ఆచరణాత్మక నమూనాను కూడా ఉంచారు. వాటిని ఆచరించి అనుసరించడం ద్వారా కుటుంబ విలువలను కాపాడుకోగలం. కుటుంబం పటిష్టంగా ఉంటే సమాజం, దేశం బలంగా ఉంటాయి. ✤

# పటిష్ట కుటుంబమే అభివృద్ధికి సోపానం

**- అబ్దుల్ సత్తార్, మహబూబాబాద్**

**పటిష్ట కుటుంబం,** సమాజం, ఐకమత్యం, ప్రేమాభిమానాలు లోపిస్తే సమాజాభివృద్ధి పాతాళానికి దిగజారిపోతుంది.

ఒకప్పుడు సమాజం ఎలా ఉండేది? కుటుంబ విలువలు ఎలా ఉండేవి? చిన్న చిన్న గ్రామాలు. పెంకు టిండ్లు, గుడిసెలు. ఆరుబయట నులక మంచాలు.. మర్రి చెట్లు, రచ్చబండలు. ప్రేమలు, అభిమానాలు, కులాల కతీతంగా, మతాలకతీతంగా అక్కా, బావ, మావయ్య, బాబాయి, పిన్ని అనే వరుసలతో పలకరింపులు... ఏ ఇంట్లో నైనా పెళ్ళి కానివ్వండి, చావు కానివ్వండి... ఊరంతా కదిలి పోయేది. కాని..నేడు! పెద్దపెద్ద బంగళాలు, అపార్ట్‌మెంట్‌లు, బిక్కుబిక్కుమంటూ చిన్న చిన్న కుటుంబాలు.. ఎక్కడ చూసినా పోటీతత్వం! ఇంటర్నెట్‌లో ఇరుక్కుపోయిందీ ఈ ఆధునిక యుగం! ఈర్ష్య, అసూయ, కులమతాల రక్కసులు, ఎన్ఆర్‌సీ, సీఏఏల పేర మనుషుల మధ్య అంతరాలు, పగ, ప్రతీకారాలు.. అందుకే దాని పర్యవసానాలు.. నైతిక పతనం, రాజకీయ పతనం, ఆర్థికాభివృద్ధి పతనం, కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నం. చివరకు రక్త సంబంధీకుల మధ్య కూడా ప్రచ్ఛన్న యుద్ధాలు, పోటీతత్వాలు. వెరసి మానవత్వం మటుమాయం.

నిజం చెప్పాలంటే ఇస్లామ్ ఒక మహోన్నతమైన నాగరికత, సంస్కృతికి సారథ్యం వహించే జీవన వ్యవస్థ. ఇలాంటి ఉన్నతమైన వ్యవస్థ ఉనికిలోకి రావాలంటే ఒక పవిత్రమైన సమాజాన్ని నిర్మించినప్పుడు అది సాధ్యం. పవిత్ర సమాజానికి పవిత్ర కుటుంబమే నాంది. ఏ కుటుంబంలోనైతే తల్లిదండ్రులు, బంధువులు, సంతానం, ఇరుగుపొరుగు వారి జీవితాలు నియమానుసారం కొనసాగుతాయో అదే ఉత్తమ కుటుంబం. దాని ఫలితమే పటిష్ట సమాజం! ✤

**ముహమ్మద్ ముజాహిద్**



# మీ ఇల్లు ఇలా ఉందా?

**కుటుంబం..** అతి ప్రాచీన సంస్థగా చెప్పుకోవచ్చు. గతమైనా, వర్తమానమైనా, భవిష్యత్తులోనైనా ఈ సంస్థ కార్యకలాపాలు అతి కీలకమైనవి. కుటుంబమనే కట్టడాన్ని పటిష్టంగా నిర్మిస్తే పదికాలాలపాటు మనగలుగుతుంది. దానికి విరుద్ధంగా కుటుంబమనే కట్టడం పునాదులు బలహీనంగా ఉంటే ఆ కట్టడం కూలిపోవడం ఖాయం. ప్రస్తుతం అతి ప్రాచీన సంస్థగా చెప్పుకునే కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమవుతుంది. మూఢనమ్మకాలు, పాశ్చాత్య పోకడలు, భౌతికవాదం ఇవన్నీ కుటుంబ వ్యవస్థను కుళ్లబొడుస్తున్నాయి. ప్రేమ, వాత్సల్యం, ఆత్మీయత, అనురాగాలు మాయమైపోతున్నాయి. అనైతికత, స్వార్థం, హక్కుల ఉల్లంఘన మన ఇంటి వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. రక్త సంబంధీకులే పరస్పరం అపరిచితుల్లా మారిపోతున్నారు. మలిసంధ్యలో అమ్మానాన్నలను అనాథాశ్రమాల్లో వదిలేస్తున్నారు. భార్యాభర్తల మధ్య నమ్మకం మాయమవుతోంది. అక్రమ సంబంధాల వార్తలు, హత్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. స్మార్ట్ ఫోన్ విప్లవం పసి మెదళ్లను నేరస్తులుగా మారుస్తోంది. వెరసి మన కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నమవుతోంది. కూలిపోతున్న మన కుటుంబ వ్యవస్థను కాపాడుకోవడం మనందరి కర్తవ్యం. ఆదర్శ కుటుంబ నిర్మాణం కోసం ఖుర్ఆన్ కొన్ని సూచనలు చేసింది. ఖుర్ఆన్ ప్రబోధించిన కుటుంబ విలువలను ఆచరణలో పెడితే ఆదర్శ కుటుంబాలను స్థాపించి సుందర సమాజాన్ని నిర్మించవచ్చు.

## ఖుర్ఆన్ బోధించే కుటుంబ విలువలు..

మనిషి సంఘజీవి. ఈ విశ్వవ్యవస్థ ఉనికిలోకి వచ్చినప్పటినుండి మనిషి జంటగా వచ్చాడు. ఈ ప్రపంచంలోని మిలియన్ల సంఖ్యలో ఉన్న జనాభా మొత్తం ఆదమ్-హవ్వాల సంతానమే. మనిషి

పుట్టుకతోటే తన తల్లి అనే బాంధవ్యాన్ని ఏర్పరుచుకుంటాడు. ఆ తరువాత తండ్రి, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లనే బంధాన్ని ఏర్పరచుకుంటాడు. కుటుంబ జీవితాన్ని గడపడమనేది మానవ జన్మ ఔన్నత్యంగా చెప్పుకోవచ్చు.

## భార్యాభర్తల బంధం..

భార్యాభర్తల బంధంతో ఒక కొత్త కుటుంబానికి అంకురార్పణ జరుగుతుంది. ఆలూమగల మధ్య బంధం ప్రేమ, ఆప్యాయతలకు ప్రతిరూపంగా ఉండాలి. ఒకరికొకరు తెలుసుకుని మసలుకోవాలి. భార్యా-భర్తలను దుస్తులతో సరిపోల్చింది ఖుర్ఆన్. మరోచోట భార్యాభర్తల బంధం అల్లాహ్ చిహ్నాలలో ఒకటి అని పేర్కొంటోంది.

ఆయన సూచనలలో మరొకటి ఏమిటంటే ఆయన మీ కొరకు భార్యలను మీ జాతిలో నుండే సృష్టించాడు- మీరు వారివద్ద శాంతిని పొందటానికి, మీ మధ్య ప్రేమనూ, కారుణ్యాన్నీ సృజించాడు. (దివ్య ఖుర్ఆన్ 30: 21)

వారు మీకు దుస్తులు, మీరు వారికి దుస్తులు. (2:187)

## ఇల్లాలి పట్ల ఉత్తమంగా వ్యవహరించాలి..

వారితో సద్భావంతో జీవితం గడపండి. ఒకవేళ మీకు వారు నచ్చకపోతే, బహుశా మీకు ఒక వస్తువు నచ్చకపోవచ్చు. కాని అందులోనే అల్లాహ్ ఎంతో మేలును పెట్టివుండవచ్చు. (4:19)

'ఒక ముస్లిమ్ తన భార్యను అసహ్యించుకోరాదు. ఆమెను కసురుకోరాదు' అని హితవుపలికారు ప్రవక్త ముహమ్మద్(స). భర్తకు విధేయురాలయి జీవితాన్ని గడిపే మహిళ పట్ల అల్లాహ్ ప్రసన్నుడవుతాడని, భర్త తన వంక చూసినప్పుడు చిరునవ్వుతో పలకరించే గృహిణి పట్ల అల్లాహ్ సంతుష్టుడవుతాడని ప్రవక్త శుభవార్తనందించారు.

## ఇంటివారి పట్ల సఖ్యతగా మెలగాలి..

అమ్మానాన్న, భార్యాభర్త, అన్నా, చెల్లి, తమ్ముడు అక్కా ఈ బంధాల ప్రతిరూపమే ఇల్లు. కుటుంబ వ్యవస్థ అల్లాహ్ వరంగా పేర్కొంటోంది ఖుర్ఆన్. రక్తసంబంధీకులు, దగ్గరి బంధువుల హక్కులు, బాధ్యతలు నెరవేరబడినప్పుడే ఆదర్శ కుటుంబం నిర్మితమవుతుంది. ఇంట్లో మొట్టమొదటిగా ఆదరణకు పూర్తి అర్హులు ఎవరైనా ఉన్నారంటే కనిపెంచిన అమ్మానాన్నలే. ఇంట్లో ముసలి తల్లిదండ్రులను కంటికి రెప్పలా కాపాడుకోవాలి. వారి ముందు విసుగ్గా ఉఫ్ అని కూడా అనరాదన్నది ఖుర్ఆన్ హెచ్చరిక. 'తల్లి పాదాల చెంత స్వర్గముంది, తండ్రి స్వర్గానికి ప్రధాన ద్వారం' అని ప్రవక్త నొక్కి చెప్పారు. మరణానంతర జీవితాన్ని విశ్వసించేవారు తమ తల్లిదండ్రులను ఎంతో కరుణతో చూసుకుంటారు. అమ్మానాన్నల ఆదరణ లభించే ఇల్లు స్వర్గసీమగా మారుతుందనడంలో మరోమాటకు తావులేదు.

## ఇంట్లో ఆడపిల్లల పట్ల వివక్ష చూపరాదు..

ఆడపిల్లలు ఇంటికి వెలుగులు. ఎవరికైనా ఆడపిల్లలున్నారంటే వారు తమ పిల్లలను ఎలాంటి వివక్ష చూపకుండా పెంచాలి. ముగ్గురు లేదా ఇద్దరు లేదా ఒక ఆడపిల్లనైనా పెంచి పెద్దచేసి తగిన విద్యాబుద్ధులు నేర్పి తగిన వరుడికిచ్చి వివాహం చేస్తే అలాంటి తల్లిదండ్రులకు ఆ అమ్మాయిలు నరకానికి అడ్డుగోడల వుతారని ప్రవక్త (స) శుభవార్తనిచ్చారు.

## స్త్రీలకు ఆస్తిహక్కు..

ఇస్లామ్ ధర్మం మహిళలకు ఇచ్చిన హక్కులలో ఆస్తి హక్కు ప్రత్యేకమైనది.

తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు విడిచివెళ్ళిన ఆస్తిలో పురుషులకు భాగం ఉంది. అదేవిధంగా తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు విడిచివెళ్ళిన ఆస్తిలో స్త్రీలకు కూడా భాగం ఉంది- అది తక్కువైనా సరే లేక ఎక్కువైనా సరే. (దివ్య ఖుర్ఆన్ 4:7)

## దగ్గరి బంధువుల హక్కులు..

తమ ఆయుష్షు పెరగాలనుకునేవారు, తమ సంపదను పెంచుకోవాలనుకునేవారు, దుర్మరణం నుంచి తప్పించుకోవాలనుకునే వారు సిలా రెహ్మీ (బంధువులతో సంబంధాలను నెరవేర్చడం) చేయాలని చెప్పారు ముహమ్మద్ ప్రవక్త (సఅసం). అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, మరణ భయం ఇవి మనిషిని నిత్యం వెంటాడుతుంటాయి. ఒక్కోసారి అనారోగ్య సమస్యలు మృత్యుముఖంలోకి చేరుస్తాయి. ఆర్థిక ఇబ్బందులు మనశ్శాంతి లేకుండా చేస్తాయి. ఈ సమస్యలను అధిగమించాలనుకునేవారు బంధువుల హక్కులు నెరవేర్చాలన్నది ప్రవక్త బోధనల సారాంశం. రక్త సంబంధీకులు, తోబుట్టువులు, ఇతర దగ్గరి బంధువుల హక్కులు నెరవేర్చడంలో అలక్ష్యం చేయరాదన్నది ఖుర్ఆన్ హెచ్చరిక. కుటుంబ వ్యవస్థను పటిష్టం చేసేందుకు ఖుర్ఆన్ గ్రంథం మరెన్నో సూచనలు చేసింది. బంధుత్వ సంబంధాల విషయంలో అల్లాహ్‌కు భయపడండి అని ఖుర్ఆన్ హెచ్చరిస్తుంది. ప్రళయదినాన్ని విశ్వసించేవారే బంధువుల హక్కులను నెరవేరుస్తారని ఖుర్ఆన్ పేర్కొంటోంది. 'మీ దగ్గరి బంధువుల హక్కును నెరవేర్చండి' అని ఖుర్ఆన్ గ్రంథంలో పలుమార్లు హెచ్చరికలున్నాయి. నిరుపేద బంధువుల పట్ల కారుణ్యం చూపాలని, ప్రేమ, వాత్సల్యాలతో మెలగాలని ఖుర్ఆన్ సూచన. 'ఆస్తి పంపకాలు జరిగేటప్పుడు ఇతర బంధువులు, అనాథులు, నిరుపేదలు వస్తే, ఆ ఆస్తినుండి వారికి

(మిగతా 21వ పేజీలో)

జంధ్యాల శరత్ బాబు



# ఒకే ఇల్లు... ఒక్కటే కుటుంబం

**నేల, నింగి, గాలి, నిప్పు, నీరు** - ఈ ఐదూ ప్రాణాధారాలు. వీటితోనే మనిషి జీవితం. మన ఉనికి భూమి మీద. మనకు భరోసా ఆకాశం. ఊపిరినిచ్చేది వాయువు. కాంతి దాత అగ్ని. ఆరోగ్య ప్రదాయిని జలం. ఇవన్నీ ఉన్నప్పుడే ప్రతి ఒక్కరికీ మనుగడ. మానవ జీవనం అంటే ఇదే. దీన్ని సఫలం చేసే సంస్థాగత వ్యవస్థ- కుటుంబం. అందుకే దీని పాత్ర, ప్రత్యేకత, ప్రాముఖ్యత అనంతం. మనుషుల కలయిక కుటుంబమైతే, ఆ అన్ని కుటుంబాల సముదాయమే సమాజం. ఒకే ఒక్క వాక్యంలో తేల్చి చెప్పాలంటే... సంఘానికి వెన్ను-దన్ను కుటుంబమే. సామాజిక శక్తియుక్తులన్నింటికీ ప్రాథమిక వేదిక ఇదే. ఎంత బలవత్తర కుటుంబముంటే, అంత శక్తి సంపన్న దేశం రూపొంది వెలుగొందుతుంది.

'కాలం మారింది' అంటున్నాం. మనుషులు మారిపోయారనీ చెప్తున్నాం. మారిందంతా కాలమేనా? కాదు. విలువలు మారాయి. మనుషులందరూ పూర్తిగా మారారనే అనుకోవాలా? లేదు. వచ్చిన మార్పంతా మనసులోనే. పుట్టి పెరిగిన కుటుంబమే అందులోని ప్రతీ వ్యక్తికీ సదా అండదండగా ఉంటుందన్నది నాటి మాట. నేటి బాటా అదే అయినా, గతాన్ని అవగతం చేసుకోవడంలో ఇప్పుడు ఎంతో తేడా కనిపిస్తోంది. ఈ పరిస్థితే వర్తమానంలోనూ కొనసాగుతూ వస్తోంది. ఇక భవిష్యత్తు ఏ విధంగా మారనుందన్న సూటి ప్రశ్నకు ధాటి సమాధానం చెప్పగలిగిందీ- కుటుంబమే. దీనికి ఆది ఇల్లు. ఇంట్లోని కుటుంబీకుల పరస్పర సహాయ సహకార పర్వమే సంఘ ఉన్నతికి, దేశ పురోగతికీ నాంది.

విజ్ఞానమైనా వికాసమైనా కలిగేది, ఎదిగేది, సుస్థిరమై నిలిచేది పూర్తిగా కుటుంబ కారణంగానే!

### ఎంత ఒత్తిడైనా అధిగమిద్దాం

బంధం, సంబంధం, అనుబంధం... ఒకేలా ధ్వనిస్తాయి. వీటి స్థాయుల్లో మాత్రం అంతరాలుంటాయి. ఎటువంటి అంతరాయాలు లేని, అవాంతరాలకూ తావుండని చక్కని చోటు ఏదైనా ఉందా అంటే మటుకు అందరి చూపూ మళ్ళేది ఒకే వైపు. అదీ కుటుంబానికి సంబంధించే. కుటుంబంలో ఏ వ్యక్తి అయినా ఏదైనా సమస్యకు గురైతే కుటుంబ సభ్యులంతా అండదండగా నిలబడతారు. ఒత్తిడిని అధిగమించే ఆసరా అవుతారు.

### మాటలకన్నాచేతలే మిన్న

భావప్రకటన సవ్యంగా విస్తరిస్తేనే మనదేశంలోని కుటుంబ వ్యవస్థ మరింత బలపడుతుంది. దూరమైనవన్నీ ఒకచోటకు చేరి దగ్గరితనం చోటు పెంచుకుంటుంది. ఆత్మీయత అనేది యంత్ర సాధనాలతోనో ప్రచార మాధ్యమాల వల్లనో కలగదు, పెరగదు. ఎవరికైనా ఎక్కడైనా భావోద్వేగాల వెల్లడి రీతి ఒకటే. వాటి ప్రాధాన్యం గ్రహించకుండా, కుటుంబ సభ్యులు ఎవరికివారు 'నాకు నేనే - నీకు నువ్వే' అన్నట్లు వ్యవహరిస్తే/అవే పరిస్థితులు కొనసాగుతుంటే బంధానికి అర్థమే ఉండదు. ఒక శ్రుతిలో భావాలు కలవాలి. ఒకే లయలో బతుకులు నడవాలి. ఆత్రేయ అభిలషించినట్లు అవి-'శ్రుతిలయలొకటైన అనురాగ రాగాలు/జతులై జతలైన నవరస భావాలు'. దాంపత్య అనుబంధమంటే... సంసార సుమసారం, మమకార మణిహారం. ఈ గ్రహింపు కేవలం బోధనతో కాక, పూర్తి సాధనతో మాత్రమే లభిస్తుంది.

### వసుధైక భావన

ప్రేమపూర్వక కుటుంబం చట్టపరమైన దృఢానుబంధంతో నిండి ఉంటుంది. దీనికి సామాజిక గుర్తింపు సైతం స్వాభావికంగానే వెల్లివిరిసి విస్తరిస్తుంది. కుటుంబానుబంధం అత్యంత పవిత్ర భాగస్వామ్యం. మన దేశానికి సంబంధించి ఆ సంబంధ సంరక్షణే పాలకుల, పాలితుల బాధ్యత. ఇక్కడి ప్రజలందరూ ఒకే కుటుంబీకులే. ఇది భారత వసుధ. ఇక్కడ ఉండాల్సింది ఏకత. అందువల్లనే మనది వసుధైక దేశం. కాదన్నవారందరూ చివరకు అవునంటూ దిగివచ్చేదాకా మనదంతా ఒక్కటే నినాదం, ప్రధాన విధానం- అదే వసుధైక కుటుంబం! ✤

## హమారా ఘర్ (13వ పేజీ తరువాయి)

పరువు కాపాడినవారూ అవుతారు.

భర్త తన భార్యను, భార్య తన మెట్టినింటి వారందరినీ గౌరవించాలి. అత్తమామలు, మరుదులు, మరదళ్లు ఇలా అందరినీ ఆదరించాలి. భర్త తన ఇంటివారిని ఎంతటి గౌరవంతో చూస్తాడో అదే విధంగా అత్తింటి వారి పట్ల కూడా అలాగే మసలుకోవాలి. భార్యకు కూడా ఇదే వర్తిస్తుంది. దంపతులు పరస్పరం గౌరవించుకోవాలి. ఇరు కుటుంబ సభ్యులు గౌరవమర్యాదలకు మారుపేరుగా నిలవాలి. మీరు ఎవరినైతే గౌరవ దృష్టితో చూస్తున్నారో వారి తరపు వారందరినీ గౌరవించాలి. ఉదాహరణకు మీరు మీ కోడలిని/అల్లుణ్ణి గౌరవిస్తూ వారి కుటుంబీకులను గౌరవించకపోతే మీ అల్లుణ్ణి, కోడల్ని అవమాన పర్చినట్లే అవుతుంది. మీరు ప్రాణానికి ప్రాణంగా ప్రేమించె, కంటికి రెప్పలా చూసుకునే మీ భార్య తరపు బంధువులను గౌరవించకుంటే మీ భార్య మనస్సును జయించలేరు. ఆమె హృదయంలో చోటు సంపాదించలేరు. భర్త విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. ఇంట్లో పిల్లలందరినీ ఆదరించాలి. పిల్లలే కదా అని తక్కువ చేయకుండా వారి ఆత్మాభిమానాన్ని గౌరవించడం కూడా పిల్లల శిక్షణలో భాగమే. ఇంట్లో ఉన్న చిన్నా పెద్దా అందరినీ గౌరవించాలనే సంస్కారాన్ని చిన్నప్పటి నుంచే పిల్లలు నేర్చుకుంటారు.

కొందరు ఎప్పుడూ తమ బంధువుల గురించి అదేపనిగా చాడీలు చెబుతూ తిరుగుతుంటారు. బంధుమిత్రుల నుంచి ఎదుర్కొన్న సమస్యలు, వారి లోపాలను ఎంచుతూ ఏకరువు పెడతారు. అలా చేస్తేనే వారి కడుపు మంట చల్లారినట్లు అవుతుంది. ఇక చాడీలు వినేవారు కూడా తమ రెండు చెవులను రిక్కించి మరీ వింటూ ఎంతో ఆనందాన్ని పొందుతుంటారు. ఒక్కో ఫిర్యాదును, చాడీని మాటిమాటికీ పునరావృతం చేస్తూ తమ ఇంటి సౌందర్యాన్ని, సౌభాగ్యాన్ని అంతం చేసుకుంటారు. ఇంట్లో పెద్దలు మాట్లాడుకునే చాడీలు, నిందారోపణల ప్రభావం పిల్లలపై పడుతుంది. కుటుంబంలో పెద్దలుగా చెలామణి అయ్యేవారు ఈ చాడీల, నిందారోపణల వల్ల తమ వ్యక్తిత్వాన్ని దిగజార్చుకుంటారు. ఏ ఇంట్లో అయితే తరతమ భేదం లేకుండా మంచి సుగుణాలను చర్చించుకుంటారో ఆ ఇల్లు ఆదర్శనీయం. ఇంట్లో తమ పెద్దల మంచితనం గురించి పిల్లలు విన్నప్పుడు గౌరవ భావం పెంపొందుతుంది. పెద్దల మంచితనం, సౌశీల్యం, సుగుణా లను పిల్లలు పుణికి పుచ్చుకుంటారు. పెద్దలను గౌరవిస్తూ, పిల్లలతో ప్రేమగా మెలగాలన్నది ప్రవక్త (స) బోధన. ముందు మనం స్వచ్ఛతను, పరిశుభ్రతను పాటించాలి. అప్పుడే మన ఇల్లు స్వచ్ఛత, శుభ్రతకు మారుపేరుగా నిలుస్తుంది. గౌరవ మర్యాదలు మన ఇంటి తోరణాలవుతాయి. పరువు ప్రతిష్టలు మన గృహానికి పైకప్పులవుతాయి. ప్రేమ, త్యాగం మన ఇంటి గోడలవుతాయి. మన ఇల్లు సుఖ సంతోషాలు, శాంతి సంతృప్తులతో అలరారుతుంది. ఇలాంటి ఇంటి నిర్మాణం కోసమే ప్రతి ఒక్కరూ కల కనాలి. ✤

ఆలియా బిన్తె మునీర్ ( షర్ఫియ)



# సామాజిక జాడ్యాలు కుటుంబ వ్యవస్థకు గొడ్డలిపెట్టు

**అహర్నిశలూ ఏదో లక్ష్యం కోసం** పనిచేస్తూ పాకులాడే మనిషికి రోజులో కొంత సమయమైనా ఓదార్చే మనిషి కావాలి. తన లక్ష్యం వైపు ప్రోత్సహించే తోడుకావాలి. తనను ప్రేమానురాగాలతో చూసుకునే ఎవరో ఒక మనిషి కావాలి. "నా" అనే వాళ్ళు ఎవరూలేని ఒంటరి బతుకులు ఎందరివో. ప్రేమ వాత్సల్యం కోసం పరితపిస్తుంటారు. మరికొంతమంది తమ ఉపాధి కోసం స్వదేశాన్ని, తన వాళ్లను విడిచి విదేశాలలో జీవితాన్ని కొనసాగిస్తుంటారు. అక్కడ వారి పిల్లలు తమ అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యలకు దూరంగా గడుపుతూ, వారి ప్రేమకు బహుదూరంగా జీవనం కొనసాగించవలసి వస్తుంది. అందుకే "బంధువులు లేని వారిని అడగండి బంధువుల విలువ" అంటుంటారు. తమ కుటుంబంతో, బంధువులతో గడిపేవారికి మించిన అదృష్టవంతులు ఇంకెవరుంటారు.

ప్రేమలు ఆప్యాయతలు, సుఖదుఃఖాలలో కలిసిమెలిసి జీవించడానికే కుటుంబం. హక్కులు, బాధ్యతలను ఎరిగి మసలుకున్నప్పుడే కుటుంబ జీవితం సాఫీగా సాగుతుంది. తల్లిదండ్రుల హక్కులు, భార్యాభర్తల హక్కులు సంతానం హక్కులు, బంధువుల హక్కుల గురించి ఖుర్ఆన్ తాకీదు చేస్తుంది. తమ

బంధువుల పట్ల హక్కులను నెరవేరిస్తే ఆ కుటుంబంలో ఎన్నో ఆప్యాయతలు, అనురాగాలు చోటుచేసుకుంటాయి. అయితే కుటుంబ సభ్యుల మధ్య కలతలు, కలహాలు తలెత్తడం సహజం. వాటిని మంచి మనసుతో మన్నిస్తూ, విశాల హృదయంతో ఒకరి నొకరు అర్థం చేసుకుంటూ దగ్గరయితే బంధాలు బలపడతాయి. కుటుంబం పటిష్టంగా ఉంటే సమాజం పటిష్టంగా ఉంటుంది.

ఉదాహరణకు నేటి సమాజంలో భార్యాభర్తల సంబంధాలను ఒకసారి గమనిద్దాం. వారిరువురి పరస్పరం తమ హక్కులను సరిగ్గా నెరవేర్చు కోకపోవడంతో వారి మధ్య భేదాభిప్రాయాలు రావడం, చిన్న చిన్న పోట్లాటలు, గొడవలకు దారి తీయడం తరచూ జరుగుతుంటుంది. ఇది వారి పిల్లల ఆలోచనా సరళిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పిల్లలు పెద్దయ్యాక తమ కన్నవారిని భారంగా భావించి వారిని వృద్ధాశ్రమాల్లో వదిలే వార్తలు మనం తరచూ చూస్తున్నాము.

ఒక బాధ్యత తెలియని తండ్రి తన కొడుకు బయటికి వెళ్లి ఏం చేస్తున్నాడు? అన్నది అసలు పట్టించుకోడు. సమాజంలో ఉన్న ఆడపిల్లలతో ఎలా ప్రవర్తిస్తున్నాడు అన్న ధ్యాస అతనికి ఉండదు. అటువంటి తల్లిదండ్రులు కూతురి పరిస్థితిని గమనించడం పై కూడా దృష్టిని పెట్టరు. తద్వారా పిల్లలు తమ ఈ స్వేచ్ఛను చెడుచేష్టల కోసం వినియోగించుకుంటున్నారు. ఇక దేశానికి వెన్నెముక అయిన యువత వ్యసనాలకు బానిసైపోతోంది. ప్రమాదకరమైన డ్రగ్స్‌కు బానిసైన యువత ముగింపు చాలా ప్రమాదకరంగా ఉంటోంది. అగ్నిలో ఆజ్యం పోసినట్టు లివింగ్ రిలేషన్, స్వలింగ సంపర్కం, క్లబ్బు సంస్కృతి ఇవన్నీ కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తున్నాయి. సమాజంలో అనేకానేక చెడులు పేరుకు పోవడానికి కారణభూతమవుతున్నాయి. కుటుంబ వ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారిన సామాజిక జాడ్యాలను తరిమి కొట్టాలి. ✤

## మీ ఇల్లు ఇలా ఉందా? (17వ పేజీ తరువాయి)

కూడ కొంత ఇవ్వండి.' అన్నది ఖుర్‌ఆన్ ఉద్బోధ. భార్యాభర్తల బంధంతో ఒక్కటయ్యే కుటుంబంలో అన్నా, చెల్లి, భార్యా, భర్త ఇతరత్రా బంధుత్వాలు ఏర్పడతాయి. ఈ సభ్యుల కలయికతో ఏర్పడే కుటుంబం పదికాలాలపాటు మనగలగాలంటే బంధువుల హక్కులు నెరవేర్చబడాలి. బంధువులను అందరికంటే ఎక్కువగా ప్రేమించాలి. ప్రేమను వ్యక్తపర్చాలి. నిరుపేద బంధువుల అవసరాలను తీర్చాలి. 'మీకు రెండు చోట్ల నుంచి విందుకు ఆహ్వానం అందితే అందులో దగ్గరి రక్తసంబంధీకులెవరో వారింటికి వెళ్లండి' అని చెప్పారు ప్రవక్త మహనీయులు. ప్రవక్తలు, ప్రవక్త సహచరులంతా తమ బంధువుల హక్కులు చక్కగా నెరవేర్చారు. మనవల్ల ఏదైనా తప్పు జరిగితే బంధువులను మన్నించమని వేడుకోవడంలో క్షమించడంలో ఆలస్యం చేయరాదని, ఎవరైనా మన్నించమని ప్రాధేయపడితే ఆలస్యం చేయరాదన్నది ఇస్లామ్ బోధనల స్ఫూర్తి. దీనివల్ల దెబ్బతిన్న బంధుత్వ సంబంధాలు మెరుగవుతాయి. వైరం కారణంగా తమ సోదరుడితో మూడు రోజులకు మించి మాట్లాడకుండా ఉండరాదని ప్రవక్త (స) హెచ్చరించారు. తమ బంధువర్గంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే పరామర్శించడం, దగ్గరి బంధువుల్లో ఎవరైనా చనిపోతే అలాంటి వారి శవయాత్రలో పాల్గొనడం, ఆ కుటుంబం వారిని ఓదార్చడం ధార్మిక విధి. రక్త సంబంధీకులు, దగ్గరి బంధువుల పట్ల సంబంధాలను తెగదెంపులు చేసుకుంటే అల్లాహ్ అనుగ్రహం గగనమే అవుతుంది. అలాంటి వారు ఎన్ని దైవారాధనలు, ఉపవాసాలు, హజ్ యాత్రలు చేసినా నెరవేరవన్నది ప్రవక్త బోధనల సారం. బంధువుల పట్ల ప్రేమ, వాత్సల్యం కనబర్చినప్పుడే కుటుంబ వ్యవస్థ పటిష్టమవుతుంది. కుటుంబం పటిష్టమైతే సమాజం పటిష్టంగా ఉంటుంది. సుందర సమాజం ఉనికిలోకి వస్తుంది.

### కుటుంబ సభ్యుల నైతిక శిక్షణ...

ఇంటి యజమాని ఇంటివారి అవసరాలు తీర్చడమే కాదు ఇంట్లో భార్యాపిల్లలల్లో నైతిక శిక్షణ కోసం ఏర్పాట్లు చేయాలి. ఇంటి వారందరినీ సుశిక్షితులుగా తీర్చిదిద్దినప్పుడే కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు, హక్కులు, బాధ్యతలు నెరవేర్చబడ తాయి.

### ఇంటివారి శిక్షణ గురించి ఖుర్‌ఆన్ ఆదేశాలు..

విశ్వాసులారా! మీరు మిమ్మల్నీ, మీ కుంటుంబ సభ్యులనూ మానవులు, రాళ్లు ఇంధనం కాబోయే అగ్ని నుండి కాపాడుకోండి. (66:6)

కుమారా! నమాజును స్థాపించు, మంచిని ఆజ్ఞాపించు, చెడుపనుల నుండి నిరోధించు, ఏ కష్టం కలిగినా దానికి సహనం వహించు. ఈ విషయాలు ఎంతో గట్టిగా ఆజ్ఞాపించబడిన విషయాలు. ప్రజలతో ముఖం ప్రక్కకు త్రిప్పి మాట్లాడకు, భూమిపై నిక్కుతూ నడవకు. అహంభావి, బడాయికోరు అయిన ఏ వ్యక్తినీ అల్లాహ్ ప్రేమించడు. నీ నడకలో సమమైన తూకం పాటించు, నీ కంఠస్వరాన్ని కొంచెం తగ్గించు, అన్ని స్వరాల కంటే అతి చెడ్డ స్వరం గార్దభాల స్వరం." (31: 17-19)

✤ ✤ ✤

షేక్ అబ్దుల్ బాసిత్ కొత్త గూడెం



# కూలుతున్న కుటుంబాలను నిలబెట్టేదెలా?

**ఆత్మీయ** అనుబంధాలకు, ప్రేమానురాగాలకు, బంధుత్వ సంబంధాలకు పెట్టింది పేరు భారతదేశం. గతంలో ఇంట్లో అందరూ కలిసిమెలిసి ఒకరి కష్టసుఖాలను మరొకరు పంచుకుని హాయిగా ఆనందంగా జీవించేవారు. ఏదైనా కష్టం, ఆపద వచ్చినా భయపడేవారు కాదు. ఆదుకోవడానికి నా వారు ఉన్నారు అన్న భరోసా ఉండేది. ఇంటి పెద్ద అజమాయిషీలో ఇంటిల్లిపాదీ ఒక క్రమశిక్షణతో నడుచుకునే వారు. ప్రతి ఒక్కరి కష్టం తన కష్టంగా, ప్రతి ఒక్కరి ఆనందం తన ఆనందంగా భావించేవారు. కల్మషం లేకుండా, ఈర్ష్య ద్వేషాలను దరిచేరనివ్వక కలిసిమెలిసి ఆడుతూ పాడుతూ ఆనందంగా జీవించేవారు. ప్రపంచీకరణ ప్రభావం వల్ల కుటుంబ వ్యవస్థ కుంటుపడింది. ప్రేమానురాగాలు, ఆప్యాయత అనుబంధాలు కనుమరుగు అయ్యాయి.

ఐదంకెల జీతం. రాజభవనాలను తలదన్నే ఇళ్ళు. లగ్జరీ కార్లు. అరచేతిలో స్వర్గం చూపే టీవీలు, ఫోన్లు అన్నీ ఉండి కూడా మనశ్శాంతి లేక చిన్న చిన్న సమస్యలకే ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కారణం మనిషి ప్రకృతికి విరుద్ధంగా జీవించడమే. అవసరానికి మించి ఇంకా ఏదో కావాలనే అత్యాశ. ముఖ్యంగా మనిషి తన జీవిత మర్మాన్ని మరచిపోవడం. ఈ జీవితం శాశ్వతం కాదని తెలుసు. అయినా నాది నాది అనే మాయలో పడి కొట్టుకుపోతున్నాడు. రండి! కుటుంబాల మధ్య ఆవిరైపోతున్న అనుబంధాలను, ప్రేమానురాగాలను, సుఖ సంతోషాలను ఆప్యాయతలను ఎలా కాపాడుకోవాలో అందుకు ఇస్లాం చూపుతున్న మార్గం ఏమిటో తెలుసుకుందాం.

కుటుంబమనే బండికి భార్యా భర్తలు రెండు చక్రాల్లాంటివారు. కుటుంబం సాఫిగా, సంతోషంగా ముందుకు సాగాలంటే

భార్యాభర్తల మధ్య సఖ్యత, సహనం, పరస్పర సహకారం ఎంతో అవసరం.

భార్యాభర్తలు పరస్పరం ఒకరికొకరు దుస్తుల వంటివారు అన్నది ఖుర్‌ఆన్ ఉపమానం. దుస్తులు మనిషి అందాన్ని పెంచుతాయి. గుప్తమైన శరీర భాగాలను కప్పిపుచ్చుతాయి. మనిషి హుందాతనాన్ని, గౌరవాన్ని పెంచుతాయి. అలాగే భార్యాభర్తలు కూడా ఇరువురు ఒకరి బలహీనతలను మరొకరు కప్పిపుచ్చుకుని, సమాజంలో గౌరవమర్యాదలను పెంచుకుంటూ జీవించాలన్నది ఖుర్‌ఆన్ ఉద్దేశం.

ఒకరి తప్పొప్పులను చిన్న చిన్న లోపాలను చూసీచూడనట్లు సర్దుకుపోవాలి.

“మీకు ఏ కారణం చేతనైనా ఆమె ఇష్టం లేకపోవచ్చు. మీకు ఇష్టం లేని వస్తువులోనే బహుశా దేవుడు మీ కొరకు ఎంతో మేలు పొందుపరిచి ఉండవచ్చు.” (ఖుర్‌ఆన్ 4:19)

భార్య అందంగా లేకపోవచ్చు కాని ఆమె గుణగణాలు ధార్మికత వల్ల ఎనలేని మేళ్ళు కలగవచ్చు. ఆమె ద్వారా పొందే సంతానం వల్ల మీ కీర్తిప్రతిష్టలు పెరగవచ్చు. వారి వల్ల శాశ్వత స్వర్గం లభించవచ్చు. అందుకే ఇరువురు సర్దుకుపోయే గుణం అలవర్చుకోవాలి.

## అల్లాహ్ భార్యాభర్తలను సృష్టించిందే అందుకు:

“ఆయన సూచనలలో మరొకటి ఏమిటంటే ఆయన మీ కొరకు భార్యలను మీ జాతిలో నుండే సృష్టించాడు. మీరు వారివద్ద శాంతి పొందడానికి, మీ మధ్య ప్రేమనూ, కారుణ్యాన్నీ సృష్టించాడు. నిశ్చయంగా ఆలోచనా పరులకు ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి.” (ఖుర్‌ఆన్ 30:21)

పెళ్లి తర్వాత ఇరువురు తమ అత్తామామలను తమ అమ్మానాన్నలుగా తన ఆడబిడ్డలను తోబుట్టువులుగా భావిస్తే అసలు సమస్యే ఉండదు.

ధార్మిక పరిజ్ఞానం లేకపోవడం వల్ల కూడా కుటుంబ సభ్యుల మధ్య గొడవలకు దారి తీస్తాయి.

“తల్లిదండ్రులతో మంచితనంతో వ్యవహరించండి. ఒకవేళ మీ వద్ద వారిలో ఒకరు గాని ఇద్దరు గాని ముసలివారై ఉంటే, వారి ముందు విసుగ్గా “ఛీ” అని కూడా అనకండి. వారిని కసురుకుంటూ సమాధానం ఇవ్వకండి, వారితో మర్యాదగా మాట్లాడండి. మృదుత్వమూ దయాభావమూ కలిగి వారి ముందు వినమ్రులై ఉండండి”. (ఖుర్‌ఆన్ 17: 23,24)

“తల్లిదండ్రుల సేవలోనే మీ ఆయువు, ఆరోగ్య ఐశ్వర్యాలు, వృద్ధి ఆనందాలు దాగి ఉన్నాయి.”

“తల్లి దండ్రులే మీ స్వర్గం. తల్లి దండ్రులే మీ నరకం.”

“తల్లి పాదాల చెంత స్వర్గం ఉంది.”

“తండ్రి స్వర్గానికి ప్రధాన ద్వారం” అని ప్రవక్త ముహమ్మద్ (స) తెలిపిన ఆదేశాలను ఆచరణలో పెడితే ఆ ఇల్లు స్వర్గసీమగా మారుతుంది.

కుటుంబ సభ్యులంతా ఒకరి సుఖసంతోషాల కోసం మరొకరు త్యాగగుణాన్ని అలవర్చుకోవాలి. అప్పుడే కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు ఆప్యాయత అనుబంధాలు వృద్ధి చెందుతాయి. గొడవలు వారి దరిచేరవు. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక బలహీనత ఉంటుంది. ఆ బలహీనతను భరించే గుణం అలవర్చుకోవాలి. అప్పుడే మనశ్శాంతి లభిస్తుంది. లేదా నువ్వెంత అంటే నువ్వెంత అని పోట్లాటలు, ఆ తరువాత పంతాలు పట్టింపులకుపోతే ఆ ఇంట్లో ఆనందాలు, సంతోషాలు మృగ్యమయిపోతాయి.

నేడు పిల్లలను చిన్న నాటి నుంచే లగ్జరీ జీవితాలకు అలవాటు చేస్తున్నాం. చదువుల పేరుతో చిన్నప్పటి నుంచే ఇంటికి దూరంగా ఉంచి, బంధుత్వ సంబంధాలు, మమతా నురాగాలు అంటే ఏమిటో తెలియకుండా చేయడం వల్ల మనిషిలో స్వార్థం స్వలాభం పెరిగిపోయింది. ఫలితంగా అమ్మా నాన్న, నానమ్మ, అమ్మమ్మ, తాతయ్య, అత్తయ్య, మావయ్య, బాబాయ్, పిన్ని అనే బంధాలను మరచి పోయాం. సెల్‌ఫోన్ వచ్చాక దూరాలు మరింత తగ్గాయి. కాని మానవ సంబంధాలు దూరం అయ్యాయి. స్మార్ట్ యుగంలో కూలుతున్న కుటుంబాలను కాపాడే బాధ్యత ఎవరిది? ✤


గీటురాయి వారపత్రిక — ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.

బతూల్ హుమైర్వీ



# కుటుంబ వ్యవస్థ.. సవాళ్లు, పరిష్కార మార్గాలు!

**మానవులారా!** మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణినుంచి పుట్టించాడు. అదే ప్రాణి నుంచి దాని జతను సృష్టించాడు. ఇంకా ఆ జంట ద్వారా ఎంతో మంది పురుషులను స్త్రీలను అవనిలో వ్యాపింపజేశాడు. ఏ దేవుని పేరు చెప్పుకొని మీరు మీ మీ పరస్పర హక్కులను కోరుకుంటారో ఆ దేవునికి భయపడండి. బంధుత్వ సంబంధాలను తెంచడం మానుకోండి. అల్లాహ్ మిమ్మల్ని పరికిస్తున్నాడనే విషయాన్ని తెలుసుకోండి. (నిసా : 1)

దివ్య ఖుర్ఆన్‌లో నమాజ్, రోజా, జకాత్, హజ్ మౌలిక ఆరాధనల ఆదేశాల కన్నా నికాహ్, తలాక్, ఖులా, ఇద్దత్ భరణం, కుటుంబ వ్యవస్థకు సంబంధించిన బోధనలే ఎక్కువగా కనపడతాయి. మన పండితులు, ఉలమాలు ముస్లిం సమాజానికి నమాజ్, రోజా, జకాత్ బోధనలయితే నేర్పారు కానీ నికాహ్, మహర్, ఆలుమగల అనుబంధ బాంధవ్యాలు, పరస్పర హక్కులు బాధ్యతలు, తలాక్, ఖులా, బహుభార్యత్వం లాంటి ఆదేశాలను ప్రచారం చేయడంలో విఫలమయ్యారు. కుటుంబ వ్యవస్థకు తొలి మెట్టు అయిన వివాహ విషయానికి వస్తే వివాహం మహా ప్రవక్త(స) సంప్రదాయం. ఇస్లాం వివాహాన్ని సులభతరం చేసి వ్యభిచారాన్ని కష్టతరం చేసింది. దురదృష్టకరం ఏమంటే నేటి భౌతిక ప్రపంచంలో ముస్లిం సమాజంలో జరుగుతున్న వివాహాలు వ్యాపారాన్ని తలపిస్తున్నాయి. ఎక్కడ సిరి సంపదలు అధికంగా లభించే ఆస్కారం ఉందో అక్కడే సంబంధాలు జరుగుతున్నాయి. మీరు ఏ స్త్రీనీ కేవలం ధన సంపదల కొరకు వివాహమాడకండి. ధార్మికత ప్రమాణం

గానే వివాహమాడండి అన్న మహాప్రవక్త(స) ప్రవచనాన్ని పెడచెవిన పెట్టారనడానికి ఇంతకన్నా మరో నిదర్శనం ఏముంటుంది?

### కట్నకానుకలు..

కట్నకానుకల వ్యవహారం ఇతరుల నుంచి ముస్లిం సమాజంలో జహేజ్ పేరుతో ఉనికిలోకి వచ్చింది. సమాజంలో కట్నకానుకల డిమాండ్ పెరిగే కొద్దీ ప్రజల్లో దురాశ, పేరాశలు కూడా పెరిగి పోయాయి. కేవలం కట్నకానుకలు తీసుకు రానందునే అత్తారింటి ఆరళ్లు భరించలేక ఎంతో మంది ఆడపడుచులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు మనం కళ్ళారా చూస్తూనే ఉన్నాము. వరకట్నం తీసుకు రాలేదనే నెపంతో వధువును అత్యంత కిరాతకంగా కాల్చిన సంఘటనలు కూడా పత్రికల్లో చూస్తున్నాం. కొందరు తల్లి దండ్రులు పిల్లల వరకట్న భారాన్ని భరించలేక ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు కోకొల్లలు.

వరకట్న పిశాచి సామాజిక దురాచారంగా మారి విలువలకు తిలోదకాలివ్వడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నది. ఇక దుబారా ఖర్చులు అయితే సామాజిక స్టేటస్‌గా మారి పోయాయి. వివాహ మండపాల అలంకరణకై లక్షల రూపాయలు వెచ్చిస్తున్నారు. ఒక్క రాత్రి అలంకరణపై వెచ్చిస్తున్న డబ్బులతో వేలకొద్దీ పేదపిల్లల వివాహాలు చేయొచ్చు. వలీమా విందుల వ్యయాల సంగతీ విడ్డూరమే. విందులో పెట్టే వెరైటీలు మనిషి చూడడం ఎక్కువ తినడం తక్కువ... ఫలితంగా ఎంతో భోజనం వృథా అవుతుంది. ఇక మహర్ కూడా నామమాత్రంగానే ఇచ్చి చేతులు దులుపు కోవడం షరా మామూలు. ఇచ్చినా అది మహిళలకు అందడం అరుదైన విషయమే.

ఈ సకల సమస్యలకు ముస్లిం సమాజ స్థితిగతులే కారణం అంటే అతిశయోక్తి కాదేమో. ధార్మిక అవగాహనారాహిత్యం, అంధ విశ్వాసాలు, వివాహాలు వ్యయ ప్రయాసాలతో నిండి పోయాయి. చిన్న చిన్న మాటలు చిలికి గాలి వానలా తయారై భార్య భర్తల మధ్య అగాధాలకు కారణమవుతు న్నాయి. చివరికి వ్యవహారం తలాక్ వరకు వస్తుంది. అనురాగం ఆప్యాయతలతో అలరారే కుటుంబాలు ఒక్కసారిగా కుప్ప కూలిపోతున్నాయి. తల్లిదండ్రులు పిల్లలను పంచుకుంటు న్నారు. పర్యవసానం పిల్లల్లో ప్రేమానురాగాలు కరువవుతు న్నాయి. ముస్లిం సమాజంలో స్త్రీలు వారసత్వ వాటాను కోల్పోవటం కడు శోచనీయం. ఒకవేళ ఆస్తి పంపకాలు జరిగినా చట్టబద్ధంగా జరగట్లేదు. ఈవిధంగా వారసత్వ చట్టం ఉల్లంఘనకు గురవుతున్నది. వారసత్వపు హక్కులను తుంగలో తొక్కుతూ కట్నకానుకలే వారసత్వపు వాటాలు అని సమాజ మేధావులు సరిపెట్టుకుంటున్నారు.

ఇస్లాంలోని కుటుంబ వ్యవస్థ కేవలం మహిళలకే కాదు యావత్తు మానవాళికి కారుణ్య వ్యవస్థ అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. కనుకనే అమెరికా, యూరప్‌లోని అత్యధిక మంది ఇస్లాంను ఆశ్రయిస్తున్నారు.

పురుషుడికి తలాక్ హక్కుతో పాటు స్త్రీకి ఖులా హక్కును ఇవ్వడం జరిగింది. తలాఖ్ అనుమతి కూడా భార్యాభర్తలిరువురు కలిసి ఉండడం సాధ్యం కాకపోయినప్పుడే. దైవప్రవక్త తలాక్‌ను ధర్మసమ్మతమైన విషయాలలో అన్నిటికన్నా అయిష్టమైన విషయంగా అభివర్ణించారు.

ఇస్లాం కుటుంబానికి చివరి కంచుకోట అని చెప్పుకోవచ్చు. అందులో స్త్రీ పురుషుల హక్కులు, బాధ్యతలు ఇరువురి పరిధులు సమతుల్యంగా ఉన్నాయి. దానికి భిన్నంగా పాశ్చాత్య సంస్కృతి స్త్రీ పురుష సమానత్వాల పేరుతో చేసిన తతంగాలు వారి పర్యవసానాలు మనముందు ఉండనే ఉన్నాయి. కుటుంబ వ్యవస్థ అతలాకుతలమై పోయింది. అక్కడ వివాహ రేటు విపరీతంగా తగ్గిపోయింది విడాకులు అధికమవుతున్నాయి. వృధ్ధులు ఓల్డేజ్ హోమ్‌లలో ఆశ్రయం పొందే అభాగ్యస్థితికి చేరుకున్నారు.


ఇక ట్రిపుల్ తలాక్ విషయానికొస్తే ఇస్లాంతో దానికి ఎటువంటి సంబంధం లేదు. తలాక్ ఉత్తమ పద్ధతి దివ్య కుర్‌ఆన్, హదీసులలో బోధించబడింది. ఒకవేళ అజ్ఞానంతో ఒకేసారి మూడు తలాకులు ఎవరైనా ఇచ్చినట్లయితే అందువల్ల నష్టపోయేది మాత్రం స్త్రీయే. అకస్మాత్తుగా ఆమె తన ఆశ్రయాన్ని కోల్పోతుంది. తల్లిదండ్రులు ఉంటే తన వెంట తీసుకెళ్తారు, లేనియెడల ఇంటిని విడిచి వెళ్ళవలసిన దుర్భర పరిస్థితి దాపురిస్తుంది. ఒకవేళ తల్లిదండ్రులు సజీవంగా లేకపోతే ఆమె ఇబ్బందులు మరింత రెట్టింపవు తాయి. విడాకులు పొందిన స్త్రీకి సమాజంలో ఎటువంటి ఆదరణ లభించదు. అస్తమానం అవహేళనకు గురికావాల్సి వస్తుంది. ఆమె రెండవ వివాహం కూడా కష్టతరమవుతుంది. ఒకవేళ పిల్లలు ఉంటే తల్లితో ఉండదలుచుకుంటారు. తల్లి మమతానురాగాలు కూడా పిల్లలను తనతో దూరం చేయ జాలవు. ఇక ఇస్లాం బోధనల ప్రకారం విడాకులు పొందిన స్త్రీకి ఇద్దత్ తరువాత ఎటువంటి భరణం దొరకదు. పిల్లల పోషణ బాధ్యత మాత్రం తండ్రి పైనే ఉంటుంది. కానీ అక్కడ కూడా ఆశించినంత ఫలితం లభించదు. కొన్ని పరిస్థితుల్లో

**(మిగతా 41వ పేజీలో)**

కథ

# ఫ్యామిలీ సర్వే

అబ్దుల్ సమద్, నంద్యాల





**ఆరిఫ్** ఓ ఎన్జీవోలో పని చేస్తున్నాడు. దేశవ్యాప్తంగా మన కుటుంబ వ్యవస్థ పటిష్టతను అంచనా వేసేందుకు ఆ ఎన్జీవో ఫ్యామిలీ సర్వే ప్రాజెక్టును చేపట్టింది. ఈ నేపథ్యంలో ఆ ఊళ్లో కొన్ని కుటుంబాలను సందర్శించాల్సి వచ్చింది అతనికి. ఈ సందర్భంగా తను కలిసిన ఓ కుటుంబాన్ని ఇలా పరిచయం చేసాడు.

పొద్దుకుంకినాక చలి ఎక్కువైంది. దగ్గరలోని మస్జిదులో ఇషా నమాజ్ చేసి వచ్చి షాపు మూయమని పురమాయించాడు జహంగీర్. గాంధి సర్కిల్‌లో చప్పల్ హోల్‌సెల్ వ్యాపారం నడుపుతున్నాడు. చుట్టుప్రక్కల గ్రామాల నుండి చిరు వ్యాపారులు వచ్చి హోల్ సెల్‌గా చెప్పులు బండల్స్ తీసుకుని పోతుంటారు. చిన్న పిల్లల నుండి ఫ్యాన్సీ వరకు, లోకల్ నుండి కాన్పూర్ వరకు షూలు జహంగీర్ షాపులో లభిస్తాయి. తండ్రి నుండి వారసత్వంగా వచ్చిన వ్యాపారాన్ని లాభాల బాట పటిస్తున్నాడు. గుమస్తాల సాధక బాధల్లో సహాయం చేస్తుంటాడు. అందుకే జహంగీర్ షాపులో ఇరవై ఏండ్లుగా పని చేసే గుమాస్తాలు ఉన్నారు. షటర్స్ మూయించి స్కూటర్‌పై ఇంటికి వెళ్ళాడు జహంగీర్. స్కూటర్ పార్కింగ్ చేసి ఇంట్లో 'అస్సలాము అలైకుం! అంటూ ప్రవేశించాడు. షాపునుండి వస్తూ తెచ్చిన పండ్ల పాకెట్ అప్పుడే ఇషా నమాజ్ పూర్తి చేసి వస్తున్న భార్యకు ఇచ్చి పిల్లల గురించి వాకబు చేశాడు. పెద్ద అబ్బాయి కరీం మనవడ్ని తీసుకొని డాక్టర్ వద్దకు వెళ్ళాడని, రెండవ వాడు కాలేజీలో సెమినార్ ఉంది లేటుగా వస్తానని చెప్పి వెళ్ళాడంది. అమ్మాయి రేపు ఖవాతీన్ ఇజ్తిమాలో ప్రసంగం కోసం ఏదో నోట్సు తయారు చేసుకుంటుంది అని చెప్పింది భార్య. రోజూ రాత్రి అందరు కలిసి భోజనం చేయడం ఆ ఇంట ఓ సాంప్రదాయం. రోజువారిలాగే ఆ కుటుంబం ధార్మిక సమావేశం ఏర్పాటు చేసుకుంది. ఒకరు ఖుర్ఆన్ చదివి భావం వివరించారు. ఎవరి నమాజులు జమాతులు ఎందుకు మిస్ అయ్యాయి ఇత్యాది విషయాలు చర్చించి నిద్రలోకి జారుకున్నారు.

జహంగీర్ అందరితో కలుపుగోలుగా ఉంటాడు. తన ముందు చేయిచాచిన వారిని కాదనకుండా సాయపడతాడు. ఇక పేద పిల్లల చదువులు, పెళ్లిళ్లలో సాయం చేయడానికి ముందుం టాడు. పండగలూ పబ్బాలకు జహంగీర్ ఇల్లు చిన్నపాటి పెళ్లి వేడుకను తలపిస్తుంది. ఊరంతా చుట్టాలే అతనికి. బిర్యాని ఘుమఘుమలతో ఆ వీధంతా సువాసనలు వెదజల్లుతుంది. కులమతాల పట్టింపులు లేకుండా అందరూ జహంగీర్ మావయ్య, బాబాయి, అన్న అని వరుసలు కలిపి పిలిస్తే జహంగీర్ ఎంతో మురిసిపోతాడు. తాను గొప్ప డబ్బున్నవాడిని అనేది అతని వాలకంలో ఎక్కడా కానరాదు. ధార్మిక సభలంటే ఎంత డబ్బు ఖర్చయినా ఎంత దూరమైనా వెళతాడు. తనలో ఇంత మార్పు తీసుకువచ్చింది ఈ సభలే అని సగర్వంగా చెప్పుకుంటాడు. ఇల్లు, భార్య, పిల్లల బాగోగులు ఏమాత్రం పట్టించుకోకుండా బాధ్యతారాహిత్యంగా ఉండే తనని ఖుర్ఆన్ సందేశాలు తనలో పరివర్తన తెచ్చాయని తెలిసిన వారిదగ్గర సంతోషంగా చెప్పుకుంటాడు. ఆరిఫ్ తెచ్చిన ఫ్యామిలీ సర్వే ఫామ్‌లో జహంగిర్ పూర్తిగా ఇమిడిపోయాడు. అందులో అడిగిన ప్రశ్నలన్నీ ఆరిఫ్‌ను సంతృప్తపరిచాయి. ముసలి తల్లిదండ్రులను ఆదరించడం, భార్యను గౌరవించడం, పిల్లల చదువుల పట్ల శ్రద్ధ, తన తరపు బంధువులు, తన భార్య తరపు బంధువులతో సత్సంబంధాలు ఇవన్నీ చక్కగా నెరవేరుస్తున్న ఆరిఫ్ సర్వే ప్రశ్నావళిలో వందమార్కులు సాధించాడు. ఆరిఫ్ చేసిన వేరే కుటుంబాల సర్వేలో చాలా కుటుంబాల్లో పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఎన్నో కుటుంబాల్లో తల్లిదండ్రులు నిరాదరణకు గురవుతున్నారు. కొందరు తల్లిదండ్రుల్ని ఒంటరి వారిని చేసి విదేశాల్లో ఉంటున్నారు. వారి ఆలనాపాలనా చూసే వారు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొన్ని కుటుంబాల్లో భార్యభర్తల మధ్య పొసగక వేరయిపోయిన కుటుంబాలు ఇంకొన్ని. ఇంకొన్ని కుటుంబాల్లో డబ్బులేక పెళ్లికాని అమ్మాయిలు ఇళ్లల్లోనే ఉండిపోయారు. పిల్లలు వ్యసనాలకు బానిసై రోడ్డునపడ్డ కుటుంబాలు కొన్ని. ఇలా ఎన్నో కుటుంబాల దుస్థితి ఆరిఫ్‌ను ఎంతో బాధించింది. తాను ఉండే ఊళ్లో కుటుంబ పరిస్థితి ఇంత దారుణంగా ఉందని ఆందోళనకు గురయ్యాడు. ❖

తహసీన్ హుమైర్వీ



# అదే గొప్ప ఆస్తి!

**ఇస్లాంలో** కుటుంబ వ్యవస్థకు చాలా ప్రాధాన్యత ఉంది. మనిషి వ్యక్తిగత శిక్షణతో పాటు సాంఘిక జీవితానికి కావాల్సిన శిక్షణ కూడా ఇస్తుంది. అందుకే కొన్ని హక్కులు బాధ్యతలు వ్యక్తులపై మోపింది. కుటుంబ నిర్మాణంలో తొలి మెట్టు అయిన వివాహబంధం నుండే ఇస్లాం దిశానిర్దేశం చేస్తుంది. కుటుంబమనే బండి సక్రమంగా సాగాలంటే ఆలుమగలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి. బండి ఏ ఒక్క వైపు వంగినా విపరీత పరిణామాలు చోటుచేసుకుంటాయి.

మన సమాజంలోని కొన్ని కుటుంబాల్లో కొన్ని చోట్ల పురుషాధిక్యత కనిపిస్తే, మరికొన్నిచోట్ల ఆడవారి పెత్తనం కనిపిస్తుంది. దీనివల్ల పిల్లలు, అయితే తల్లి బంధువులకు దగ్గరవుతారు లేదా తండ్రి బంధువులకు. అంతేకాకుండా దూరమైన బంధువులను శత్రువులుగా భావించడం కూడా జరుగుతుంది. అలాకాకుండా మన పిల్లలు ఇరువైపుల వారిని తన బంధువులుగా భావించి, ప్రేమించే విధంగా వారి శిక్షణ జరగాలి.

## పెత్తనం తెచ్చే తంటాలు

పురుషాధిక్యత గురించి చర్చిస్తే, నేటి అత్యాధునిక కాలంలో కూడా స్త్రీను ఒకవైపు విలువలేని వస్తువుగా, మగవాడి దాసిగా, ఏ హక్కులు లేని దానిగా, అతని దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బతికే జీవిగా భావించడం జరుగుతుంది. కొన్ని కుటుంబాల్లో ఏదైనా సమస్య వచ్చినప్పుడు స్త్రీలతో సలహా సంప్రదింపులు చేయడం కూడా తగని విషయంగా భావించే వాళ్ళు లేకపోలేదు.

## పాశ్చాత్య పోకడలు

సాంకేతికంగా గొప్ప విప్లవాన్ని సాధించిన ప్రపంచం ఇప్పుడు ఒక కుగ్రామంగా మారింది. దీంతో మంచితో పాటు చెడు కూడా అంతటా తన పంజా విసురుతుంది. ఫలితంగా ఉన్నతమైన సమాజాల్లో స్వలింగ వివాహాలు, సహజీవనం, డేటింగ్, విశృంఖలత్వం, విచ్చలవిడితనం కూడా చోటు చేసుకుంటున్నాయి. విలువలు, మూలాలు లేని ఆ సంతానం ఎలా పెరుగుతుంది? ఇలాంటి సంస్కృతి వల్ల ఉన్నతమైన కుటుంబాలను ఊహించగలమా?

## విచ్ఛిన్నం చేస్తున్న టెక్నాలజీ

కుటుంబ వ్యవస్థకు బాహ్య ప్రమాదాలతో పాటు అంతర్గత ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి. ఈ విషయంలో జాగ్రత్త పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నేడు టీవీ సీరియల్స్, సినిమాలు, ప్రకటనలు కుటుంబ విలువలను పూర్తిగా నాశనం చేస్తున్నాయి. అశ్లీలం, ఉన్మాదంతో కూడిన వెబ్ సైట్లు మరింత వినాశనానికి పూనుకుంటున్నాయి. అందుకే కుటుంబ విచ్ఛిన్నంలో మీడియా కీలకమైన పాత్రను పోషిస్తుందని చెప్పక తప్పట్లేదు.

దీనికి భిన్నంగా పటిష్టమైన కుటుంబాల్లోని వ్యక్తుల్లో సామరస్యం, క్రమశిక్షణ ఉపాధి కోసం పాటుపడేతత్వం, లక్ష్యాలను సాధించే గుణం, మానసిక ప్రశాంతత, నమ్మకం, ఆనందం, ఆప్యాయత అనురాగాల్లాంటి ఉత్తమ గుణాలు జనిస్తాయి. హక్కులు, బాధ్యతలు వారిని ముందుకు నడిచే ధైర్యాన్నిస్తాయి. ఇది మొత్తం సంఘ జీవితానికి ఒక గొప్ప ఆస్తి లాంటిది. ✤

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
గీటురాయి
వారపత్రిక

సల్మా హుమేరా, ఏలూరు



# ఐడియల్ ఫ్యామిలీ

**కుటుంబం** అనగానే ఒకే ఇంట్లో కలిసి నివసించే కొందరు రక్తసంబంధీకులు అనవచ్చు లేదా వివాహం ద్వారా ఒకటైన భార్యభర్తలు కావచ్చు. కుటుంబ వ్యవస్థ ద్వారా పిల్లల్ని కనడం, వారికి ఉన్నతమైన సంస్కృతి సంప్రదాయాలను అందించడం, తద్వారా మేలైన జీవితాన్ని తమ సంతానానికి అందించడం లాంటివి లక్ష్యాలుగా ఉంటాయి. ఇటువంటి ఉన్నతమైన ఆశయాలు ఉన్నప్పుడే కుటుంబాలు సమాజానికి బలమైన వెన్నెముకగా నిలబడతాయి. నేడు భారతీయ కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమవడానికి కారణం, సామజిక, ఆర్థిక అంశాలతోపాటు పట్టణీకరణ, పాశ్చాత్యీకరణ అని చెప్పవచ్చు.

కౌమార దశను కూడా దాటని, యవ్వనం అంటే ఏమిటో కూడా తెలియని పిల్లలు ఈ రోజు ప్రేమ జపం చేస్తున్నారంటే కారణం వారికి ప్రేమ, ఆప్యాయత అనే పదాల అర్థం తెలియకపోవడం, వారి కుటుంబం వారికి సరైన ప్రేమ, ఆప్యాయతలను అందించలేకపోవడం. కుటుంబం అందించే ప్రేమకు, సినిమాలలో చూపించే ప్రేమకు మధ్య ఉన్న తేడాల అవగాహన లేకపోవడం. దీనికి కారణం వారి తల్లితండ్రులు వారి ప్రవర్తనపై ఆరోగ్యకరమైన నిఘా పెట్టక పోవడం. ఆ కుటుంబ పెద్దలు / తల్లిదండ్రుల నిర్లక్ష్య వైఖరి. తల్లితండ్రులిద్దరూ సంపాదన పరులైన కారణంగా పిల్లల ప్రవర్తన గురించి ఆరాతీసే సమయం కూడా వారికి లేకపోవడం.

ఈ రోజు అతి భయంకరమైన జాడ్యం ఏమిటంటే సహజీవనం. మన దౌర్భాగ్యం ఏమిటంటే న్యాయస్థానాలు కూడా

ఈ సహజీవనం తప్పుకాదని చెప్పడం, విచ్చలవిడి శృంగారానికి తలుపులు బార్లా తెరవడం. కానీ నేడు సమాజంలో చోటుచేసుకుంటున్న అనేక మార్పులు, పెరిగి పోతున్న విడాకులు, గృహహింసల కారణంగా 'సింగిల్ పేరెంట్' కుటుంబాలు ఎక్కువయ్యాయి.

## కుటుంబ వ్యవస్థ బలపడాలంటే ఏం చేయాలి?

పిల్లలుపెద్దవారై పెళ్ళిళ్ళు అయిపోతే ఎవరి కుటుంబాలు వారివే. ఈ విధంగా ఒక కుటుంబం నుండి వేరుపడి, మరిన్ని కుటుంబాలు ఉదయించినప్పటికీ చదువులు, ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా ఒకరికి ఒకరు దూరంగా బ్రతకవలసి వస్తోంది. అందుకే అప్పుడప్పుడు అయినా అందరూ కలుసుకునే విధంగా పథక రచన చేసుకోవాలి. ఆధుని కయుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరినొకరు పలుకరించుకునే సమయం చిక్కని కుటుంబాలు ఎన్నో. కేవలం ఫోన్లోనో, మొబైల్లోనో యోగక్షేమాలు కనుక్కునే కుటుంబాలు కూడా లేకపోలేదు. మొబైల్ మాయాజాలంలో పడి అన్యమనస్కంగా ఉండే జబ్బును వీలైనంత వరకూ అందరూ తగ్గించుకోవాలి. ప్రతీరోజూ కనీసంకొంత సమయ మైనా ఇంట్లో వాళ్ళతో గడిపేవిధంగా అందరూ ప్రయత్నించాలి.

## విచ్ఛిన్నమవుతున్న అనుబంధాలను కాపాడుకోవడం ఎలా?

ఈ రోజుల్లో ఎక్కువగా అనుబంధాలు విచ్ఛిన్నమవడానికి కారణం ఆస్తిపాస్తుల గొడవలు. ఒక తల్లి కడుపున పుట్టిన విషయం కూడా మర్చిపోయి ఆ జన్మ శత్రువులుగా మారి పోవడానికి ఆర్థిక వ్యవహారాలే ఎక్కువగా కారణం అవుతున్నాయి. ఎవరి గుండెల్లో రగిలే పగ, ప్రతీకారాలు వారినే దహించి వేస్తాయనే నగ్నసత్యాన్ని గుర్తించి, ప్రేమ, అభిమానాలను చుట్టూ ఉన్న ప్రతి ఒక్కరితో పంచుకునే ప్రయత్నం చేయాలి. ఈ ప్రపంచంలో ఏ ఒక్కరూ శాశ్వతంగా ఉండరు, ఏ రకమైన ఆస్తిపాస్తులు ఎవరి వెంటా రావు కాబట్టి బ్రతికే ఈ నాలుగు రోజులు అందరితో కలసిమెలసి బ్రతకడానికి ప్రయత్నించాలి. చెప్పుడు మాటలు విని శత్రుత్వం పెంచుకునే వాళ్ళు కూడా ఉంటారు. అటువంటి వాటికీ దూరంగా ఉండాలి. అనేక కుటుంబాలు వ్యక్తిగత కారణా లతో విచ్ఛిన్నం కావడం మనం రోజూ చూస్తూ ఉంటాం. అయినప్పటికీ మనదేశంలో అనేక కుటుంబాల మధ్య కనిపించే అన్యోన్యతా భావం మరే దేశంలోనూ కనిపించదు.

కుటుంబ వ్యవస్థ బలంగా లేకపోతే సమాజంలో ఎలాంటి దుష్పరిణామాలు ఎదురవుతాయో ఐక్యరాజ్యసమితి గ్రహించింది. అందుకే విచ్ఛిన్నమవుతున్న కుటుంబాల మధ్య తిరిగి సఖ్యత పెంపొందించాలనే ఉద్దేశంతో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 1992లో మే 15న అంతర్జాతీయ కుటుంబ దినోత్సవంను జరుపుకోవడానికి నిశ్చయించింది. కుటుంబాలలో నెలకొన్న విభేదాలను తొలగించి ఆయా కుటుంబాలలో సుఖశాంతులు నెలకొల్పే ఉద్దేశంతోనే ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా కుటుంబాలలో వస్తున్న మార్పులు, విచ్ఛిన్నమవుతున్న కుటుంబాలను కాపాడటం, కలిసి ఉంటే కలదు సుఖం అని చాటిచెప్పడమే ఈ అంతర్జాతీయ కుటుంబ దినోత్సవ ముఖ్య లక్ష్యం.

## క్షీణిస్తున్న ఆత్మీయ సంబంధాలను కాపాడుకునేదెలా?

నవనాగరిక ప్రపంచంలో రెండు కుటుంబాలు కాదు కదా రెండు మనసులు కూడా కలసి జీవించలేని పరిస్థితి నెలకొంది. తల్లిదండ్రులకు, వారి పిల్లలకు కూడా మనసులు కలవక మనస్పర్థలు వచ్చేస్తున్నాయి. తల్లితండ్రులు భారం కాదని, వృద్ధాప్యంలో తల్లిదండ్రులను దగ్గర ఉండి చూసుకోవడం తమ బాధ్యతగా ప్రతీ ఒక్కరూ గుర్తించాలి. మీ ఇంటికి వస్తే మాకేమి ఇస్తావ్? మా ఇంటికి వస్తే మాకేమి తెస్తావ్? అనే వ్యాపార ధోరణిలో కాకుండా బంధువులను ఆప్యాయత, అనురాగాలతో పలకరించాలి. పుచ్చుకునే చెయ్యికంటే, ఇచ్చే చెయ్యి గొప్పది అనే సత్యాన్ని ఎల్లప్పుడూ మనసులో పెట్టుకుని, మనకు చేతనైనంతలో మనచుట్టూ ఉన్న బంధు, మిత్రులకు మన సహాయ సహకారాలు అందించాలి.

## ఆదర్శ కుటుంబానికి ఆచరణీయ మార్గాలేవి?

ఒక వ్యక్తిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడంలో కుటుంబపాత్ర ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తుంది. కుటుంబంలోని తల్లిదండ్రులు, ఇతర పెద్దలు పిల్లల్ని సక్రమ మార్గంలో నడిపించి, వారి భవిష్యత్తుని తీర్చిదిద్దే విధంగా కృషిచేయాలి. తల్లి, తండ్రి, వారి పిల్లలు అందరూ కలిసి, వారి పోషణలో ఉండే తాత, బామ్మలు ఇంకా ఎవరైనా బంధుమిత్రులు ఉంటే వారి బాగోగులు చూసుకోవాలి. కుటుంబంలో పెద్దలు

ఒకరి అవసరం ఒకరు చూడటం, ఒకరిపై ఒకరు శ్రద్ధ వహించడం చేయాలి.

### ఫ్యామిలీ ఆనందాలకు నిలయమవ్వాలంటే?

డబ్బు సంపాదనలో పడిపోయి కనీసం భార్యాభర్తలు కూడా ప్రేమగా పలకరించుకునే పరిస్థితి లేదంటే మన కుటుంబాలు ఎంతగా విచ్ఛిన్న మయ్యాయో అర్థం చేసుకోవచ్చు. డబ్బు కంటే ప్రేమ, ఆప్యాయతలకు ఎక్కువ విలువ ఇవ్వాలి. కుటుంబంలో ప్రేమ, ఆప్యాయతలను నింపుకోవడానికి అవసరమైతే కొంత ధనత్యాగం చేయడానికి కూడా వెనుకాడకూడదు.

### ఇంట్లో పిల్లలు - పెద్దల సంబంధాలు ఎలా ఉండాలి?

పిల్లలకు మొదటి గురువులు వారి తల్లిదండ్రులే. పిల్లలకు పాఠశాలలో నేర్పించే పాఠాలు వారి ప్రవర్తనపై 25% ప్రభావాన్ని చూపిస్తే, వారి ఇంట్లో వాళ్ళు, ఇంట్లో పరిస్థితులు వారి ప్రవర్తనపై 75% ప్రభావాన్ని చూపిస్తాయి. అందువల్ల పెద్దల ప్రవర్తన వారి పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే విధంగా ఉండాలి తప్ప పిల్లలను తప్పిదారిపట్టించే విధంగా ఉండకూడదు. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? అని. పెద్దవాళ్ళ ప్రవర్తననే పిల్లలు కాపీకొడతారు. అందువల్లే పెద్దవాళ్ళు తమ ఉత్తమ, నైతిక ప్రవర్తనతో పిల్లలను ప్రభావితం చేయాలి. మంచి, చెడుల విచక్షణా జ్ఞానాన్ని పిల్లలకు నేర్పాలి. అనుక్షణం దండించే ధోరణిలో కాకుండా పిల్లలను ప్రేమగా, ఆప్యాయతగా దగ్గరకు తీసుకుని వారికి ఉత్తమ నడవడికను నేర్పాలి. వృద్ధులను, స్త్రీలను గౌరవించమని ప్రభుత్వం చట్టాలు చేస్తే సరిపోదు, మనం మన పిల్లలకు చిన్ననాటి నుండే వాటిని బోధించాలి.

భార్య, భర్తలిరువురిలో ఏ ఒక్కరూ ఎక్కువ కాదు, తక్కువా కాదు. సంసారమనే బండికి ఉన్న రెండు చక్రాలలో ఒకటి తక్కువ, ఒకటి ఎక్కువ అని భావించిన రోజున, ఖచ్చితంగా ఆ బండి బోల్తా పడక మానదు. అలాగే భార్యభర్తలు ఇద్దరూ ఎవరిపైఎవరూ అధికారులు కాదు, ఎవరికీ ఎవరూ సేవకులు కాదు. ఇద్దరి మధ్య ఉండవలసింది కేవలం ప్రేమ, అభిమానం, అవగాహన మాత్రమే. ఒకరి ఇష్టా యిష్టాలను మరొకరు సుహృద్భావంతో అంగీకరించాలి. ఒకరు కోపంలో ఉన్నప్పుడు మరొకరు ఆ కోపాన్నిచల్లార్చే ప్రయత్నం చేయాలి గాని, ఆ కోపాగ్నికి ఇంకా కొంచెం ఆజ్యం జోడించకూడదు.

కుటుంబంలో ఉన్న ప్రతి ఒక్కరు, తమ కుటుంబంలోని ప్రతీ బంధాన్ని గౌరవించి, ఇతరుల అభిప్రాయాలకు విలువ ఇచ్చినప్పుడే ఏ బంధమైనా శాశ్వతంగా నిలుస్తుంది ఆ కుటుంబం స్వర్గధామం అవుతుంది. ❖


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

నసీరా బేగం



# కుటుంబ వ్యవస్థకు పునాది

**భార్యాభర్తల** పవిత్ర బంధంతో కుటుంబ జీవనం ప్రారంభమవుతుంది. సృష్టి ప్రారంభంలో మొట్టమొదట భార్యాభర్తల బంధమే ఏర్పడింది. అల్లాహ్ ఆది మానవుడైన హజ్రత్ ఆదమ్ (అ)ను పుట్టించి ఆయన గారిని ఒంటరిగా వదిలిపెట్టలేదు. ఆయన గారికి తోడుగా ఉండటానికి, మనశ్శాంతిని పొందటానికి హజ్రత్ హవ్వా (అ)ను సృష్టించాడు. అంటే మొట్టమొదట ఏర్పడిన బంధం భార్యాభర్తల బంధం తరువాతనే ఇతర బంధుత్వాలు ఏర్పడ్డాయి.

భార్యాభర్తలిద్దరూ ఒక బండికి రెండుచక్రాల వంటి వారు. ఈ రెండూ ఒకదానికి ఒకటి తోడుగా ఉంటేనే బండి నడుస్తుంది. బండి నడవాలంటే రెండు చక్రాల దిక్కు కూడా ఒకేవైపు ఉండాలి. ఒకటి తూర్పు దిక్కుకు, మరొకటి పడమర దిక్కుకు నడిస్తే ఆ బండి రెండు ముక్కలవుతుంది. అదేవిధంగా భర్త ఒక విధంగా ఆలోచిస్తే భార్య దానికి వ్యతిరేకంగా ఆలోచించినట్లయితే వారి జీవితపు బండి కూడా ముక్కలు చెక్కలవుతుంది. ఈనాడు సమాజం ఎదుర్కొంటున్న పెద్ద సమస్య ఇది. అక్షరాస్యత పెరిగిన నేటి కాలంలో భార్యాభర్తల ఆలోచనా ధోరణి మారిపోయింది. నేను చెప్పినదే సరైనది అని భర్త అంటే నేను చెప్పిందే సరైనది అని భార్య నొక్కి చెప్పుతోంది. ఇద్దరి మధ్య సర్దుబాటు ధోరణి తక్కువైపోతోంది. సహనం లేకుండా పోతోంది. చివరకు సమస్య విడాకుల దాకా పోతోంది. అసలు విషయమేమిటంటే ఆగర్భ శత్రువైన షైతాన్ భార్యాభర్తల సంబంధాన్ని త్రెంచటానికి విశ్వ ప్రయత్నాలు చేస్తాడు, పన్నాగాలు పన్నుతాడు. ఎందుకంటే కుటుంబానికంతటికి భార్యాభర్తలు పునాదిరాళ్ళ వంటివారు. ఈ పునాదినే బలహీనపరచినట్లయితే దాని మూలంగా ఏర్పడే కుటుంబం మొత్తం బలహీనమైపోతుంది. ఛిన్నాభిన్నమవుతుంది. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గ్రహించి

(మిగతా 37వ పేజీలో)

ఖుర్షీద్ బేగం, మార్కాపురం

కథ



# ఫ్యామిలీ కన్వెన్షన్

**నజీబ్** మనసులో ఒక అద్భుతమైన ఆలోచన వచ్చింది. వెంటనే తన పాత ఫోన్‌డైరీ తీసి అందులో ఉన్న నెంబర్స్‌కు డయల్ చేయడం ప్రారంభించాడు. వచ్చే ఆదివారం హైదరాబాద్‌లోని తన బంధువులు అందరూ ఒకచోట ఫ్యామిలీ కన్వెన్షన్‌లో కలవాలని అందర్నీ ఆహ్వానించాడు. చాలా మంది ఇందుకు ఒప్పుకోలేదు. ఎలాగో అలాగా నానా తంటాలు పడి వారిని ఒప్పించాడు. చివరికి ఓ ఐదు ఫ్యామిలీస్ కన్వెన్షన్‌లో కలుద్దాం అని భరోసా ఇచ్చాయి. నజీబ్ అన్నలు, అక్కలు, నజీబ్ భార్య తరపు బంధువులతో ఒక లిస్ట్ రెడీ అయింది. అందరూ దగ్గరి బంధువులే. ఒకే ఊరిలో ఉన్నా ఎవరికి వారే యమునా తీరే అనే పద్ధతిలో ఉన్నారు. పెళ్ళిళ్ళలో కూడా కుటుంబం నుంచి ఒక్కరే హాజరు అవుతారు. ఫోన్ పలకరింపులు కూడా కరువయ్యాయి. పిల్లలకు అయితే ఎవరు మామయ్యో... ఎవరు పిన్నినో.. ఎవరు అత్తనో.. ఎవరికీ తెలియదు. చదువుల లోకంలో కుటుంబ విలువలు, బంధాలు, ఆప్యాయతలు మరిచి పోతున్నారు. అందరి జీవితాలు యాంత్రికం అయిపోయాయి. సెల్‌ఫోనే లోకం అయిపోయింది. అందరితో కలవాలి అనే కల్చర్ ఇప్పుడు ఫ్యాషన్ కాదు. రిజర్వ్‌డ్ లైఫ్ ఇప్పుడు స్టేటస్ అయిపోయింది. ఏంటో కలవడాలు లేవు, పలకరింపులు లేవు. కుటుంబాలలో ఆప్యాయతలు, అనుబంధాలు లేవు. దీర్ఘంగా నిట్టూర్చాడు నజీబ్. ఏది ఏమైనా మరిచిపోయిన అనుబంధాలు, కుటుంబ ఆప్యాయతల రుచిని మళ్ళీ అందరికీ గుర్తు చేయాలని గట్టిగా మనసులో అనుకున్నాడు. భార్య ఫాతిమాతో విషయం చెప్పి అందుకు కావాల్సిన ఏర్పాట్లలో మునిగిపోయాడు.

ఆదివారం రానే వచ్చింది. నజీబ్ తన భార్య, ముగ్గురు పిల్లలతో ఫ్యామిలీ కన్వెన్షన్ కోసం రెడీ అయి, ఆనందంగా బయలు దేరాడు. నగర శివార్లలో ఉన్న తన ఫ్రెండ్ గార్డెన్‌లో ఫ్యామిలీ కన్వెన్షన్ ప్లాన్ చేశాడు.

తన ఆహ్వానాన్ని మన్నించి బంధువులు ఒక్కొక్కరు గార్డెన్ చేరుకుంటున్నారు. నజీబ్ వాళ్ళ అన్నయ్యలు, అక్క, ఫాతిమా వాళ్ళ అక్కలు... దాదాపుగా పిలిచినవాళ్ళంతా తప్పదన్నట్టుగా వచ్చారు.

అందరూ కలిసి దాదాపు కొన్ని ఏళ్ళు గడిచిపోయాయి. పిల్లలు కూడా పెద్దవాళ్ళు అయిపోయారు. అరే, నేను మీ మావయ్యను, నేను అత్తయ్యను అని పరిచయం చేసుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. వచ్చాయి అనే కంటే వీళ్ళే కల్పించారు అంటే సరిగ్గా సరిపోతుందేమో? నజీబ్, ఫాతిమా అందర్ని ఎంతో ప్రేమగా రిసీవ్ చేసుకున్నారు. అందర్నీ ఎంతో ఆప్యాయంగా పలకరించారు. పుస్తకాలతో ఒంటరి వాళ్ళు అయిన పిల్లలకు ఆడుకోవడానికి పిల్లలు అందరూ ఉండే సరికి ఆనందానికి అంతులేకుండా పోయింది. లేడీస్ అందరూ కూడా చాలా కాలం తర్వాత కలిసిన సంతోషాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. నజీబ్ తన పిల్లల్ని ఎంతో మంచిగా తీర్చిదిద్దాడు. పెద్దలను గౌరవించడం, తోటి పిల్లలతో ప్రేమగా ఉండటం, వారి ప్రతి కదలికలో, ఇస్లామీయ శిక్షణ కనిపించింది అందరికీ... పిల్లలందరితో చిన్న క్విజ్ పోటీ ఏర్పాటు చేసి అందులో గెలిచినవారికి కానుకలు ఇచ్చాడు. అలాగే ఫాతిమా కూడా పిల్లలందరికీ ఆటలు, గేయాల పోటీలు పెట్టి బహుమతులు ఇచ్చింది. ఆదివారం సెల్‌ఫోన్‌తో గడిచిపోయే పిల్లలకు ఫ్యామిలీ కన్వెన్షన్‌లో సరదాలు, ఆటలు, పోటీలు తెగ నచ్చేశాయి. నజీబ్ వాళ్ళ పెద్దన్నయ్య నవాజ్ ఏదో ముభావంగా ఉండటం గమనించాడు. తోటను చూద్దువు రా అన్నయ్య అని పిలిచాడు. గార్డెన్ అంతా తిరుగుతూ ఏంటి భాయ్ అలా ఉన్నావు? అంతా బాగుంది కదా! అని మెల్లిగా అడిగాడు. ఆ... అంతా బాగుందిరా.. అని జవాబిచ్చాడు ఏదో మాట వరసకు. పర్వాలేదు చెప్పు భాయ్.. నేనేమైనా పరాయివాడినా? నీ సొంత తమ్ముడినే కదా నాతో చెప్పకూడదా? మళ్ళీ అడిగాడు. అదేం లేదు, నేను ఒక కొత్త బిజినెస్ స్టార్ట్ చేశాను. నా డబ్బంతా అందులో పెట్టేశాను. కానీ అది అనుకున్న విధంగా నడవడం లేదు. లాభాల సంగతి పక్కన పెడితే నష్టాలే కొంపముంచేలా ఉన్నాయి. ఎవరి సలహా, సంప్రదింపులు లేకుండా దిగాను ఈ వ్యాపారంలో. ఇప్పుడు ఎవరినీ ఏది అడగలేను, చెప్పలేను.. నామోషీగా అనుకుంటారని తలదించుకున్నాడు నవాజ్ తమ్ముడి కళ్ళల్లోకి చూడలేక.

ఓహ్.. అంతేనా! ఈ మాత్రం దానికి అంత టెన్షన్ ఎందు కన్నయ్య. మేమంతా లేమా? నీ బిజినెస్‌ను ఎలా నడపాలో, లాభాలు ఎలా సంపాదించాలో నేను, నా కొంత మంది బిజినెస్ ఫ్రెండ్స్ ఉన్నారు. వారితో నిన్ను మీట్ చేయిస్తాను వారి సలహాలు, సూచనలు నీకు పనికి వస్తాయి. మా ఫ్రెండ్ ఒకరు వడ్డీలేని ఇస్లామిక్ బ్యాంక్ నడుపుతున్నాడు. తనకు నీ సంగతి చెప్పి నీ బిజినెస్‌కు కావాల్సిన డబ్బులు నేను సర్దుబాటు అయ్యేలా చూస్తాను. నీ బిజినెస్ అల్లాహ్ దయ వల్ల సర్దుకుంటే ఆ డబ్బును తిరిగి ఇస్లామిక్ బ్యాంక్‌లో కట్టేద్దువు సరేనా..? అని భరోసా ఇచ్చాడు. గుండెల మీద భారం దిగిపోయినట్టు ఎంతో ప్రశాంతంగా అనిపించింది నవాజ్‌కు. అంతే, ఒక్కసారిగా తమ్ముడిని గుండెలకు హత్తుకున్నాడు. నేను చెప్పకుండానే నా కళ్ళల్లో బాధను పసిగట్టావు. నేను అడగకుండానే నా సమస్యకు సహాయం చేస్తానన్నావు. ఇదేనేమో రక్తసంబంధం అంటే... ఇదేనేమో కుటుంబం ఇచ్చే భరోసా, ధైర్యం అంటే అని కళ్ళు తుడుచుకున్నాడు నవాజ్. భలేవాడివి భాయ్... అన్నదమ్ములు అంటే కష్టసుఖాలు పంచుకునేవాళ్ళు. బాధలో తోడుంటే వారు, అవసరంలో ఆదుకునేవారు, ఇవన్నీ చేయలేకపోయినప్పుడు.. బంధువులు, బంధుత్వాలు, తోడబుట్టినవాళ్ళు ఎందుకు చెప్పు? అని ఓదార్చాడు నజీబ్.

మధ్యాహ్నం లంచ్ టైమ్ అయింది. లేడీస్ అందరూ ఆ పనిలో మునిగిపోయారు. ఫాతిమా ఆడబిడ్డ షాహీన్ ఏదో పరధ్యానంగా ఉండటం గమనించింది. భాభీ.. రండి ఇలా కూర్చోండి. ఏంటి సంగతులు? అని ఆరా మొదలుపెట్టింది. ఏముందమ్మా... ఎవరి బాధలు వారివి? ఎవరి ఇబ్బందులు వారివి? ఎవరికైనా చెప్పినా ఆరుస్తారా? తీరుస్తారా?? నిష్టూరంగా పెదవి విరిచింది షాహీన్. అసలు విషయం చెప్పు భాభీ... అవసరం అనుకుంటే ఆరుస్తాము.. కుదిరితే తీరుస్తాము.. అన్నది ఫాతిమా. ఏం లేదు ఫాతిమా.. మా పెద్దమ్మాయి నౌషీన్‌కు ఎన్ని సంబంధాలు చూసినా కుదరడం లేదు. మీ అన్నయ్య గారేమో తనను పదవ తరగతి చదివింది మదర్సాలో చేర్పించారా.. అక్కడే ఆలిమా అయి పోయింది. అందం, మదర్సా చదువు ఉంది కానీ ఈ కాలంలో అబ్బాయిలు బాగా చదువుకున్న అమ్మాయిలు, ఉద్యోగం చేసే ఆడపిల్లలే కావాలి అంటున్నారు. అమ్మాయిని పెద్ద చదువులు చదివించకుండా తప్పు చేశామా? అని నేను, మీ

**(మిగతా 35వ పేజీలో)**

ఇబ్రాహీం షరీఫ్, మండపేట



# మెరుగైన సమాజం కోసం...

**మన** దేశంలో ఉండే కుటుంబ విలువలు సంబంధాలు పాశ్చాత్య దేశాలలో ఎక్కడా కనబడవు. ఎన్నో మతాలు, సంస్కృతులు, జాతులు, తెగలతో కలగలసి కుటుంబంగా విలసిల్లుతున్న మన భారతావనికి పునాది పటిష్టమైన కుటుంబ వ్యవస్థ. కాని మారుతున్న నేటి పరిస్థితుల దృష్ట్యా మన కుటుంబ వ్యవస్థ అలాగే మన సమాజం కూడా బీటలు వారుతున్నాయా? ఎందుకంటే మన సమాజ స్థితిగతులు వేగంగా మారిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితులలో కుటుంబాలు విచ్ఛిన్నం కాకుండా వాటి ప్రభావం సమాజంపై పడకుండా ఒక పటిష్టమైన కుటుంబ నిర్మాణం కోసం తద్వారా పటిష్టమైన సమాజం కోసం ప్రయత్నం చేయవలసిన బాధ్యత దేశ పౌరులందరిపై ఉంది. దీని కోసం ముందుగా మన ఆధ్యాత్మిక గ్రంథాలను అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. ఎందుకంటే మన ఆధ్యాత్మిక గ్రంథాలు కుటుంబ వ్యవస్థకు పెద్దపీట వేశాయి. ఒకసారి చివరి దైవ గ్రంథం ఖుర్ఆన్‌ని పరిశీలించినట్టయితే అందులో అది సర్వ మానవళిని ఉద్దేశించి ఇలా సెలవిస్తుంది: “ఓ మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. బంధుత్వపు సంబంధాలు త్రెంచడం మానుకోండి”. ఈ వాక్యం ద్వారా మనం అర్థం చేసుకోవలసిన విషయం ఏమిటంటే కుటుంబ వ్యవస్థలో మౌలికమైన బంధుత్వాల సంబంధాలకు ఇస్లాం విలువనిస్తుంది. తద్వారా ఒక పటిష్టమైన సమాజ నిర్మాణం వైపు ఆ కుటుంబాన్ని నడిపిస్తుంది. ముందుగా మనం గ్రహించవలసినది కుటుంబ వ్యవస్థకు పునాది ఎక్కడ నుండి ప్రారంభం అవుతుంది అనేది. అసలు కుటుంబ వ్యవస్థకు పునాది వివాహం ద్వారా పడుతుంది. రెండు వేర్వేరు కుటుంబ నేపథ్యమున్నవారు వివాహం అనే బంధంతో ఒక్కటవుతారు. ఈ వివాహన్ని ఇస్లాం ఎంతో సులభతరం చేసివేసింది.

ఈ వివాహ తంతులో హంగూ ఆర్భాటాలు ఏమీ లేకుండా కేవలం స్త్రీ ధనం (మహర్) ద్వారా వివాహం చేసుకొనే ఏర్పాటు చేస్తూ వరకట్నాన్ని పూర్తిగా నిషేధించింది. ఈ రోజు వరకట్నం కోసం ఎన్ని వివాహాలు ఛిద్రం అవుతున్నాయో మరెన్ని కుటుంబాలు రోడ్డున పడుతున్నాయో మనం చూస్తూనే ఉన్నాం.

కేవలం కుటుంబ వ్యవస్థలోని లోపాల వల్లనే ఇలాంటి పరిస్థితులు సంభవిస్తున్నాయి అని అనడంలో కూడా అతిశయోక్తి లేదు. ఒక పటిష్టమైన సమాజ నిర్మాణం జరగాలంటే ఒక పటిష్టమైన కుటుంబ వ్యవస్థ ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. కుటుంబం భార్య, భర్త, పిల్లలతో కలగలసి ఉంటుంది. ఇందులో భార్య హక్కులను భర్త నిర్వర్తించాలి. భర్త హక్కుల భార్య నిర్వర్తించాలి. పిల్లల హక్కులను తల్లిదండ్రులు నిర్వర్తించాలి. తల్లిదండ్రుల హక్కులను పిల్లలు నిర్వర్తించాలి. అప్పుడే అది ఒక పటిష్ఠమైన కుటుంబంగా పరిణమిస్తుంది. ఆ కుటుంబంలో బంధాలు, సంబంధాలు, విలువలు అనేవి సమతూకంలో ఉంటాయి. ఇస్లాం ఇలాంటి కుటుంబాలను సంబోధిస్తూ భర్తకు భార్యపై ఉన్నటువంటి హక్కులే భార్యకు కూడా భర్తపై ఉన్నాయని, మీరు ఒకరికొకరు దుస్తుల వంటి వారని అంటే ఒకరి గౌరవ మర్యాదలు ఒకరు కాపాడుకోవాలని ఉద్బోధించింది. అలాగే పిల్లలను ఉద్దేశిస్తూ తల్లి పాదాల చెంత స్వర్గం ఉందని, ఆ స్వర్గానికి తండ్రి ద్వారం వంటివాడని, తండ్రిని సంబోధిస్తూ తండ్రి తమ పిల్లలకు అందించే ఉత్తమ బహుమానం ఉన్నతమైన చదువు సంస్కారాలే అని బోధిస్తుంది. అంటే ఒకరి గౌరవ మర్యాదలను ఒకరు కాపాడుకుంటూ ఒకరి హక్కులు ఒకరు నెరవేరుస్తూ ఉంటే ఆ కుటుంబంలో నైతిక విలువలు, ఉత్తమ నడవడిక ప్రభావం సమాజంపై కూడా పడుతుంది. అప్పుడు ఆ సమాజంలో ఉన్నటువంటి రుగ్మతలు మద్యపానం, వ్యభిచారం, జూదం, అవినీతి, అక్రమ సంబంధాలు దూరమయి ఒక మంచి సమాజం ఒక పటిష్టమైన సమాజం ఉనికిలోకి వస్తుంది.

కుటుంబ వ్యవస్థ దీనికి విరుద్ధంగా గనక ఉన్నట్లయితే ఆ సమాజం అరాచకం రాజ్యమేలుతుంది. సమాజంలోని రుగ్మతలు దూరమవ్వాలన్నా, మంచి పరిపాలన వ్యవస్థ ఉనికిలో రావాలన్నా, విలువలతో కూడిన వ్యక్తులు తయారవ్వాలన్నా అది ఒక పటిష్టమైన కుటుంబంతోనే సాధ్యం.

అందుకే ఇస్లాం అంటుంది తల్లి ఒడి నుండి సమాధి ఒడిలోకి చేరేవరకు విద్యను అభ్యసిస్తూనే ఉండాలి. ఒక మంచి సమాజం ఉనికిలో రావాలంటే కుటుంబంలోని తల్లిదండ్రుల పాత్ర ఎనలేనిది, విలువ కట్టలేనిదీను. ఈ విలువలు సంబంధాలు నేటి మన సమాజానికి మరీ ముఖ్యంగా నేటి యువతీ యువకులకు చాలా అవసరం. కనుక జమాఅతె ఇస్లామీ హింద్ దేశవ్యాప్తంగా చేపట్టిన బలమైన కుటుంబం-బలమైన సమాజం జాగృతి ఉద్యమంలో భాగస్వాములు అవుదాం, ఒక మంచి సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం. ✤

---

## ఫ్యామిలీ కన్వెన్షన్ (33వ పేజీ తరువాయి)


అన్నయ్యగారు బాధ పడని రోజు లేదంటే నమ్ము... సంబంధాలు రావేమో అని బెంగ పట్టుకుంది ఫాతిమా... చెప్పి కళ్ళు తుడుచుకుంది షాహీన్.

భాభీ ఈ మాత్రం దానికే ఇంత బాధ పడాలా? మా పక్కింటి ఖాలా వాళ్ళ అబ్బాయికి మదర్సాలో చదివిన అమ్మాయే కావాలని వెదుకుతున్నారు. అబ్బాయి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఇక్కడే గూగుల్‌లో నెలకు లక్ష రూపాయల జీతం. అందగాడు, బుద్ధిమంతుడు, ధార్మికుడు, మంచి కుటుంబం వాళ్ళది. నేను ఇంటికి వెళ్ళాక వాళ్ళతో మాట్లాడతాను. మన నౌషీన్ లాంటి అమ్మాయిని చూస్తే వాళ్ళు సంబంధం కలుపుకోకుండా ఉండరు. అల్లాహ్ తలిస్తే పెళ్ళి కూడా త్వరగానే జరిగిపోతుంది.. చెప్పింది ఫాతిమా.

ఫాతిమా చెప్పిన సంబంధం మాట వినగానే పోయిన ప్రాణం లేచివచ్చింది షాహీన్‌కు. బాధంతా దూదిపింజలాగా ఎగిరిపోయింది. ఆనందంతో మరదలు ఫాతిమాను చుట్టేసింది షాహీన్.

ఫాతిమా ఇంట్లో చేసిన వంటలతో అందరికీ వడ్డించింది. షీర్‌ఖుర్మా, బిర్యానీ.. ఇంకా ఎన్నోరకాల వంటకాలు ఎంతో శ్రమతో, మరెంతో ప్రేమతో ఇంట్లోనే చేసింది ఫాతిమా. వీకెండ్స్‌కి, ఆదివారాలకు ఇండ్లలో చేసుకునే ఓపిక, తీరికా లేక రెస్టారెంట్లకు పరుగుపెట్టే ప్రాణాలకు ఇంటి భోజనం తెగ నచ్చేసింది. అందరూ ఎంతో మెచ్చుకున్నారు ఫాతిమా వంటల్ని. భోజనాలయ్యాక పచ్చని వాతావరణంలో, చెట్ల నీడల్లో జొహర్ నమాజ్ చదువుకున్నారు. ఆ తర్వాత నవాజ్ అందర్నీ కూర్చోబెట్టి కొంచెం సేపు కుటుంబం, బంధాలు, విలువలు, ఆప్యాయతలు అల్లాహ్ దృష్టిలో బంధుత్వ సంబంధాల విలువ ఇలాంటి విషయాల మీద కొంచెంసేపు లెక్చర్ ఇచ్చాడు. అది విన్న అందరి కళ్ళు, మనసు రెండూ చెమ్మగిల్లాయి. పోగొట్టుకున్నది ఏదో దొరికినంత ఆనందం కలిగింది అందరిలో... ✤

**తస్నీమ్‌జహాన్ ఖాన్**



# బంధుత్వ సంబంధాలు

**సుఖ దుఃఖాలలో,** కలిమిలేమిలో, గెలుపోటములలో, ప్రపంచమంతటిలో మనకు తోడు నీడగా నిలిచేది మన కుటుంబం మాత్రమే. బంధాలు, అనుబంధాల కలయికయే కుటుంబం. ఒట్టి చేతులతో పుట్టిన మనల్ని కారుణ్యంతో తమ చేతులలో ఎత్తుకుని అక్కున చేర్చుకునేది మన కుటుంబం. ప్రేమ, ఆప్యాయత, సేవ, అంకితభావంతో మనల్ని పెంచి పెద్ద చేసేది మన కుటుంబమే!

వ్యక్తి- కుటుంబం- సమాజం ఇవి మూడు కూడా ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయి. కుటుంబానికి భార్య భర్తలిద్దరూ పటిష్టమైన పునాదులు. ఈ పునాదులు ఎంత పటిష్టంగా ఉంటే కుటుంబమూ అంతే పటిష్టంగా ఉంటుంది. భార్యాభర్తలతో ఏర్పడిన కుటుంబం వారి సంతానం ద్వారా పెరుగుతూ పోతుంది. కుటుంబానికి నాయకుడు భర్త. దాని నిర్వహణా బాధ్యత కూడా భర్తదే. ఆలుబిడ్డల పోషణార్థం అతను సంపాదించవలసి ఉంటుంది. దీన్ని గురించే అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "పిల్లల తండ్రి వారి తల్లులను తగురీతిలో భోజన వస్త్రాలను సమకూర్చి పోషించవలసి ఉంటుంది."

(దివ్య ఖుర్ఆన్ 2: 233)

మరోచోట ఇలా సెలవిచ్చాడు : "సంపన్నుడైన వ్యక్తి తన ఆర్థిక స్థోమతను బట్టి ఖర్చుపెట్టాలి. తక్కువ ఉపాధి ఇవ్వ బడిన వ్యక్తి, అల్లాహ్ తనకు ఇచ్చిన ధనం నుంచే ఖర్చు పెట్టాలి. అల్లాహ్ తాను ప్రసాదించిన దానికి మించి ఎవరి పైనా భారం మోపడు." (అత్ తలాక్ : 7)

కుటుంబ నాయకుడైన భర్త తన సంపాదనను తన

కుటుంబంపై ఖర్చుపెట్టడానికి నిరాకరించినా, సంపాదించ కుండా ముఖం చాటేసినా, సంపాదించిన సంపాదనను చెడు వ్యసనాలకై, చెడు తిరుగుళ్ళకై ఉపయోగించినా ఆ కుటుంబం ఆర్థికంగా వెనుకబడిపోతుంది. కుటుంబ సభ్యుల జీవితాలు అస్తవ్యస్తమై పోతాయి. ఆ కుటుంబం సామాజికంగా గౌరవ మర్యాదలను కోల్పోతుంది.

ఆలుబిడ్డలను పట్టించుకోకుండా వారి అవసరాలను తీర్చకుండా కుటుంబ సభ్యులు ఇతరుల ముందు చేయిచాచి సహాయం కోరే దుర్దశకు వారిని చేర్చకూడదు. ముందు వారి అవసరాలను తీర్చడానికి ప్రయత్నించాలి. కుటుంబంకై ఖర్చు చేయడాన్ని చిన్నచూపుతో చూడకూడదు. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు : "మనిషి ఒకరి తిండి తిప్పలకు బాధ్యుడై తన (బాధ్యతను) నిర్లక్ష్యం చేయటం చాలు అతను పాపిష్టి మనిషి అని చెప్పటానికి".

కుటుంబంలో సంతానం కూడా బాధ్యతాయుతంగా మెల గాల్సి ఉంటుంది. తల్లిదండ్రులు రెక్కలు ముక్కలు చేసుకుని పిల్లల్ని పెంచి పెద్ద చేస్తే వారి పట్ల సద్భావం, సద్వ్యవహారం కలిగి ఉండటం వల్ల సమాజం శుభప్రదంగా కళకళలాడుతుంది.

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు : "తన తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మెలగమని మేము మానవునికి ఉపదేశిం చాము" (అల్ అన్కబూత్ : 8). మరో చోట ఇలా ఉంది : "నీ ప్రభువు ఇలా నిర్ణయం చేశాడు. మీరు కేవలం ఆయనను తప్ప మరెవరినీ ఆరాధించకండి. తల్లిదండ్రులతో మంచి తనంతో వ్యవహరించండి. ఒకవేళ మీ వద్ద వారిలో ఒకరుగాని ఇద్దరుగాని ముసలివారై ఉంటే, వారి ముందు విసుగ్గా 'ఉఫ్' అని కూడా అనకండి. వారితో మర్యాదగా మాట్లాడండి. మృదుత్వమూ, దయాభావమూ కలిగి వారి ముందు వినమ్రులై ఉండండి. ఇంకా, "ప్రభూ! బాల్యంలో వారు నన్ను కారుణ్యంతో, వాత్సల్యంతో పోషించినట్లు, నీవు వారిపై కరుణజూపు" అంటూ ప్రార్థిస్తూ ఉండండి."

*(ఖుర్ఆన్ 17: 23, 24)*

కుటుంబమంటే తల్లిదండ్రులు, సంతానమే కాదు తోబుట్టు వులు, బాబాయిలు, మావయ్యలు, పిన్నమ్మలు, పెద్దమ్మలు, నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యలు, మేనత్తలు, వారందరి పిల్లలు, వారందరి బంధువులు. బంధాలన్నింటినీ సమర్థ వంతంగా కలుపుకునిపోతేనే కుటుంబం అందంగా ఒద్దికగా ఉంటుంది. ఈ రక్త సంబంధాలన్నింటినీ ఒడిసి పట్టుకోమని ఖుర్ఆన్ బోధిస్తుంది : "వారి (విశ్వాసుల) వైఖరి ఎలా ఉంటుందంటే, స్థిరపరచండి అని అల్లాహ్ ఆదేశించిన సంబంధాలను స్థిరపరుస్తారు." (అర్రాద్ : 21). అనవసరంగా చిన్న చిన్న కారణాలను అడ్డుపెట్టుకుని రక్త సంబంధాలను తెంచుకోవడాన్ని అల్లాహ్ ఇష్టపడడు. బంధువుల హక్కులనూ సాధ్యమైనంత వరకూ నెరవేరుస్తూనే ఉండాలి. మన సమాజం ధోరణి ఎలా ఉందంటే, తాము నిర్వర్తించాల్సిన బాధ్యతలను విస్మరించి తమ హక్కులను హద్దుకు మించి పొందాలని తాపత్రయ పడుతుంటారు. ఎదుటివారి హక్కులను కొల్ల గొడుతూ కుటుంబంలో చేదును, ద్వేషాలను నింపుతుం టారు. ఇలాంటి ధోరణితో కుటుంబం విచ్ఛిన్నమైపోతుంది. స్వార్థం కోసం బంధాలను తెగత్రెంపులు చేసుకునేవారి దుష్పరిణామాల గురించి ఇలా తెలుపడం జరిగింది: "ఒకవేళ మీరు విముఖులైపోతే భూమిపై మళ్ళీ కల్లోలాన్ని రేకెత్తిస్తారు. పరస్పరం బంధుత్వాల తెగత్రెంపులు చేసుకుంటారు. అల్లాహ్ శపించింది, అంధులుగానూ, బధిరులుగానూ చేసింది ఇలాంటి వారినే." (ముహమ్మద్ : 22, 23)

ముందుగానే చెప్పినట్లు వ్యక్తి- కుటుంబం- సమాజం ఇవి మూడూ సత్సంబంధాలతో, ఉత్తమ నైతిక ప్రమాణాలతో ఉన్నంత కాలం ఆ జాతి బృందావనంలా ఉంటుంది. ✤

## కుటుంబ వ్యవస్థకు పునాది (31 వ పేజీ తరువాయి)

మసలుకోవాలి. షైతాన్ ప్రేరణకు దూరంగా ఉండాలి.

భార్యాభర్తలిద్దరికి ఒకరిపై ఒకరికి కొన్ని హక్కులు, మరికొన్ని బాధ్యతలు ఉన్నాయి. వీటిని సక్రమంగా నిర్వహించినట్లయితే ఆ బంధం బలంగా రూపొందుతుంది. భార్య పట్ల భర్తకు ఉన్న హక్కులు, బాధ్యతలు ఏమిటంటే, భర్త ఆమెను గౌరవించాలి, ప్రేమించాలి. ఆమె తన కుటుంబ సభ్యులందరిని వదిలివేసి కేవలం తన కోసం ఒంటరిగా తన ఇంటికి వచ్చిన విషయాన్ని గ్రహించి ఆమెను సంతోషపెట్టడానికి, సంతృప్తిపరచడానికి కృషి చెయ్యాలి. ఆమెకు కావలసిన సౌకర్యాలను సాధ్యమైనంత వరకు ఇవ్వాలి. తమ కుటుంబసభ్యులతో కలిసిపోయి బాధ్యతలను నెరవేర్చే విషయంలో ఆమెకు తగినంత సమయాన్ని ఇవ్వాలి. ఆమె ఇష్టాయిష్టాలను పట్టించుకోవాలి. సాధ్యమైనంత వరకు ఆమె పట్ల మంచి అభిప్రాయాన్ని కలిగి వుండాలి. ఓర్పుతో వ్యవహరించాలి. విశాల హృదయాన్ని ప్రదర్శించాలి.

✤

**షరీఫా, విజయవాడ**



# గృహస్థ జీవితం

**కుటుంబ** విలువలతో, పరస్పర స్నేహపూర్వక జీవనానికి దర్పణం పట్టిన సమాజానికి పునాది ప్రవక్త(స) చూపిన జీవన విధానం. మనిషి నైతిక ప్రవర్తన, సౌజన్యం గ్రహించటానికి అసలు గీటురాయి 'గృహస్థ జీవితం'. గృహ పరిశుభ్రత, అలంకరణ, ఇత్యాది విషయాల్లో భార్య జాగ్రత్త వహించాలి. దైవభీతి తర్వాత విశ్వాసికి, శీలవతి అయిన అర్థాంగే అన్నింటి కంటే ఎక్కువ ఉపయోగకరమైన, ఉత్తమమైన పెన్నిధి. "వారు మీకు, మీరు వారికి దుస్తులు వంటివారు" (ఖుర్ఆన్: 2: 187). దేహానికి, దుస్తులకు మధ్య ఎలాంటి అవినాభావ సంబంధం ఉందో ఆలుమగల వైవాహిక బంధం కూడా అలాగే ఉండాలి. తమ గౌరవ ప్రతిష్టలకు, నీతి నడవడికలకు భంగం కలిగించే చెడుల నుండి కాపాడుకోవాలి. భార్యా భర్తలు ఒకరినొకరు ఆచ్ఛాదనగా, రక్షణ కవచంలా ఉండాలి. స్త్రీ, పురుషులు తమ సహజ సంబంధం విషయంలో శీలం, సంస్కృతులను కాపాడగలిగే ఓ నైతిక నియమావళికి కట్టుబడి ఉండేలా చేస్తుంది ఇస్లామీయ దాంపత్యచట్టం. ప్రవక్త(స) 'తమ నడవడిలో అందరికంటే ఉత్తములైన వారే విశ్వాసంలో పరిపూర్ణులు. తమ భార్యల ఎడల అత్యధికంగా మంచిగా మెలిగేవారే, మీలో అందరికంటే మంచి నడవడి కలవారు' అని బోధించారు. సంతానం దేవుని బహుమానం. 'బీదరికం, ఆకలిదప్పుల భయంతో మీ సంతానాన్ని హత్య చేయకండి. మేము వారికీ ఉపాధినిస్తాము, మీకూ ఉపాధి నిస్తాము. వాస్తవమేమంటే, సంతానాన్ని హత్య చేయడం అత్యంత ఘోరమైన పాపం" (బనీ ఇస్రాయీల్) అని సృష్టికర్త అల్లాహ్

హెచ్చరిస్తున్నాడు. భార్యాభర్తల అన్యోన్య జీవనంపైనే చాలావరకు పిల్లల మానసిక పరిపక్వత ఆధారపడి ఉంటుంది. తల్లిదండ్రుల జీవనశైలి పిల్లలకు ఒక నిశ్శబ్ద శిక్షణను ఇస్తుంది. ఎంత మంచి వాతావరణంలో పిల్లలు పెరిగితే అంతే ఉత్తమ సమాజం మనకు సాక్షాత్కరిస్తుంది. ఏ విషయంలోను 'అతి'ని ఇష్టపడక మధ్యేమార్గాన్ని సమ్మతిస్తుంది ఇస్లాం. నమాజ్, ఉపవాసాలు ఎలాగైతే ఆరాధన (ఇబాదత్)గా పరిగణించబడతాయో, అదేవిధంగా నిఖా అనగా వివాహాన్ని కూడా ఆరాధనగానే పరిగణిస్తుంది ఇస్లాం. సంతానానికి తల్లి తన పాలు కూడా త్రాగించాలి. అది తల్లిపై బిడ్డకు ఉన్న హక్కు. పిల్లల్ని భయపెట్టడం, మాట మాటకూ గద్దించటం, తిట్టటం పూర్తిగా మానాలి. యుక్తితో, నేర్పుతో ప్రేమానురాగాలతో పిల్లల్ని సుశిక్షితులుగా చేయటానికి ప్రయత్నించాలి. సంతానానికి మంచి విద్య, శిక్షణలతో తీర్చిదిద్దాలి. దివ్య ఖుర్ఆన్ "విశ్వాసులారా! మిమ్మల్ని, మీ ఇంటివారినీ మీరు నరకాగ్ని నుండి రక్షించు కోండి" అని హెచ్చరిస్తుంది. అంటే నరకాగ్ని నుండి రక్షణ పొందే ఏకైక మార్గం మనిషికి 'ధార్మిక జ్ఞానం' తెలియటం. పిల్లల్లో ఆత్మవిశ్వాసం, ధైర్యం పెంపొందేలా ప్రయత్నించాలి. అప్పుడప్పుడు తినే పదార్థాలన్నీ అక్కాచెల్లెళ్ళు, అన్నదమ్ముల మధ్య పంచుకునేవారిగా శిక్షణనివ్వాలి. అంతేకాదు పేదలకు దానం చేసేలా, పిల్లలు తమ పనులు తామే స్వయంగా చేసుకునేలా అలవాటు చేయాలి. పెద్దల జీవితాలే పిల్లలకు 'నిశ్శబ్ద పాఠాలు' నేర్పుతాయి కాబట్టి హాస్యానికైనా అబద్ధం పలకరాదు. సంతానం పట్ల సమాన దృష్టి కలిగి, ఆడ మగ సంతానం పట్ల సమాన ప్రేమను చూపించాలి. ఆడపిల్లల శిక్షణ పోషణ ఆనందంతో, సహృదయంతో, ధార్మిక చింతనతో చేయాలి. సుందర సమాజానికి 'వారధి' ఉత్తమ సంతానమే. సంతానం తల్లిదండ్రులకు కృతజ్ఞులుగా ఉండాలి. సజ్జనుల ప్రధాన లక్షణం ప్రత్యుపకారం చెయ్యటం. తల్లిదండ్రులు అనన్యమైన త్యాగం, అనుపమానమైన ఔదార్యం, అసాధారణమైన కృషితో సంతానాన్ని పోషిస్తారు. తమ ప్రాణాలకు సమానంగా తమ సంతానాన్ని సంరక్షిస్తారు, దేవుని ప్రేమానురాగాలు తండ్రి ప్రేమానురాగాల్లో, దేవుని అయిష్టత తండ్రి అయిష్టతలో ఉంది. మంచి నడవడి గల సంతతి తమ తల్లిదండ్రులను ప్రేమాభిమానాలతో ఒక్కసారి చూస్తే దానికి బదులుగా దైవం ఒక హజ్‌కు సమానమైన పుణ్యఫలం ప్రసాదిస్తాడు. ఖర్చు చేసే సంపదకు ప్రధాన హక్కుదారులు తల్లిదండ్రులే. తల్లి సేవలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఆమె చూపిన త్యాగాలు తండ్రి కంటే ఎక్కువ. సంతానం తమ తల్లిదండ్రుల బంధువుల పట్ల, స్నేహితుల పట్ల మంచి నడవడిక కలిగి ఉండాలి. ఇలా ప్రతి సంబంధము పటిష్టంగా ఉన్నప్పుడే బలమైన, సుందర సమాజం ఏర్పడుతుంది. అందుకనే సామాజిక శాస్త్రవేత్త డేవిడ్ ఆర్ మేస్ "పటిష్ట కుటుంబాల సంఖ్యను అధిక మొత్తంలో పెంచకుండా మానవ జీవితాన్ని ఆనందమయం చేసుకోలేము" అని అంటారు. "మనిషి తన స్నేహితుని జీవిత విధానాన్ని అనుసరిస్తాడు. అందుచేత తాను స్నేహం చేస్తున్న వారిని గురించి ఆలోచించుకుని మరీ స్నేహం చేయాలి" అని ప్రవక్త(స) బోధించారు. అందుకనే నేటి సమాజంలో 'ఒకరి నడవడిక తెలుసుకోవాలి అంటే అతని స్నేహితులెవరో తెలుసుకుంటే సరిపోతుంది' అనే లోకోక్తి ప్రసిద్ధిగాంచింది. అతిథుల పట్ల కూడా సత్ప్రవర్తన కలిగి ఉండాలి. అతిథి కష్టానికి కాదు, కారుణ్యానికి, శుభాలకు చిహ్నం. అతిథిగా వెళ్ళినప్పుడు మన తాహతు ప్రకారం ఏదైనా కానుక తీసుకు వెళ్ళాలి. ఈ విధంగా పటిష్ట కుటుంబానికి ప్రతి అనుబంధం ఉన్నతంగా, బలిష్టంగా ఉండాలి. అందుకనే ప్రతి ధర్మం మానవ సంబంధాలను, అనుబంధాలను పెంచే బోధనలను సమాజానికి అందించింది. తద్వారా సత్సమాజ ఆవిర్భావం, సుందర సమాజం ఏర్పడుతుంది. ✤

**కుటుంబమంటే**

అమ్మ ప్రేమ
నాన్న అనురాగం
అన్న ఆప్యాయత
తమ్ముడి వాత్సల్యం
చెల్లి మమత
అక్క అభిమానం

మంగళగిరి జీలాని



# సుందర సమాజం

**కుటుంబం** సమాజ నిర్మాణానికి పునాది లాంటిది. సమాజ మనుగడ, సంస్కృతి, ప్రాణ సంరక్షణకు ఇది మూలకేంద్రం. కుటుంబం లేనిదే సమాజం లేదు. మానవ సామాజిక పరిణామ క్రమంలో అనాగరిక దశ (ప్రాచీన కాలం) నుంచి నాగరిక దశ (ఆధునిక కాలం)కు చేరుకోవడంలో వివాహ పద్ధతుల్లో ఏర్పడిన మార్పులకు అనుగుణంగా కుటుంబాలు అనేక రూపాలుగా ఆవిర్భవించాయి. ఆయా ప్రాంతాల భౌగోళిక, సామాజిక, సాంస్కృతిక, మతపరమైన పరిస్థితులు, జీవన విధానం తదితర అంశాలు వైవిధ్యభరిత కుటుంబాలు ఏర్పడటానికి కారణమయ్యాయి. అనేక వైవిధ్యాలున్నా... ఇది అన్ని సమాజాల్లోనూ ప్రధానమైందిగా ఉంది.

తల్లిదండ్రులు... వారి సంతానానికి తమ సంప్రదాయాలను సంక్రమింపజేయకపోతే తరతరాల సంస్కృతి శాశ్వతంగా మనలేదు. కుటుంబం లేనిదే శిశు పోషణ లేదు. కుటుంబం సంస్కృతిని, సమాజాన్ని కొనసాగింపజేయడంతోపాటు సమాజ నిర్మాణానికి వెన్నెముకగా ఉండే బంధుత్వాన్ని కూడా రూపొందిస్తుంది. కాబట్టి దీన్ని సమాజంలో ఒక ప్రామాణిక సాంఘిక సమూహంగా పేర్కొంటారు.

మన ఉనికికి కారణమైన తల్లిదండ్రుల పట్ల ఉత్తమమైన రీతిలో మంచిగా ప్రవర్తించాలి. వారు లేనిదే మనం లేము. వారు ఎలాంటి వారైనా సరే మన ప్రవర్తన వారి పట్ల మంచిగా ఉండాలి. వారితో మనం ప్రవర్తించిన తీరు మనకు స్వర్గం లేదా నరకం లభించేటట్లు చేస్తోంది.

తల్లిదండ్రులను సంతోషపరచడానికి ఎల్లప్పుడూ ప్రయత్నించాలి. వారి ఇష్టానికి వ్యతిరేకంగా, వారికి బాధ కలిగేలా మాట్లాడకూడదు. ముఖ్యంగా వృద్ధాప్యంలో వారు ప్రతి దానికి విసుక్కుంటూ ఉంటారు. వారి మనసు నొప్పించే విధంగా మాట్లాడరాదు.

మునుపటి మన ఉమ్మడి కుటుంబాలు నేడు చిన్న కుటుంబాలుగా రూపాంతరం చెందుతున్నాయి. పిల్లల్ని చిన్న వయసులోనే హాస్టళ్ళలో చేర్చడం పరిపాటిగా మారింది. పిల్లలకు కుటుంబంతో ఉండవలసిన భావాత్మకమైన అనుబంధం, సురక్షిత భావన లోపించిన కారణంగా పిల్లల్లో ఒంటరితనం పెరుగుతోంది. ఫలితంగా యువతలో మాదక ద్రవ్యాల వినియోగం, హింసాత్మక, నేరప్రవృత్తి పెరగడం, ఒక్కొక్కసారి అది ఆత్మహత్యలకు కూడా దారితీయడం జరుగుతోంది. వృద్ధులకు కుటుంబాలలో రక్షణ, పోషణ కరువై అది వృద్ధాశ్రమాల పెరుగుదలకు కారణమవుతుండడం అత్యంత ఆందోళనకరం.

చిన్న కుటుంబాలుగా జీవిస్తున్నవారు తప్పనిసరిగా మిగతా కుటుంబ సభ్యులతో సజీవ సంబంధాలను కొనసాగిస్తూ నిర్ణీత సమయాలలో కలుస్తూ ఉండటానికి ప్రయత్నించాలి. అలా కలుసుకున్న సందర్భాలు, ప్రదేశాలు మన మూలాలను జ్ఞప్తికి తెచ్చేవిగా ఉండాలి. కుటుంబమంతా కలిసేలా ఏవైనా సేవా కార్యక్రమాలు రూపొందించుకోవాలి. పిల్లల ప్రాథమిక విద్య స్థానికంగానే జరగాలి. ఆ విద్య కౌటుంబిక, సామాజిక అనుబంధాలను పెంపొందింపజేసేదిగా ఉండాలి. మన ప్రాంతాలలో జరిగే ఉత్సవాలు, పండుగలలో పాల్గొనడం ద్వారా అందరం ఒకే కుటుంబ సభ్యులం అన్న భావన నిర్మాణం చేసుకోవచ్చు.

నేడు కుటుంబ వ్యవస్థ దెబ్బ తింటోంది. కుటుంబం పటిష్టంగా ఉంటేనే సమాజం కూడా పటిష్టంగా ఉంటుంది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. కుటుంబం ప్రాముఖ్యతను తెలుసుకుని, పిల్లలకు పెద్దల పట్ల బాధ్యతలను తెలియజేస్తూ, పెద్దలు పిల్లలను దగ్గరకు తీసుకుని మంచి కథలు, పాటలు, పద్యాలు చెప్తూ వారిపై ప్రేమను చూపాలి. నేటికాలంలో పిల్లలకు నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యల ప్రేమ లభించటం లేదు. కారణం నగరాల్లోని ఉరుకుల పరుగుల జీవితాలు, ఒత్తిడితో కూడుకున్న చదువులు, మరి వీటికి దూరమైన పిల్లలకు కుటుంబ వ్యవస్థ ఎలా తెలుస్తుంది.

ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో సజీవమైన విలువలతో కూడిన మన కుటుంబ వ్యవస్థను రక్షించుకోవటానికి సమగ్రమైన, తీవ్రమైన ప్రయత్నాలు జరగాలి. అందరం కలిసిమెలిసి ఉండాలని, కుటుంబాన్ని, బంధాలని పటిష్టపరచుకోవాలనే ఉద్దేశంతో జమాఅతె ఇస్లామీ హింద్ 'పటిష్ట కుటుంబం, పటిష్ట సమాజం' అనే పేరుతో క్యాంపెయిన్ నిర్వహించడం ముదావహం. ప్రస్తుత పరిస్థితులలో ఇది ఎంతైనా అవసరం. వెయ్యిమైళ్ళ దూరమైనా అక్క అడుగుతో ప్రారంభం. ఇది మన కుటుంబ వ్యవస్థను రక్షించుకునేందుకు అభినందనీయమైన తొలి అడుగు అనవచ్చు.

మన దైనందిన జీవితంలో మన విలువలతో కూడిన ప్రవర్తన, స్వభావం ద్వారా వ్యక్తిత్వ నిర్మాణం జరుగుతుంది. తద్వారా కుటుంబ బాంధవ్యాలు బలోపేతమవుతాయి. కుటుంబం అంతా కలిసి భుజించడం, పండుగలు, యాత్రలు చెయ్యటం, మాతృభాషను వినియోగించటం, స్వదేశీ వస్తు వినిమయం, సంప్రదాయాలను ఆచరించడం ద్వారా కుటుంబ జీవనాన్ని ఆనందదాయకం చేసుకోవాలి. కుటుంబం, సమాజం పరస్పర పూరకాలు. కుటుంబ సభ్యులకు సామాజిక బాధ్యతను అలవరచటం కోసం దానధర్మాలను అలవాటు చేసుకోవాలి. సామాజిక, ధార్మిక, విద్యా సంబంధమైన అవసరాల కోసం అవసరమైన వారికి శక్తిమేరకు సాయం చేసే ప్రవృత్తిని అలవరచుకోవాలి. ✤

## కుటుంబ వ్యవస్థ.. సవాళ్లు (25వ పేజీ తరువాయి)

నైతే అసలుకే ఎసరు వస్తుంది. చాలా మంది మహిళలకు ఈ సమస్యల పరిష్కార మార్గాలు తెలియవు. కొంతమంది మహిళలు ధార్మిక అవగాహనా లేమితో తమ సమస్యల పరిష్కారానికై కోర్టులు, పోలీసుల చుట్టూ చక్కర్లు కొడుతూ ఉంటారు లేదా ఏ ఎన్‌జీవోనో సంప్రదించి, ఎటువంటి మార్గదర్శకత్వం లేకుండా కేసులు నమోదు చేయబడతాయి. అడ్వకేట్లు భారీ ఫీజులు తీసుకొని కేసును వాయిదా వేస్తుంటారు. కేసును బలోపేతం చేయడానికి ఇరువర్గాలు అబద్ధాలను ఆశ్రయిస్తాయి. కేసు వివరాలు ప్రజలలో ప్రచారం అయినప్పుడు ఇస్లామ్ విరోధులకు కుటుంబ చట్టానికి వ్యతిరేకంగా కుటిల ప్రయత్నాలు చేసే అవకాశం లభిస్తుంది.

### పరిష్కార మార్గాలు:

1. ధార్మిక అవగాహన దిశగా అడుగులు వేయాలి. ఖుర్‌ఆన్, హదీసు బోధనలు ప్రధానంగా ఇస్లామీయ కుటుంబ బోధనలను లోతుగా అధ్యయనం, అవగాహన చేసుకోవాలి. షరీఅత్ బోధనలను ఆచరించేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేయాలి.
2. ప్రతి ఒక్కరూ స్వతహాగా, సామాజిక స్థాయిలో ముస్లిం సమాజ సంస్కరణ కొరకు కృషి చేయాలి.
3. పిల్లలకు ధార్మిక శిక్షణ నిచ్చి, ముఖ్యంగా వారు యుక్త వయసుకు చేరినప్పుడు ఇస్లామీయ కుటుంబ బోధనలను అవగతపరచాలి.
4. వివాహాన్ని సులభతరం చేయాలి. వరకట్నాన్ని నిషేధిస్తూ అనవసరమైన ఆచారాలను అంతం చేయాలి.
5. కుటుంబ సమస్యలను పరిష్కరించేందుకు ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్స్ ఏర్పాటు చేయాలి .
6. భార్యాభర్తల్లో సమస్యలు వచ్చినప్పుడు వాటిని కోర్టుల్లో కాకుండా దారుల్ ఖజా, షరియా పంచాయతీల ద్వారా పరిష్కరించుకునేందుకు కృషి చేయాలి. అక్కడ ఇవ్వబడిన తీర్పులను ఇష్టపూర్వకంగా అంగీకరించాలి.
7. దేశ వాసులకు ఇస్లామీయ కుటుంబ చట్టాల ప్రాధాన్యతలు, వాటిలో ఉన్న వివేకతను వారి అపార్థాలు తొలగిపోయే విధంగా వివరించాలి. ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ముస్లిం పర్సనల్ లాకు వ్యతిరేకంగా జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు సహేతుకమైన సమాధానం ఇవ్వాలి. ✤

# కుటుంబ వైభవం

ఆయెషా సుల్తాన, ఖమ్మం




**సామాజిక** జీవనానికి పునాది కుటుంబం. ఈ వ్యవస్థకు పునాది వివాహం. ఇది ఒక ముఖ్యమైన సామాజిక సంస్థ. మానవ సమూహాలన్నింటిలో అత్యంత ముఖ్యమైన ప్రాథమిక సమూహం కుటుంబం. సమాజంలోని ఏకత్వ భావనకు, సమైక్యతకు కుటుంబం ఒక చిహ్నం. భవనానికి పునాది ఎంత ముఖ్యమో సమాజానికి కటుంబం అంతే ముఖ్యం. వ్యక్తి వికాసంలో, ఎదుగుదలలో కుటుంబం ఎంతో ప్రముఖమైనది. కుటుంబం యొక్క విస్తృత రూపమే సమాజం. ఇస్లామ్ బోధనల్లో కుటుంబ వ్యవస్థను బలోపేతం చేసే ఎన్నో సూచనలున్నాయి. ఆదర్శ కుటుంబం ఏర్పడాలంటే, సుఖసంతోషాలతో జీవనం సాగాలంటే మనల్ని పుట్టించిన ఆ దైవాదేశాలకు అనుగుణంగా కుటుంబ జీవనం సాగించాలి. కుటుంబ వ్యవస్థలో మహిళల పాత్ర ఎక్కువగా ఉంటుంది. ఇస్లాం మహిళలకు కుటుంబ వ్యవస్థలో ఉన్నత స్థానాన్ని కల్పించింది. మహా ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఈ విధంగా తెలియచేశారు. “తల్లి పాదాల చెంతనే స్వర్గం ఉంది”.

అదేవిధంగా కుటుంబ వ్యవస్థలో పురుషులకు అనేక బాధ్యతలను ఇచ్చి కుటుంబ పెద్దగా గుర్తిస్తుంది. ఖుర్ఆన్‌లో ఈ విధంగా తెలియచేయబడింది: “పురుషులు స్త్రీలకు అధికారులు (ఖవ్వామ్), ఎందుకంటే అల్లాహ్ వారిలో ఒకరికి మరొకరిపై ఆధిక్యతను ప్రసాదించటం వల్ల, ఇంకా పురుషులు తమ సంపదను వారి కొరకు ఖర్చు చేస్తున్నందువల్ల” (ఖుర్ఆన్- 4:34).

పిల్లల పోషణ, విద్యా వ్యవహారాలు, ఇంటి స్థితిని సజావుగా ఉంచటం, బంధువులతో సంబంధాలు, కుటుంబ పెద్దల సేవలు మొదలైన అంశాలు భార్యా భర్తలు సరైన నిర్ణయాలతో బాధ్యతలు పంచుకుంటేనే ఆదర్శ కుటుంబం ఏర్పడుతుంది.

నేటి నవతరానికి సామాజిక, ఆర్థిక సంరక్షణకు, క్రమశిక్షణకు అవసరమైన సంస్కారాలను, విలువలను అందించటానికి కుటుంబమే ప్రధాన సాధనం. వైవిధ్యంగా కనిపించే సమాజం శాశ్వతమైన ఉనికికి కుటుంబ వ్యవస్థే ప్రభావవంతమైన, ప్రధానమైన కారణం. ఐతే నేడు మన సాంస్కృతిక పునాదుల నుండి కుటుంబాలు దూరమవుతున్నాయి. కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం అవుతుండడానికి వ్యక్తులలో పెరుగుతున్న భౌతిక వాదం, స్వార్థం కారణాలు. భౌతికవాదం ప్రబలిన కారణంగా మనుషులలో ‘నేను’ అనే భావన పెరగడం, విశృంఖలమైన కోరికలు, దురాశ, వత్తిడి వంటివి పెరిగి విడాకుల వంటి వాటికి దారితీస్తున్నాయి. పిల్లలకు కుటుంబంతో ఉండవలసిన భావాత్మకమైన అనుబంధం, సురక్షిత భావన లోపించిన కారణంగా పిల్లలలో ఒంటరితనం పెరుగుతోంది. ఫలితంగా యువతలో మాదక ద్రవ్యాల వినియోగం, హింసాత్మక, నేర ప్రవృత్తి పెరగడం, ఒక్కొక్కసారి అది ఆత్మహత్యలకు కూడా దారితీయడం జరుగు తోంది. వృద్ధులకు కుటుంబాలలో రక్షణ, పోషణ కరువై అది వృద్ధాశ్రమాల పెరుగుదలకు కారణమవుతుండడం అత్యంత ఆందోళనకరం. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో సజీవమైన విలువలతో కూడిన మన కుటుంబ వ్యవస్థను రక్షించుకోవటానికి సమగ్రమైన, తీవ్రమైన ప్రయత్నాలు జరగాలి. కుటుంబం అంతా కలసి భుజించటం, పండుగలు, చెయ్యటం, మాతృ భాషను వినియోగించటం, ద్వారా కుటుంబ జీవనాన్ని ఆనందదాయకం చేసుకోవాలి. కుటుంబము, సమాజము పరస్పర పూరకాలు. మన కుటుంబ వ్యవస్థలో తల్లిదే ప్రముఖ స్థానం. తల్లిని గౌరవించడం ద్వారా మాతృ శక్తిని గౌరవించడం, ప్రతి కుటుంబ సభ్యుడికి అలవాటు అవుతుంది. కలసి నిర్ణయాలు తీసుకోవటం ఎవరి కర్తవ్యాలను వారు సక్రమంగా నిర్వర్తించడం ద్వారా ఇతరైతర కుటుంబ సభ్యుల హక్కులను పరిరక్షించడం మన కుటుంబాలలో సర్వ సాధారణం కావాలి. త్యాగం, స్వీయ నియంత్రణ, ప్రేమ, ఆప్యాయత, పరస్పర సహకారం, సహానుభూతి వంటి గుణాలు కుటుంబ వైభవానికి సోపానాలవుతాయి.

✤ ✤ ✤

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**

# “పటిష్ట కుటుంబం-పటిష్ట సమాజం”

STRONG FAMILY STRONG SOCIETY
NATIONAL CAMPAIGN FEB 19-28 2021
WOMEN'S WING
Jamaat-e-Islami Hind

## ముహీంకు సంబంధించిన తెలుగు పుస్తకాలు

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్‌లో రెడీగా ఉన్నాయి

**17 పుస్తకాలు కొరియర్‌తో కలిపి రూ.300/-.**


నేరుగా మీ ఇంటికి వచ్చేస్తాయి

ఆన్‌లైన్‌లో పేమెంటు చేసి TIP యాసీన్ గారికి ఫోన్ చేసి వాట్సాప్‌లో అడ్రస్ పంపండి. ఇన్షా అల్లాహ్ ఒక్కరోజులోనే పుస్తకాలు మీకు అందుతాయి. త్వరపడండి.













































**TELUGU ISLAMIC PUBLICATIONS TRUST (Regd.)** Chatta Bazar,yd Herabad-500 002.

**For Online Payment Bank Details:TELUGU ISLAMIC PUBLICATIONS TRUST**

**Central Bank of India, Noorkhan Bazar Branch, HyderabadA/c. No. 1042789779 IFSC Code. CBIN0282407**

**మరిన్ని వివరాలకు సంప్రదించండి: 9700255736, 7660012481**